

ఆంధ్రసచిత్రవారపత్రిక
5-9-75
60 పైసలు


రక్త సంబంధాలు
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం
యం.మల్లికార్జునరావు
శ్రీఫిలింస్
VEEKAY



ఏవిఎమ్ ప్రొడక్షన్స్
పూజ
ఈస్ట్మన్ కలర్
దర్శకత్వం: మురుగన్ కుమరన్
చూడండి!
"జన్మజన్మల బంధం"
మహోజ్జ్వల సాంఘిక వర్ణ చిత్రం
AVM PRODUCTIONS
మాటలు ఎన్ ఆర్ నంది - పాటలు డా॥ దాశరథి, కొసరాజు - సంగీతం రాజన్ నాగేంద్ర

ఆంధ్రసచిత్రవారపత్రిక

పైవారం ! ⁂ ఎక్కువ పేజీలు

వినాయక చవితి సంచిక

● నవ్వు ●● ఎవరిది మోసం ? ●●● చలపతి ●●●● స్కోరెంత? మున్నగు కథలు. ●● '75గణపతి మున్నగు ఎన్నో వ్యంగ్యచిత్రాలు, ●● బైస్కోపు బాతాఖానీ లాంటి శీర్షికలతో - సినిమా సంగతి సరే సరి !! ●● గణపతి వాహనం ఎలుకా? నెమలిపిట్టా? (వ్యాసం) ●● సీరియల్ కథలు, మామూలు శీర్షికలన్నీ వుంటాయి!



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 5-9-'75
రాక్షసనామ సం॥ శ్రావణమాస బ. అమావాస్య
సంపుటము : 68 సంచిక : 51

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33-80
ఆరుమాసాల చందా – రు. 16-90
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
నటి జయచిత్ర

కథలు :

సీరియల్ కథలు :

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు

కథలు

సుజాత ముఖవర్చస్సుతో 22-8-75 నాడు వెలువడిన వారపత్రిక మా హృదయాలను ఆకట్టుకుంది. "దేవుడు లేని చోటు" అను కథ చాలా బాగుంది. "రాగవీచికలు" (సీరియల్) కథ ఈ వారం మా మనస్సులను రంజింప జేసినది. శ్రీ రాగతి పండరిగారు "హమేషా — తమాషా!" ను నేడు మన సంఘంలో జరిగే ప్రతిబింబంలా చిత్రీకరించారు.

—జి. రవికుమార్, జి ఉమారాణి,
ఆర్. ప్రసాద్ (బీర్‌బాన్‌బాగ్)

* * *

"తంగబడు"-మల్లాది సుజాతగారి కథ తగలబడినట్లే యున్నది. (సారీ!)

— శర్మ, నాగరాజు (డోన్)

నమ్మూ నమ్మకపో

నటి సుజాత ముఖచిత్రంతో వెలువడిన 22-8-75 సంచిక మాకెంతో సంతోషాన్ని కలిగించింది. "నమ్మూ నమ్మకపో" శీర్షికలో "కాన్ ఫెడరేట్ రోజ్" పూల మొక్క పూలు ఒకే రోజు మూడు రంగులు మార్చుతూదంటె నమ్మలేక పోవుచున్నాము.

"నేరం" కథ చిన్నదైన నీతి చాల పెద్దగా వున్నది. ఈ రోజులలో ఎంతైన దండుగలు చేస్తారు కాని కొంచెమైన దానం చేసేటందుకు ఎవరి మనస్సు ఒప్పదు శ్రీరామం పాత్ర ద్వారా రచయిత పి. వి. ఆర్. శివకుమార్ బహు చక్కగా వివరించారు.

—పాశం పాండురంగారెడ్డి మరియు
కుటుంబ సభ్యులు (కొండాబకష్‌పల్లి)

సినిమా

పుటలు తక్కువైనా ఆంధ్రపత్రిక శోభాయమానంగా, క్రొంగొత్త రుచులతో ప్రతీ వారం మా చేతి కందుతుంది.

సినిమాల విషయంలో శ్రీనివాస్‌గారికి ఒక సూచన : ప్రతీవారం ఏదో చిత్రాన్నో లేక ఏ నటులనో పొగడ్తా వ్రాసేకంటె మాకు తెలియని పాత, క్రొత్త నటులను లేక చిత్రాలను క్లుప్తంగా పరిచయంచేస్తే మాలాంటి సినిమా అభిమానులకు పత్రిక మరిత వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందనుటలో సందేహంలేదు.

—ఏలూరు అశోక్‌కుమార్ (గుర్రంపోడు)★

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

శ్రీ రాచర్ల రాఘవాచార్యులు


ఆరున్నర అడుగు ఆజానుబాహు శ్యామల గంభీర విగ్రహం, ప్రసన్నత తత్త్వం ఉట్టిపడే త్రిపుండ్ర శోభితమైన ముఖమండలం, పిన్నవానినైనా పెద్దగా ఆదరించే ప్రశ్రయం, అధికార తారతమ్యాన్ని గ్రహించి విషయ చర్చ చేసే వివేచనం, కదళీపాకమైన బోధనా వైశారద్యం, వాల్మీకి చెప్పిన రాఘవుని గుణాలతో ప్రముఖమైన పూర్వభాషిత్వం— ఇంకా మరెన్నో ఉత్తమ గుణాల సమాహారమయిన విద్వద్వరేణ్యులు శ్రీ రాచర్ల రాఘవాచార్యులు వారిని ఆగస్టు 10వ తేదీన వారి ద్వితీయ పౌత్రి సౌభాగ్యవతి శ్యామలక్ష్మి శ్రీ సి. రంగనాథం వివాహ సమయంలో దర్శించినప్పుడు,వారు అర్ధశతాబ్దిగా ఆంధ్రసంస్కృతాధ్యాపకులుగా చేసిన సేవ, వారి శిక్షణలో తెలుగు దివ్వెలుగా వెలిగిన శ్రీ దామోదరం సంజీవయ్య మొదలైన శిష్యుల పరంపర జ్ఞాపకం వచ్చి, నాకు వారి ఎడల అపూర్వమయిన భక్తి భావం కలిగింది. రాఘవాచార్యులవారిని దాదాపు 55 సంవత్సరాలుగా చూస్తున్న నాకు వారి సంభాషణ చాతురి నిత్య నూతనంగా కనిపిస్తుంది. కనిపించి పలకరించినప్పుడల్లా కొత్త సాహిత్య విషయాలు చెప్పి, కొత్త చాటు శ్లోకాలు ఉదహరిస్తారు "బహు కుటుంబి ఒక భక్తుడు శ్రీరంగం వెళ్ళి రంగనాథుల వారిని సేవించుకున్నాడు. ఎంత హాయిగా నాలుగు భుజాలు చాచుకుని ఎంత హాయిగా పాన్పుపై పడుకొన్నావయ్యా స్వామీ? నీకు ధనం, పసనం హారతి కర్పూరం చేసే ఆడపిల్లలు నీకు లేరు కాబోలు!—

శేషే శేషే విశేషణ ప్రసారిత చతుర్భుజం
ధనమానస హర కన్యా కిన్నజాతాకులేతవ?

అని స్తుతించాడు. ఈ శ్లోకం నేటికీ వర్తిస్తుంది" అంటూ వారు మందహాసం చేశారు. నిజంకాదూ! వారు కర్నూలు జిల్లా రాచర్లలో 1898లో జన్మించి 1918లో కర్నూలు మునిసిపల్ హైస్కూలులో ఆంధ్ర సంస్కృతోపాధ్యాయులుగా ప్రవేశించి 1953లో ఉపకార వేతనం పొంది, నారాయణగూడాలోని మాడపాటి బాలికల ఉన్నత పాఠశాలలో కొన్నేళ్లు పనిచేసి, ప్రస్తుతం దగ్గరకు వచ్చిన అంతేవాసులకు బోధిస్తున్నారు. వారు సంస్కృతంలో లక్ష్మీ శతకం, మరొక కావ్యం వ్రాశారు. సంస్కృతం శైలి

"జననితే దయితే కమలేక్షణే
భువన నిర్మితిలోచన కుట్మలే,
దరచల ద్భ్రు విలోకనలో భవేత్
స్థిరచరై రనుభావ్య—శుభాశుభమ్"

అని మధుర గంభీరంగా నడుస్తుంది. ఆచార్యులవారు పై మెట్టు నుంచి దిగరు. ఆత్మాభిమానం మెండు. శ్రీ దామోదరం సంజీవయ్య కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు, "రక్షకులు ఎవ్వరూ లేరని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకోండి. సహాయానికి ప్రయత్నిస్తాను" అని కోరారట. "రక్షకులు లేరని బొంకడం ఎందుకు?" అని ఆచార్యులవారు వ్రాశారుట. సంజీవయ్య ఆప్త సురుచి నారి ఉదారతకు, ఆత్మ గౌరవానికి మెచ్చుకుంటూ వ్రాసినఉత్తరం చూపారు నాకు. ఇంతటి నిండు కుండ, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవ రక్షకులు అయిన—ఆచార్యులవారు వేదోక్తమైన ఆయుస్సుతో శిష్య సంతతిని తామరతంపరగా పెంచాలని కోరుకోడం కన్నా నాబోటివాడు ఏరేం చేయగలడు!



గురూ! గురూ! మన ఆఫీసులో లేడీ టైపిస్ట్—నాకీ సెంటుసీసా బహుమతిగా ఇచ్చింది!!

రోజంతా ఆవిడ బల్లదగ్గరే నించొని—కబుర్లాడుతుంటావ్‌గా నీ చెమట వాసన భరించలేక అయియుంటుంది!!!

హైదరాబాద్ నోట్ బుక్

కర్ణాటక సంప్రదాయ కళ

కళాభవన్‌లో యిటీవల జరిగిన కళా ప్రదర్శనాలలో విశిష్టమైనది కర్ణాటక సంప్రదాయ కళాప్రదర్శనం. మైసూరు చిత్రకళాపరిషత్, ఆంధ్రప్రదేశ్ లలిత్‌కళా అకాడమీల యాజమాన్యాన ఏర్పాటయిన ఈ ప్రదర్శనాన్ని విద్యా మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు ప్రారంభిస్తూ, అనూచానంగా వస్తున్న ఆయా ప్రాంతాల సంప్రదాయాలను రక్షించడం అవసర

(46 వ పేజీ చూడండి)





ఉషారాణి భాటియా

తెల్లవారింది

నిక్కరు జేబులో ఏదో చల్లగా తగిలింది. సుబ్బిగాడు దాన్ని పైకి తీశాడు. సుద్దముక్క వంక తదేకంగా చూశాడు. అలా చూస్తున్నప్పుడు అతని మెడ ఓ పక్కగా వాలింది.

ఇంతలో రివ్వుని దుమ్ము లోపలికి వచ్చింది. అతను చటుక్కున కళ్లు మూసుకున్నాడు. కళ్లకి అడ్డు పెట్టుకోవాలనే ఆతురతలో రెండుచేతులు పైకిఎత్తాడు. సగం విరిగిన సుద్దముక్క చేతిలోంచి కిందపడి దొర్లిపోయింది.

సుబ్బిగాడు చాలా సేపటికి గాని కళ్లు తెరవలేదు. అందుకు కారణముంది. అతను పడుకున్నచోటికి ఎదురుగుండా పెద్దకిటికీ వుంది. ఆ కిటికీకి ఆనుకుని ఓచిన్న సందు. ఆ సందులో ఎప్పుడూ దుమ్ము రేగుతూనే వుంటుంది కాస్తంత గాలి వీస్తేచాలు, దుమ్ము అంచెలమీద; పైకిలేచి నాలుగు వైపులా వ్యాపిస్తుంది.

అదేం చిత్రమో, రోజూ సుబ్బిగాడు ఉదయం నిద్ర లేవకముందే కిటికీలోంచి దుమ్ము రేగుతుంది. ఆరోజుకూడా, సుబ్బిగాడు కళ్లు చికిలిస్తూ, ఒళ్లు దులుపుకుంటూ లేచినిలబడ్డాడు. ఇంతలో బైట టింగ్‌టింగ్ మన్న సైకిలుబెల్లు వినపడింది. సుబ్బిగాడు కిటికీ దగ్గిరకి పరుగెత్తుకెళ్లి బైటికి తొంగి చూశాడు. 'అమ్మా' అని పిలిచాడు.

ఆచుట్టుపక్కల మరేచప్పుడు వినపడలేదు. సుబ్బిగాడు మరో రెండుసార్లు కేకవేశాడు. అతనికి దాహంగావుంది. అది మామూలు దాహం కాదు. సుబ్బిగాడి వయసు పిల్లలకి సామాన్యంగా రోజూ ఉదయంవేసే దాహం. ఓర్పునశించి అతనికి కోపం వచ్చింది. ఆకోపం కాస్సేపటికి దిగులుగా మారింది. ఆ దిగులు మరికొంతసేపటికి జాలిగా మారింది. తను పడుకుని లేచినచోటులోనే మళ్ళీ కూలబడ్డాడు. మోకాళ్లు గడ్డానికి తగిలేటట్టు బాగా ముడుచుకుని పడుకున్నాడు. నాలుగువైపులా పూర్తిగ వెలుగు రాలేదింకా. కళ్లు మూసుకో

ప్రయత్నించాడుగానీ వాడికి మళ్లీ నిద్ర పట్టలేదు. కళ్లు మండుతున్నాయి. చేతితో నేల రాస్తూ ఆలోచిస్తున్నాడు.

అమ్మ! ఏమయింది? ఈపాటికి ఏం చేస్తూ వుంటుంది. ఆ పచ్చమేడ ఇంట్లో బావినీళ్లు తోడుతూ వుంటుంది. లేదా ఆ తోటయింట్లో అరుగు వూడుస్తుంటుంది. సుబ్బిగాడు ఇంక ఆలోచించలేకపోయాడు.

అతనికి కొద్దిగా చలివేసింది. లేచి కూర్చుని, చొక్కాని బుజాలమీదికి లాక్కున్నాడు. కిటికీ మూద్దామా అనుకుంటూ తలెత్తాడు. కిటికీవైపుకి వెళ్లాడేగానీ, ముయ్యలేదు. సందులోకి చూడటం ప్రారంభించాడు.

బైట అతని కళ్లకేదో కొత్తగా కనిపించింది. చెత్తా చెదారం పేరుకున్న ఇసుక మట్టి లేత బంగారు రంగులో మెరుస్తోంది. దూరాన్నుంచి కొట్టుకువచ్చిన ఎండుటాకులు, కాయితం ముక్కలు అందంగా వూగుతున్నాయి. రాత్రంతా వీధి అరుగుమీద పడుకుని, అప్పుడే నిద్రలులేచిన మనుష్యులు గలగల మాటలు ప్రారంభించారు తెల్లవార్లూ ఇళ్లకి పహారాకాచి, అరిచి, అలసిపోయిన కుక్కలు, తోకలు ఆడిస్తూ, వీధిమధ్యకి వచ్చి, తాపీగా కూర్చుంటున్నాయి. ఎదురుగా టీ దుకాణంలో కప్పులచప్పుడు సన్నగా వినబడుతోంది. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ స్త్రీలు అంట్లపనికి పరుగిడుతున్నారు.

ఎర్రచీర, పెద్దకొప్పు, కాలికి అందెలు, నల్లని/ఆ స్త్రీ కనబడగానే బుచ్చిగాడి ముఖం వికసించింది. కిటికీ వూచలు పట్టుకుని "అమ్మా" అని పిలిచాడు. కానీ ఆ స్త్రీ పిలుపుకి సమాధానం ఇవ్వక ధబీల్మని తలుపు తెరిచింది. గుడిసె చూరు తలకి తగలకుండా ఒంగి లోపలికి ప్రవేశించింది. ఆత్రంగా నలువైపులా చూస్తూ సుబ్బిగాడివైపు వచ్చింది· కోపం నటిస్తూ, ఒక్కుమ్మడిన అతని రెక్క పుచ్చుకుని కింద కుదేసింది. "ఎన్నిసార్లు చెప్పానురా సన్యాసీ! ఇలా పెందరాళే లేవద్దని పడుకో. ఇంకా చాలా పొద్దుంది. అన్నది. వాడు తల్లిని కరచుకుని "అమ్మా! దాహమే" అన్నాడు. ఆమెకి అర్థమయింది. "నానాయనే! ఇప్పుడే పట్టుకొస్తాను" అంటూ సత్తుగిన్నె పట్టుకుని, నిముషంలో బైటికి పరుగెత్తింది.

సుబ్బిగాడు మళ్లీ ముడుచుకుని యథాస్థానంలో కూర్చున్నాడు. కళ్లు ఆర్పకుండా తల్లి వెళ్లినవైపే చూస్తున్నాడు. టీ కొట్లోకి వెళితే ఉజ్జాయింపున తల్లి ఎంతసేపటికి తిరిగివస్తుందో అతనికి తెలుసు. కానీ ఆవేళ అతని ఊహ తప్పయింది. తల్లి ఎంతకీ తిరిగిరాలేదు. అతను ఆత్రంగా లేచి నిలబడ్డాడు. కిటికీ వూచలకి తల ఆనించి తల్లికోసరం ఆత్రంగా చూస్తున్నాడు. అతనికి చలివేసింది. కానీ అక్కణ్ణుంచి

కదలలేదు.

వెనక్కి తిరిగితే ఏముంది? మళ్లీ ఆ మట్టి నేల. చింకి దుప్పటి. చీకటి. మూల అతనికి ప్రపంచాన్ని చూపించేది ఈ కిటికీయే! అతనిలో ఆశలు చిగిర్చేది ఈ కిటికీయే! అతనిలో ఉత్సాహాన్ని రేకెత్తించేది ఈ కిటికీ గోని వెలుతురే! అతనిలో కొత్త భావాల్ని రేపేది ఈ కిటికీలోంచి వీచే గాలియే! అలాటి కిటికీని ఎలా వదలటం?

ఓ రోజు సుబ్బిగాడు ఆ కిటికీ దగ్గర నిలబడి చూస్తుండగానే మీసాల తాతయ్య కనిపించాడు. సన్నగా, పొడుగ్గా, వంగిన నడుం, చేతిలో కర్ర. తాతయ్య తెల్లమీసాలు సుబ్బిగాడికి చిత్రంగా అనిపించాయి. చెంగున బైటకివెళ్లి ఆ తాత కెదురుగావెళ్లి నిలబడ్డాడు. అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూడసాగాడు. ఓ చెయ్యి కళ్ల కెదురుగా పెట్టుకుని నడుస్తున్న తాత సుబ్బిగాడి చిన్నారి పాదాలు చూసి ఆగాడు. నవ్వుతూ పలకరించాడు ఆ రోజు నుంచే వాళ్ల నేస్తం ప్రారంభమయింది.

అప్పటినుంచి రోజూ తాత ఆ వైపు వెళ్లేవాడు. సుబ్బిగాడి కిటికీముందు ఆగి, వాడికోసం వెతికేవాడు. వాడితో ఎన్నో ఖబుర్లు చెప్పేవాడు. సుబ్బిగాడి గురించి ఎన్నో ప్రశ్నలడిగేవాడు. ఆ తాతే సుబ్బిగాడితో ఓరోజు అన్నాడు కదా, "చూడు నాయనా! మా రోజులు వేరు. మేము మురికి పేటల్లో పుట్టాము. అక్కడే పెరిగి పెద్దవాళ్ల మయ్యాము. మీరు అలా కాదు. ఇలాటివాడల్లో పుట్టినా మీకు మంచి భవిష్యత్తు వుంది. మీకు ఉపకారం చేసే ఆసాములెందరో ఈనాడు వున్నారు. మీకు ఎన్నో సౌకర్యాలు కలుగుతాయి. మీరు మాలాగ బిచ్చమెత్తుకో నక్కరలేదు. దొరబాబులు అవుతారు."

సుబ్బిగాడి చిన్న మనసుకి ఈ మాటలు అర్థం కాలేదు. కానీ ఓ రోజు వాడి అమ్మ అన్నది కదా, "ఒరేయ్ సుబ్బీ! ఈ మాటు నిన్ను లచ్చి, రాము, సోములతో ఆడటం చూశానా, ఎముకలు విరగగొడతాను. మట్టిలో ఆడావంటే దుమ్ము కొట్టి జబ్బు పడతావురా! వీధిలోకి వెళ్లకు. నా తండ్రి బడికివెళ్లి చదవాలి. దొరబాబు అవాలి."

అందుకనే సుబ్బిగాడు వీధిలోకి వెళ్లడు. ఇరుగు పొరుగు కుర్ర కుంకలతో కలవడు. ఎవరన్నా కలిసి ఖబుర్లు చెప్పమనీ, బ్రతిమాలినా, బెదిరించినా లొంగిపోడు. వాడి చిన్నారి బుర్రనిండా బోలెడన్ని ఆలోచనలున్నాయి. వాడి లేత మనసు నిండా కోకొల్లల ఆశలున్నాయి. వాడి కళ్లు ఎప్పుడూ ఏదో వెలుగు కోసం వెతుకు తుంటాయి.

ఆ కిటికీలోంచి బైటికి చూస్తుండే సుబ్బిగాడికి రకరకాల ఊహలు కలిగేవి. నేను చూస్తున్న ప్రపంచం ఎప్పుడూ ఇలాగే వుండలా ఏం? ఈ చెట్లు, యిళ్లు, వీధులు మనుషులు మారకూడదా? పచ్చమేడ లాటి ఇళ్లు ఇక్కడ రావచ్చు. తనకి ఒంటినిండా చొక్కా. కాళ్లకి చెప్పులు. సత్తుగిన్నె బదులు అమ్మ చేతిలో మంచి సంచీ. సుబ్బిగాడి ఒళ్లు పులకరించేది. అవునురోజూపొద్దు పొడుస్తుంది. కానీ రోజూ జీవితం ఒకలాగ వుండనక్కరలేదు. తెల్ల మీసాల తాత అస్తమానం అంటుంటాడు కదా! మార్పు వస్తుందని, మొన్న గాంధీటోపీ పెట్టుకుని ఈ సందులోకి వచ్చిన లావుపాటి ఆయన చెప్పలేదూ, మార్పు రాక తప్పదని. వచ్చితీరుతుంది. ఈ బస్తీ పెద్ద భవనాలతో, తోటలతో నిండిపోవచ్చు, లేదా తనే ఈ స్థలం వదిలి మరో మంచి చోటుకి తరలిపోవచ్చు. తన బ్రతుకంతా ఈ మట్టిలోనే కొట్టుకు పోవాలనేమిటి? అలా ఆలోచిస్తూనే సుబ్బిగాడు ఓ రోజున చిన్న సుద్దముక్క సంపాయించాడు తన కేదో పెద్ద చదువు లొచ్చేసినట్టు భావిస్తూ నేల మీద పిచ్చిగీతలు గీసేవాడు. వాటిని చూసుకుని తనలో తనే మురిసిపోయేవాడు.


* * *

ఆ రోజున సుబ్బిగాడి తల్లి ఓ పట్టాన టీ కొట్టులోంచి బైటికి రాలేదు. వాడిదాహం చల్లారిపోయింది. శోషవచ్చినట్లు కళ్లు తిరుగుతున్నాయి. గోడకి జారగిలబడి కునుకు తీస్తున్నాడు. ఇంతలో తల్లి వచ్చి, జబ్బ పట్టుకుని, గబగబ వూపింది, "ఒరేయ్, సుబ్బీ! ఇంద తాగు, నేను తొందరగా వెళ్లి పోవాలి. ఇవాళ మన బస్తీకి పెద్దబాబులంతా వస్తారు. నాకు పనుంది"అంటూ పరుగెత్తింది.

సుబ్బిగాడు ఆవురావుర్న టీ నీళ్లు తాగాడు. కాస్త సత్తువ వచ్చినట్లయి లేచినిలబడ్డాడు. తల్లిని వెతుక్కుంటూ బైటికి పరుగెత్తాడు.

అప్పటికే వీధిలో చాలామందిజనం మూగి వున్నారు. గట్టిగా అరుస్తూ మాట్లాడుకుంటున్నారు. వాళ్లమధ్య తెల్ల మీసాల తాతయ్య వున్నాడు. గాంధీ టోపీ లావుపాటి ఆయన కూడా నిలుచున్నాడు. సుబ్బిగాడికి అక్కడ తల్లి కనపడలేదు. ఇంతలో పెద్దగా శబ్దం చేసుకుంటూ రెండు జీపులు సందులోకి వచ్చి ఆగాయి. అందులోంచి ఎర్రటోపీలు పెట్టుకున్న వ్యక్తులు కొందరు హడావుడిగా దిగారు.

కొందరుగట్టిగా ఏడుస్తున్నారు. కొందరు పోట్లాడుతున్నారు. సుబ్బిగాడికి భయమేసింది "అమ్మా"అని పిలుస్తూ నాలుగు వైపులా వెతకసాగాడు. అంతే, ఆ తరువాత వాడికేం జ్ఞాపకం లేదు.



సుబ్బిగాడు కళ్ళు తెరిచేసరికి అమ్మ ఒళ్ళో వున్నాడు. పైన పచ్చని కొబ్బరిచెట్టు నీడ విస్తూంది. పక్కన రెండు సత్తుగిన్నెలు. చిన్నబట్టలమూట. అమ్మ ఒక్కర్తే కాదు. అక్కడ చాలామంది వున్నారు. చెట్లనీడల్లో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. సుబ్బిగాడికి ఏదో భయమేసింది. "అమ్మా" అంటూ తల్లిని కరుచుకున్నాడు. ఆరోజు వాడితల్లి పనికిపోలేదు. మధ్యాహ్నమయింది. పొద్దువాలింది. నీరసంగా తల్లిని కరుచుకుని పడుకున్న సుబ్బిగాడికి తన జీవితంలో పెద్ద మార్పుఏదో రానేవచ్చిందన్న భావం కలిగింది.

*　*　*

తెల్లవారింది. సుబ్బిగాడు కళ్ళుతెరిచి కిటికీకోసరం వెతికాడు. కాని చుట్టూతా వెలుతురు — అంతా వెలుతురె. వాడి కళ్ళకి ఆ వెలుగు మిరమిట్లు గొలిపింది. పక్కనే పడుకున్న తల్లిని "అమ్మా! దాహం" అంటూ లేపాడు.

ఆమె లేచింది ... నీరసంగా తూలుతూ, సుబ్బిగాణ్ణి వెంటేసుకుని వీధిలోకి వచ్చింది. కొత్తసందులు, పరిసరాలు, వాడు ఆసక్తిగా చూస్తూ, లేనిశక్తి తెచ్చుకుని, గబగబ అడుగు లేస్తున్నాడు. ఇంతలో ఓ దృశ్యం చూసి చటుక్కున ఆగిపోయాడు. ఆ స్థలం అతనికి చిరపరిచితంగా కనిపించింది. కానీ ఒక్కటే తేడా. ఇప్పుడక్కడ ఆ గుడిసెలు లేవు. మురుగు కాలవ లేదు. ఖాళీ స్థలం.

తెల్లవారింది

విశాలంగా వుంది. అతి విశాలంగా పరచుకుని వుంది.


సుబ్బిగాడి మనసు ఓ క్షణం ఆనంద పడింది కళ్ళు తళ తళ మెరిశాయి. "అమ్మా, తాత చెప్పిన మాట నిజమేనా? ఇక్కడ పెద్ద బంగళాలు వస్తాయా?" అనడిగాడు. తల్లి అతనివంక అయోమయంగా చూసింది. వెంటనే ఒంగి పిచ్చి సుబ్బిగాడి, పదేళ్ల ఆ చిన్నవాడి బుజం తట్టింది. "అప్పన్నా! ముందుకి పద" అంది.

తాత చెప్పిన మార్పు ఇదేనేమో! ఆ రోజు తెల్లటోపీ ఆయన వర్ణించిన మార్పు ఇదే లాగుంది. అక్కడ లేచే బంగళాలలో తనూ అమ్మా వుంటారా? ఎందుకుండకూడదు? సుబ్బిగాడి మనసు ఆనందంతో ఊగిసలాడింది. ఉత్సాహంతో గబ గబ ముందుకి అడుగు లేశాడు.

వాడి వెనకాలే ఉవ్వెత్తున దుమ్ము లేచింది. ఆ దుమ్ములో వాడి పాదాల గుర్తులు ఇట్టే చెదిరిపోయాయి.

సుబ్బిగాడి లాటివాళ్ళు యింకా ఎందరో వున్నారు. వాళ్ళంతా ఆ వీధిలో అడుగు లేస్తూ వెళుతూనే వున్నారు. ఉవ్వెత్తున లేచిన దుమ్ములో వాళ్ల పాదాల గుర్తులు చెదిరిపోతూనే వున్నాయి.

తూరుపున తెల్లవారుతూనే వుంది.



[గత సంచిక తరువాయి]

ఇంతలో అన్నపూర్ణమ్మ దేవయ్యయింటికి అమాంతంగా ఊడిపడింది.

"ఏమిరా అన్నయ్యా! మా అబ్బాయికి సంబంధాలు చాలా వస్తున్నై. ఎవరు వచ్చినా మేనరికం ఉందని చెబుతున్నాను. నువ్వేమో బెల్లంకొట్టిన రాయల్లే కూర్చున్నావు. పిల్లనిస్తానని అనవైతివి. ఒక కడుపున పుట్టిన వాళ్లం కదా — మనమే అడిగితే కొమ్ములూ గొలుసులూ పోతాయా అని నా అంతట నేనే బయలుదేరి వచ్చాను.తేల్చుకోవడానికే వచ్చాను.

ఆడపిల్లల వాళ్లకి ఒక సౌకర్యం ఉంటుంది. కావాలన్న మగపిల్లవాణ్ణి వెతుక్కోవచ్చు. మగపిల్లలవాళ్ళు పిలిచిన చోటికే వెళ్లి, ఆ పిల్ల నచ్చిందో నచ్చలేదో చెప్పవలసిన వాళ్లేకాని, మీ అమ్మాయిని మా అబ్బాయికిస్తారా అని అడిగే అవకాశం లేదు. నువ్వూ నేనూ ఒక తానులో ముక్కలమే కనుక, బింకాలు పోకుండా, నేనే మీ అమ్మాయిని మా అబ్బాయికిమ్మని అడగడానికి వచ్చాను. వింటున్నావా వదినా!" అని భామమ్మనుకూడా హెచ్చరించింది.

"వింటూనే ఉన్నా. ఆయన అన్నయ్య. నువ్వు చెల్లెలివి. మధ్య నేనెవ్వరిని. నాదేమున్నది! పరాయిదాన్ని" అన్నది భామమ్మ.

"పప్పులేని పులగం ఉంటుందా వదినా! భార్యాభర్తలు ఎప్పుడయినా ఒకటే. మిగిలిన వాళ్లే పరాయివాళ్ళు. రేపు కన్యాదానానికి పీట మీద కూర్చునే దానవు నువ్వు. నాకిష్టం లేదు నేను కూర్చోనంటే మా అన్నయ్య ఏం చేస్తాడు? నా కోసం, మీ యిద్దరిమధ్యా తేడా రాకూడదు. మీ క్షేమం కూడా నేను కోరవలసినదానను. మీ యిద్దరికీ యిష్టమయితేనే యీ సంబంధం కుదురుతుంది. నీ కిష్టంలేకపోతే, దీనివల్ల మీ యిద్దరి మధ్యా పొరపులు వస్తే నేను చేసుకోనే చేసుకోను."

"నా కిష్టంలేదు" అన్నది భామమ్మ నిష్కర్షగా.

"విన్నావా అన్నయ్యా!" అన్నది అన్నపూర్ణమ్మ.

"విన్నానమ్మా! విన్నాను. ఖంగుమని మాట్లాడింది మీ వదిన. నాకు చెవుడు లేదుకదా అమ్మా."

"కారణం కనుక్కో."

"కారణం కనుక్కునే వాడినయితే నేను

మేనరికం

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

దేవయ్య నెల్లా అవుతాను! పిల్లకు చాలా సంబంధాలు చూశామమ్మా! ఒక్కటీ నచ్చ లేదు. ఎవరి లిఖితం ఎల్లా ఉంటే అల్లా జరుగుతుంది.''

''నేను బయలుదేరి వస్తూంటే బావ అననే అన్నారు నా పుట్టిల్లు — అని ఎగురు కుంటూ వెడుతున్నావు. నీకు శృంగభంగం అవుతుందని. వారన్నట్టే అక్షరాలా అయింది''

''ఈ శృంగం భంగం నీకు కాదు. నాకు!'' అన్నాడు గద్గద స్వరంతో దేవయ్య.

''ఇంకేం సరి — అన్నకు తగ్గ చెల్లెలు. చెల్లెలుకు తగ్గ అన్న! అయినా వదినా మా అమ్మాయి బి. ఎ. చదువుతోంది కదా! ఏమని వచ్చి అడిగావు చేసుకోవడానికి తగుదు నమ్మా'' అని యీసడించింది భామమ్మ.

అన్నపూర్ణమ్మ దానికి సమాధానం చెప్ప దలచుకో లేదు. అయినా సన్నగా ''కావలసిన సంబంధంలో నాలుగు క్లాసులు ఇటుయితే ఏముంది, అటయితే ఏముంది. అంతస్సులో చేసుకోవాలని ఉంటే అవేం పట్టింపుకు రావు వదినా! అయినా మిమ్మల్ని కట్నాలూ కాను కలూ ఏమయినా అడిగానా ?''

''అల్లా అడక్కపోవడంచేతేనమ్మా నువ్వు చవకయిపోయింది'' అన్నాడు దేవయ్య.

భామమ్మ దేవయ్య వంక చురచుర చూసింది. ''వత్తాసి బాగానే ఉంది'' అని పెదిమెలు కొరుక్కుంది.

మీనాక్షి యీ ప్రసంగం అంతా వింటూ కుమిలిపోతోంది.

అన్నపూర్ణమ్మకు రాత్రల్లా నిద్రపట్ట లేదు ఆమెకు వసారా గదిలో ప్రక్క వేశారు. భామమ్మ తన భర్త తన కెదురు చెప్పనం దుకూ, మీనాక్షి కల్పించుకోనందుకూ సంతో షించి నిశ్చింతగా నిద్రపోయింది.

మీనాక్షి తెల్లవారకట్ట లేచివచ్చి అన్న పూర్ణమ్మ ప్రక్కలో పడుకుంది.

''అత్తా! నువ్వు ఏమీ అనుకోకు. మామూలుగా వస్తూపోతూ ఉండు''

అన్నపూర్ణమ్మకు కన్నీళ్లు ఆగలేదు. చేతితో మీనాక్షి కళ్లను చీకట్లో తడిమిచూచింది. కళ్లవెంబడి నీరు కారుతున్నట్లు గమనిం చింది. ''పిచ్చిపిల్లా! ఊరుకో!'' అని గట్టిగా కౌగలించుకుని కన్నీళ్లు తుడిచింది. ''వెళ్లమ్మా! నీ పక్కలోకి వెళ్లు. నీ అమ్మ తాటక, ఇప్పుడిక్కడ చూస్తే నీకు చివాట్లు, నాకు విసిరాట్లు తప్పవు. మా అన్నయ్య కనుక మీ అమ్మతో వేగుతున్నాడు'' మీనాక్షి వెళ్లలేక వెళ్లలేక వెళ్లిపోయింది.

అన్నపూర్ణమ్మ వెళ్లిన మరురోజు నుంచీ దేవయ్యను సంబంధాలు చూచిరమ్మని భామమ్మ ఇబ్బడి ముబ్బడిగా తొందర చేయ సాగింది. పెళ్లిచూపులకు క్రొత్తవాళ్లు దిగారు. మీనాక్షి ఒకడికి ఆడంగిరేకుల వాడని పేరు పెట్టింది, నడక, మాట, చూచి. ఒకడు 'సైరన్' కూసినట్లు మాట్లాడు తాడని వంక పెట్టింది, వేరొకడికి మనస్సులో పాలుతాగే మనిషనీ, నూతులో వడ్డట్టుగా మాట్లాడుతాడనీ వంక పెట్టింది మీనాక్షి పెట్టిన యీ వంకలన్నీ న్యాయమైనవే అని భామమ్మ తృప్తిపడింది. ఒక సంబంధం వస్తే—యీ సంబంధానికి మా అమ్మాయి ఏ వంకా పెట్టడానికి వీలులేదని అనుకుంది. తల్లిని లోపలికిపిల్చి మీనాక్షి '' బాబోయ్ '' అంది.

'ఏమిటంది' తల్లి.

''వేళ్లు చూశావా, బండలు. రూళ్ల కర్రలల్లేఉన్నై. ఏమీ నాజూకులేవు కొడితే ఒక్క దెబ్బతో వైకుంఠమే'' అన్నది.

తల్లి మళ్లీ బయటకు వచ్చి పెళ్లికొడుకు వేళ్లవంకకు చూచింది. సరిగా అల్లాగేఉన్నై.

''మా అమ్మే! ముందుగా చెప్పావు. లేకపోతే నిలువునా నీ గొంతుక కోసేదాన్ని'' అని ఆ సంబంధం వదలుకొంది.

బి. ఎ. ఫైనల్ యియరు పరీక్షలు దగ్గరకు వచ్చేస్తున్నై. కాలేజీ నుండి సాయంత్రం ఏలూరురోడ్డుమీదుగా ఇంటికి పోతోంది మీనా ఒకరోజున. రోడ్డు వెంబడి కులాసాగా నడిచి వెడుతోంది. దారిలో బావ 'సుందరం' కన్పించాడు.

''ఎప్పుడొచ్చావ్ బావా''

''పదకొండు గంటలకు వచ్చాను''

''భోజనానికి మా యింటికి వెళ్లలేదా?''

''వెళ్లలేదు. హోటలులోనే భోజనం చేశాను.''

''అదేమిటి - బావా!''

''ఆ యింట్లో నాకు స్థానంలేదు,మీనా!''

మీనాక్షి కళ్లలో నీళ్లు తిరిగినై.

''బావా! ఈ హోటలులో కాఫీ అయినా తాగుదాం, రా, బావా''

''అల్లాగే''

ఇద్దరూ వెళ్లి ఫామిలీ రూములో కూర్చున్నారు.

''స్వీట్—ఏమి కావాలిసార్'' అన్నాడు సర్వర్.

''రెండు బాదం కేకులు'' అన్నది మీనాక్షి. తెచ్చాడు. ''బావా! నీకు తీపి చాలా ఇష్టం కదూ!''

''నాకేది యిష్టమో నీకింకా జ్ఞాపకం వుందా మీనా.''

''ఉన్నది. బావా! నేను ఏదీ త్వరగా మరచిపోయేదాన్ని కాదు. నా కేకులో కూడా సగం తీసుకో బావా!'' అని తుంపి సుందరం ప్లేటులో పడవేయబోయింది.

''వద్దు వద్దు'' అంటూ అడ్డం పెట్ట బోతుంటే మీనా వేళ్లు తగిలినై.

''వేళ్లు వదులు బావా! వేళ్లకంటె కేక్ తియ్యగా వుంటుంది''

సుందరం సిగ్గుపడ్డాడు.


''బావా! మైసూర్‌పాక్ తిందామా?''

మీనాతో కాలక్షేపానికి వీలుగా ఉంటుం

రాలిన ముత్యాలు

శ్రీ సోమసుందర్

కలిమి ఉంటే ఈర్ష్య పడేవాళ్లూ
లేమి ఉంటే చీదరించుకొనేవాళ్లూ
అని బంధువులంటే ఇటీవల
ఒక కొత్త అర్థం స్థిరపడింది.



కుచేలకథలోని అంతరార్థం

శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు కుచేలుడు గర్భ దరిద్రుడు. గంపెడంత సంసారాన్ని భరించడం సాధ్యం కాలేదు. ఆకలితో పరితపిస్తున్న పిల్లల దీనాలాపాలను వినలేక- భార్య ప్రోత్సాహంవల్ల ద్వారకకు పోదలచాడు. శ్రీకృష్ణుణ్ణి యాచిస్తే కొంత ధనం ఇవ్వగలడని అతని విశ్వాసం. ఉత్తచేతులతో అతని వద్దకుపోకూడదు కనుక, ముక్కిపోయిన అటుకులు మూడుపిడికిళ్లు తన అంగవస్త్రాన మూటకట్టుకుని మరీ బయలుదేరాడు. ఎంతో శ్రమపడి ద్వారకను చేరుకున్న కుచేలుడు తనకు శ్రీకృష్ణుని దర్శనం సులభంగా లభించదేమో అని సందేహపడ్డాడు. కాని, సులభంగానే ఆ మహనీయుని దర్శనం లభించింది. అతడు ఆప్యాయతతో తనతోపాటు తన తల్పంపై కూర్చుండబెట్టుకుని ఎంతో గౌరవించాడు, కుచేలుణ్ణి.

కుచేలుడు తానెందుకువచ్చినదీ చెప్పుకోలేకపోయాడు. అయినా శ్రీకృష్ణుడు సంగతిని గ్రహించి 'నాకు కానుకగా ఏమిటి తెచ్చా' వంటూ, అతడు సిగ్గుపడి ఇవ్వకపోయినా, అంగవస్త్రంమూట విప్పి,అటుకులు తీసుకుని నోట్లో వేసుకుని ఎంతో తృప్తిని పొందాడు. అదే పదివేలనిపించింది కుచేలుడికి. మర్నాడు ప్రొద్దున ఏమీ ఇవ్వకుండానే కుచేలుణ్ణి శ్రీకృష్ణుడు సాగనంపాడు. ఊరికివచ్చి చూసేసరికి తన సంపదను చూచి కుచేలుడు ఎంతో ఆశ్చర్యపడ్డాడు. అతని కష్టాలుగట్టెక్కాయి. ఈ కథవల్ల ఒక విశేషార్థాన్ని ఊహించవచ్చును.

శ్రీకృష్ణుడూ, కుచేలుడూ బాల్యమిత్రులంటే—జీవాత్మ, పరమాత్మలకు సంబంధం ఉన్నదన్నమాట. జీవాత్మ మాయకు లోబడి, అనేక జన్మలను పొంది, పరితపించడం కుచేలుని కుటుంబ వృత్తాంతం సూచిస్తూ ఉన్నది. తుదకు జీవుడు ఆలోచించి, పరమాత్మను చెందడానికి చేసే పెద్ద ప్రయత్నమే ద్వారకానగర ప్రయాణం! జీవుడు ప్రారబ్ధ, సంచిత కర్మలను మూటకట్టుకుని వుండడమే కుచేలుడు అంగవస్త్రంలో కట్టుకున్న ముక్కిపోయిన అటుకుల మూట. పరమాత్మను చేరేటప్పుడు ఆ కర్మబంధం విడిపోవాలికదా! శ్రీకృష్ణుడు ఆ మూటను విప్పి,అటుకులను ఖాళీ చేశాడంటే—పరమాత్మ జీవాత్మను కర్మబంధంనుంచి విడిపించినాడని అభిప్రాయం. ఇక జీవాత్మకు కావలసినదేమున్నది? అతడు పరమాత్మను చేరుకుని, పరమానంద భరితుడైనాడు!

కుచేలుని దారిద్ర్యం తొలగిపోయి, అతడు శ్రీకృష్ణుని అనుగ్రహంవల్ల సమస్తైశ్వర్య సంపన్నుడైనాడంటే — జీవాత్మ పరమాత్మను చేరి నిర్భరానందాన్ని అనుభవించాడనే. ఇక జన్మ పరంపరా సంబంధం లేక ముక్తిని పొందాడనీ గ్రహించాలి.

దని సుందరం ఊరుకున్నాడు. సర్వర్ తెచ్చాడు.

"తినకుండా కూర్చున్నావేం బావా"

"తినేస్తే, మళ్లీ నీ ప్లేటులోది తుంపి వేస్తావు. నువ్వు పూర్తిగా తినేదాకా నేను తినను"

"సరేలే- పాపం స్వీటు ఎదురుకుండా పెట్టుకుని ఎంతసేపు కూర్చుంటావ్" అని గబగబా తన ప్లేటులోది తాను తినేసింది.

"ఇందాక నువ్వు వేసిన సగం కేకు తిన్నాను. ఇప్పుడు నువ్వు సగం మైసూర్ పాక్ తినాలి."

'బలే పేచీ వేశావే'

"అవును. ఫిఫ్టీ—ఫిఫ్టీ"

"నాకు తీపి సయించదు. అంతా నువ్వే తిను బావా!"

"మధుర పదార్థం సహించకపోవడమేమిటి! వేషం కాని"— అని గడ్డం చేత్తో పుచ్చుకు నోరు తెరచి నోట్లో కుక్కాడు. మీనా తినేసింది.

"నేను నీ నోట్లో వేశానా బావా! నువ్వు

మేనరికం

నా నోట్లో ఎందుకు వేయాలి."

"నువ్వ నా నోట్లో ఎందుకు వేయక పోవాలి"

"బాగుంది వరుస నీది మోటసరసం బావా! అందుకనే మా అమ్మకు నన్ను నీకివ్వడం ఇష్టం లేనిది"

సుందరం చిన్నపుచ్చుకున్నాడు.

"ఏం బావా అలా ఉన్నావు. నీకు కష్టం కలిగించానా?"

"అల్లా చెప్పిందా మీ అమ్మ"

మీనా పకపకా నవ్వింది. "అల్లా చెబుతుందా?"

"పోనీ నేను మోటసరస మాడనని వ్రాసి ఇస్తే మీ అమ్మ ఒప్పుకుంటుందా?"

"పేచీలు నీకూ తెలుసు."

సర్వర్ వచ్చాడు. "రెండు ప్లేట్లు కారబ్బూంది" అన్నది మీనా గంభీరంగా. సర్వర్ తెచ్చాడు.

"నేను నీ నోట్లో వెయ్యాలని నీకు మనసుగా ఉందిగా పాపం! పోనీ తీర్చుకో" అని ఒక చెంచా కారబ్బూంది సుందరం నోట్లో వేసింది.

సుందరం కళ్లల్లో నీళ్లు తిరిగినై. అది చూచిన మీనా కళ్లల్లో కూడా నీళ్లు తిరిగినై. సుందరం తన ప్లేటులో కారబ్బూంది ఒక చెమిచా మీనా నోట్లో వేశాడు.

'మీనా' అన్నాడు నిట్టూరుస్తూ.

"చెప్పు బావా!"

"చాలా మంది వచ్చి నిన్ను చూసి వెళ్లారుటగా!"

"చూశారు. వెళ్లారు."

"ఏం. వాళ్లల్లో ఎవరూ నచ్చలేదా?

"ఏం ప్రశ్న — బావా, అది! నువ్వుకూడా క్యూలో నుంచోకపోయావా?"

మీనా ప్రశ్నలో కొంటెతనం ఉన్నా, అనేతీరులో విచారమే ప్రకటించింది.

"నేను క్యూలో నుంచోడానికి కూడా అర్హుడను కానుకదా!"

మీనా కళ్లవెంబడి బొట బొట నీరు కారింది. సుందరం జేబు రుమాలతో

తుడిచాడు.

"స్వీటు తినేటప్పుడు మన ప్రసంగం తియగాఉంది. హాటు తినేటప్పుడు కారంగా ఉంది బావా! అవునుకాని, బావా నువ్వు పెళ్లి చేసుకోరాదా ?"

"ఎవరిని ?"

"ఎవరినో ఒకరిని"

"ఎవరినో ఒకరిని చేసుకోక ఎల్లాగూ తప్పదు. కానీ నీపెళ్లి అయ్యేదాకా నేను పెళ్లి చేసుకోను. నిన్ను పెళ్లిపీటలమీద ఆశీర్వదించి మరీ చేసుకుంటాను"

"గుండె కోసేస్తున్నావు బావా!"

"నీకింకా గుండె ఉంది మీనా. మీ అమ్మ మా అమ్మతో పిల్లనివ్వనని చెప్పిన తర్వాత నాకున్నది అసలుగుండె కాదు. ఇనపగుండె"

సర్వర్ లోపలకువచ్చి "కాఫీ తీసుకురానా సార్!" అన్నాడు.

'ఊ' అన్నది మీనాక్షి.

"మీనా! నేను యస్. యస్. యల్. సి. మాత్రమే చదువుకున్నాను. నువ్వు బి.ఏ. అన్నదిటగా మాతృదేవత!"

"నేను బి.ఏ. అయినందుకు నీకు బాధగా ఉన్నదా బావా"

"లేదు. సంతోషంగా ఉంది. కాని ఆ సంతోషంవలన ప్రయోజనం ఏమిటి ?"

"ఊరికే ఇంట్లో కూర్చోలేక చదువు తున్నాను బావా! అయితే నువ్వూ ప్రయివేటుగా చదివి డిగ్రీ తీసుకోరాదా !"

"తీసుకోవచ్చు అల్లా చదివినతర్వాతనైనా మీ అమ్మ ఇస్తుందని నమ్మకం ఉంటే"

"ఆడవాళ్ల చదువు ఏం చదువులే బావా! వేగంవస్తుంది వేగంగా మరిచిపోతారు"

"ఎవరు చెప్పారు ?"

"పోతన్నగారు చెప్పారు ప్రహ్లాదుడు గర్భంలో ఉండగా నారదులవారు వేదాంతో పదేశం చేస్తే, గర్భంలో ఉన్న తనకు జ్ఞప్తి ఉన్నదనీ, ఆడదికనుక తల్లి మరచిపోయిందనీ"

"అయితే భాగవతం బాగా చదువులా వన్నమాట"

కాఫీ త్రాగుతున్నారు.

"బావా! భాగవతంలో నాకు బాగా నచ్చింది రుక్మిణీ కల్యాణం. నువ్వు చదివే ఉంటావు బావా!"

"కాఫీ స్టిమ్యులెంటు."

మీనా కోపంగా చూచింది.

"అమ్మతో అన్నాను మీనా! రుక్మిణీ కల్యాణం మోస్తరుగా మీనా కల్యాణం చేసే స్తానని. అమ్మ ఒప్పుకోలేదు. రాక్షస వివాహం రాచవారికేగాని మనకికాదు. అది కూడా ప్రశస్తంకాదు. అన్నయ్య ఉసూరు మంటాడు. మనకు అప్రతిష్ఠ అన్నది. ఆ తలపులుకూడా మూసుకున్నయి. అయినా, రుక్మిణి అగ్నిద్యోతనుణ్ణి పంపించింది. మీనా ఎవరిని పంపించింది ?"

"పో! బావా! సముఖమ్మున నేటికి రాయబారముల్ — అని నువ్వు పాడుతూ ఉండేవాడివికదా!"

బిల్లు తీసుకువచ్చాడు సర్వర్. "అసలే చిన్న రూము. ఒక్కొక్కరు గంటున్నర కూర్చుంటే ఎల్లాగంటున్నారండీ మానేజరు"

"అన్నాడూ! సైంధవుడు."

"అబ్బా! చాలాటయిమయింది" అంది మీనా, చేగడియారం చూస్తూ.

"బిల్లు నేనిస్తాను" అన్నాడు సుందరం.

"పానశాల మర్యాద ఏమిటంటే — ఎవరు అర్డరిస్తే వారే యివ్వడం."

ప్రకృతి ; ప్రగతి

డా॥ సి. నారాయణరెడ్డి

ఇసుక రేణువు —
మంచు బిందువు ...
ఒకటి తడిసేది
ఒకటి తడిపించేది.
ఒకటి మెరిసేది
ఒకటి మెరిపించేది.

ఇసుకకు మెరుపొస్తుంది
మంచు కురిస్తే.
పెదవికి తళుకొస్తుంది
నవ్వు విరిస్తే.

మంచులో తడిసిన ఇసుకే
మండుతుంది నిప్పులా.
నవ్వుతో విరిసిన పెదవే
పొంగుతుంది ఉప్పెనలా.
ఒకటి వేసవిలో
ఒకటి విసుగులో.

*

అది పరిణమించే ప్రకృతి
ఇది ప్రతిఘటించే ప్రగతి.

"నేను ఇవ్వకపోతే నాకు తృప్తి ఉండదు మీనా !"

"నువ్వు మా యింటికి రాలేదుగా! నేను కాఫీ అన్నా ఇవ్వకపోతే నా మనస్సు బాగుండదు."

"అయితే నీ హాండ్‌బాగ్‌లో డబ్బుతీసి నేనే యిస్తాను" అని లాక్కున్నాడు.

"అబ్బ! అధికారం!"

సర్వర్ డబ్బుతో వెళ్లిపోయాడు.

"బావా! బాగ్ తీసుకున్నావు సరే. దానిలో వందరూపాయల నోటు ఎందుకు పెట్టినట్లు !"

"మీనా! మన పెళ్లి కాదని నూటికి తొంబది తొమ్మిది పాళ్లు తేలిపోయింది కదా! ఈ నోటు నీ దగ్గర మార్చకుండా అట్టే పెట్టు. ఎప్పుడయినా బావ జ్ఞాపకం వస్తూ ఉంటాడు."

"చంపేస్తున్నావు బావా!" కన్నీళ్లు ధారలుగా కారుతున్నై. "మా పని చితికి పోయిందని తెలిసికూడా మా అమ్మ బోలెడు కట్నంపోసి నాకిష్టంలేని పెళ్లి చేస్తానం టుంది. వట్టి మూర్ఖురాలు బావా!"

"నా గుండెను ఎంత ఇనుము చేసుకున్నా, నీ కన్నీళ్లు చూస్తే నా కన్నీళ్లు ఆగడం లేదు మీనా !"

సర్వర్ చిల్లర ఇచ్చాడు. ఇద్దరూ లేచారు.

"నేను బస్సుకు వెళ్లిపోతున్నాను మీనా! ఇల్లు దగ్గరే అయినా జాగ్రత్తగా వెళ్లు. వాహనాలు త్రాగి తోలుతూ ఉంటారు."

"బావా! నమస్కారం. భగవంతుడు డనేవాడు ఒకడు ఉన్నాడుకదా!"

"నేనూ అలాగే అనుకుంటున్నాను, నువ్వు అన్నతర్వాత."

సుందరం వెళ్లిపోయాడు. మీనాక్షి! యిల్లు చేరుకుంది. బావతో తీరుబడిగా మాట్లాడుతున్నంతసేపూ గుండె ఎంతో తేలికగా ఉంది... ఆ సంభాషణ భావన చేసిన కొద్దీ గుండె బరువవుతోంది... బావ ఎంత సంస్కారం కలవాడు — అనుకుంది. అందు కనే మామయ్య చదువు కంటె సంస్కారం ప్రధానం అన్నాడు అని అనుకుంది. కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాననడం, తన పెళ్లి అయేదాకా పెళ్లి చేసుకోననడం ఇవన్నీ ప్రేమకు త్యాగానికి చిహ్నాలు నిజానికి తన ప్రేమ, త్యాగం ఎంతవరకుంది అని ఆత్మ

వరీక్ష చేసుకోసాగింది. తల్లి దొడ్లో పని పురమాయిస్తోంది.

"ఆలస్యం అయిందేం తల్లీ! ఇంటికి రావడానికి!"

"బావ కనపడ్డాడు నాన్నా! మధ్యాహ్నం వచ్చాట్ట! హోటలులో భోజనం చేశాడుట!"

"మనింటికి రమ్మనక పోయావా అమ్మా"

"ఆ యింట్లో నాకు స్థానం లేదనేశాడు"

"ఏం చేస్తామమ్మా! నాతో రహస్యంగా చెప్పు. అసలు బావను చేసుకోవడం నీ కిష్టమేనా?"

"నీ కిష్టమయితే నాకిష్టమే నాన్నా"

తన గదిలోకి వెళ్లిపోయింది మీనా. సిగ్గు పొరలలో దుఃఖం తొంగిచూచింది.

* * *

మీనాక్షి బి. ఎ. ప్యాసయింది. ఈ లోపుగా వారి కుటుంబ పరిస్థితులు తారుమారయినై. కొల్లు ఎత్తేశారు. ఋణం చాలా పెరిగిపోయింది. అప్పులవాళ్ళు ఎగబడుతున్నారు. కారు అమ్మివేశారు. 'గళ్లు' మని ఒక్కసారిగా బోర్డు తల్లక్రిందయింది. ఉద్యోగాల్లో ప్రవేశించిన మీనాక్షి సోదరులు మిగిలిన ఇద్దరి తమ్ములకూ చదువులకు డబ్బు పంపుతున్నారు. వాళ్ల ఉద్యోగాలు కూడా అంత పెద్దవేమీ కాదు. ఉన్న ఇల్లు నిలిచే స్థితి లేదు. దాని మీదకూడా అప్పుఉంది. ఇల్లు నిలవడం కోసం భామమ్మ ఒంటిమీద బంగారు నగలన్నీ అమ్మేసి నకిలీ నగలు కొనుక్కుంది. అయినా కొంత ఋణం ఉండనే ఉంది. మీనాక్షి పెళ్లి సంగతి ఆలోచించినవారే లేరు. భామమ్మకు కృత్రిమపు హోదా అంతా పోయింది. గొప్పవాళ్ల యింటికి రాకపోకలు సున్నా అయినై. పులివలె జీవించిన భామ నేడు పిల్లిఅయి ఊరుకుంది.

"సంసారం పచ్చిగా ఉన్నప్పుడు పెళ్లి చేస్తానే అంటే, ప్రతివాడికీ వంకలు పెట్టింది అమ్మాయి. తప్పేడు సంసారం ఇప్పుడు బుట్టలోకి వచ్చింది. ఇప్పుడు పిల్ల పెళ్లి ఎల్లా" అంది ఒకనాడు దేవయ్యతో.

"ఏం చేస్తాం! విధి విలాసం! పోనీ, సుందరానికి ఇంకా పెళ్లి కాలేదుగా. చేసుకుంటాడేమో."

"బి.ఎ. ప్యాసయిన అమ్మాయిని చూస్తూ చూస్తూ స్కూలుఫైనలు వాడికిస్తామా? ఉద్యోగమయినా చేయిస్తాం కాని—"

"చింత చచ్చినా పులుపు చావదు"

మేనరికం

అన్నాడు దేవయ్య.

"మీరు పెళ్లిచేస్తే చేయండి, మానితే మానండి — కాని కూలిపని మాత్రం నేను చేయను" అంది మీనాక్షి అందుకుంటూ.

"ఉద్యోగం దేనికమ్మా! ఎన్ని ఇబ్బందులు! ఆ పని నాకూ యిష్టంలేదు" అన్నాడు దేవయ్య.

"అంత ఉద్యోగం ఇష్టం లేకపోతే, మీ మేనల్లుడికే తీసుకెళ్లి కట్టపెట్టండి. పిసుక్కు తినడానికి అన్నం ఉందిగా" అన్నది భామమ్మ కసిగా.

"మనకు అదీలేని స్థితి వచ్చిందిగా. వాకి



కామలక్ష్మి పేరులో పత్రికల్లో కథలు రాస్తున్నది నేనే! మాస్టారూ?

సుబ్బలక్ష్మి పేరుతో మీ కథలు బావుండవని పత్రికల్లో ఉత్తరాలు రాస్తున్నది నేనే! మాస్టారూ?

ట్లోకి వచ్చినప్పుడు మనం కాదని తీరా ఇప్పుడిస్తామంటే వాళ్లేమంటారో!"

"ఏమీ అనరు. పువ్వుల్లో పెట్టి మరీ చేసుకుంటారు. బి. ఎ. ప్యాసయిందిగా కానప్పుడే చేసుకుంటామన్నారు. అసలు వాళ్ల ఘోషే కొట్టింది దీని పెళ్లికి. చివరకు వాళ్ల పంతమే నెగ్గుతోంది."

"నీ కంత ఆత్మవిశ్వాసమే ఉంటే నువ్వే వెళ్లి చెప్పిరా— పిల్లనిస్తానని"

"నే నేమయినా సరే వెళ్లను. మీరు అన్న, ఆవిడ చెల్లెలు. నే నెవరు మధ్య! మరి మీ వదినకు ఇష్టమేనా అని అడిగితే, ఇష్టమే అనండి."

అన్న ఆస్తి పోయిందని విని చూడడానికి అన్నపూర్ణమ్మగారే వచ్చింది. 'ఓడలు బళ్లవుతై, బళ్లు ఓడలవుతై' అని ఓదార్చింది.

దేవయ్య చెల్లెలిని "మా అమ్మాయిని నీ కడుపులో పెట్టుకో అమ్మా" అని దీనంగా అడిగాడు.

"వదిన ఇష్టముంటే నే నెప్పుడన్నా కాదన్నానా అన్నయ్యా" అంది కళ్ల నీళ్లు పెట్టుకుంటూ.

"అప్పుడేమో పిల్ల చదువుకుంటోంది కదా అని అట్లా అన్నాం" అని ఊరుకుంది భామమ్మ.

వివాహం విజయవాడలో జరిగిపోయింది. గృహప్రవేశానికి మీనాక్షిని కలువపాములతీసుకు వెళ్లారు. కూడా సత్యభామమ్మ కూడా వెళ్లింది. కపిల గోవును చూడడానికి మీనా దొడ్లోకి వెళ్లింది. "మీనా ఆ ఆవే ఆవేళ తప్పించుకుపోయింది. తిరిగి తిరిగి కట్లు కొయ్య దగ్గరకు వచ్చింది. జ్ఞాపకముందా" అన్నాడు సుందరం. "మీ రెందుకంటున్నారో నాకు తెలుసు" అంది మీనా నవ్వుతూ.

"అందుకనే మా అమ్మ పల్లెటూరువాళ్ల కివ్వనన్నది. వాళ్లది మోటు సరసమని మా అమ్మకు బాగా తెలుసు" అని మళ్లీ అన్నది.

"అల్లాగా" అని గట్టిగా పట్టుకోబోయాడు సుందరం.

"అదే నేను మోటు సరసం అనేది— బలే చోటు దొరికింది. చూడండి. కపిలగోవు మీరు నన్ను పట్టుకుంటే తల ఎలా అడ్డంగా తిప్పుతోందో" అన్నది.

సుందరం కపిలగోవు వంక చూచాడు.

మీనాక్షి రివ్వున దూసుకొని వెళ్లి అత్తగారి ఒళ్లో కూర్చుంది.


"సరేలే— ఇప్పుడు కాదు" అని గట్టిగా కళ్లుమూసుకుని తెరచి చూపుడు వేలు ఝళిపించాడు సుందరం.

"చూడత్తా! బావ కొడతానంటున్నాడు" అని అంది మీనా!

"కొట్టడమ్మా! ఊరికే అలా అంటాడు. ఎవరయినా పెళ్లాన్ని కొడతారేమిటి ముద్దు పెట్టుకుంటారు కాని—"

"నువ్వు బరేదానివేలే అత్తా—" అని తుర్రున లేచి గదిలోకి వెళ్లిపోయింది మీనా. సుందరం మీనాను అనుసరించాడు.

ప్రపంచ మంతటా రూఢి అయినది అది మజ్దా అనే



అంతకంటె నిస్సందేహమైన దేముంటుంది!

యు. కె. యూరప్ మరియు ప్రగతిచెందిన ఇతర దేశములలో ఎక్కడైతే దీపాల వెలుగు విజ్ఞానం యొక్క శ్లాఘ్యత తారావ దాన్నంటిన చోట—గృహములు, కచేరీలు, సంస్థలు పరిశ్రమ, నగరములు హైవేస్, మరియు అంతర్జాతీయ విమానాశ్రయములలో మజ్దా సరియైన కాంతి నిచ్చి, ఎక్కువ కాలం మన్నెడి, గొప్ప మితవ్యయాన్నిస్తుందని నమ్మబడినది. మీకు అతి చేరువలో ఉన్న ఎలక్ట్రి సామాన్ల దుకాణంలో లభ్యమయ్యేడి మజ్దా ల్యాంప్స యొక్క హృదయం కూడా ఉత్పత్తియందుండే అదే శ్లాఘ్యతతో నిర్మించబడినది. అందుకే అది మజ్దా అనే రూఢి చేసుకొనండి.

సాటిలేని మజ్దా యొక్క లాభములు ఇవిగో!

మజ్దా కచ్చితమైన వొల్టేజిని తప్పక ఇచ్చును.

మజ్దా ల్యాంప్‌కి దీర్ఘమైన జీవానాన్ని తప్పక ఇచ్చును. మజ్దా సరియైన రంగుని వెదజల్లును.

మజ్దా ఏకరీతైన కాంతిని తప్పక ఇచ్చును,

మజ్దా ల్యాంప్
కంపెనీ లిమిటెడ్
THORN గ్రేట్ బ్రిటన్ థరన్ గ్రు
యొక్క ఒక సభ్యులు

ఆ విస్తీర్ణమైన మజ్దా శ్రేణి

జనరల్ లైటింగ్ సర్వీస్ ల్యాంప్స (బల్బ్స)-లో ఈ హైవొల్టేజి, క్లియర్, ఫ్రోస్టెడ్ అండ్ సిల్వర్ లైట్ ★ ఫ్లోరసెంట్ ట్యూబ్స ★ హైప్రెషర్ మెర్క్యురీ వ్యాపర్ డిస్చార్జి ల్యాంప్స-లో ఈ హైవొల్టేజి ★ మినియేచర్ ల్యాంప్స-ఫోకసింగ్ అండ్ ప్రి ఫోకసింగ్ ★ బ్రెయిన్ అండ్ లోక్ ల్యాంప్స ★ పిగ్మి, కేండిల్ డెకరేషన్ నైట్ మరియు చాలా ఇతర మైనవంటి ప్రత్యేకమైన ల్యాంప్స.

MLC-2 RI TEL

వారఫలం

5-9-1975 శుక్రవారం మొదలు
11-9-1975 గురువారం వరకు

మేషం :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

వృషభం :— : స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. పోటి వారితో వాద ప్రతివాదాలు తగవు.

మిథునం :— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. అనుకూలమైన వార్తలనువింటారు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు అందుతుంది. వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగించగలదు. స్త్రీలకు – కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు.

సింహం :— మీ కార్యక్రమాలు బాగుంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన సమాచారం అందగలదు.

కన్య :— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

తుల :— వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. రావలసిన డబ్బు అందుతుంది. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. బంధుమిత్రులను కల్సు కొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

వృశ్చికం — ప్రయోజనంగల వ్యక్తులను కల్సుకొంటారు. బంధువులకు సహాయంచేస్తారు. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

ధనుస్సు:— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. అనుకూల వార్తలను వింటారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. మీరు ఇదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. విలాస వస్తువులు కొంటారు.

మకరం :— ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో నూతన వ్యవహారాలు లాభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఆదికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో ప్రయాస కలుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కుంభం:— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. పోటివారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— వ్యాపారంలో పోటీవారిపోటీ పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

— మహేష్

బుల్లి పట్నం

అమెరికాలోని సౌత్ కరోలినాలో అల్విన్ అన్న ఒక పట్నం వుంది. ఈ పట్నం మొత్తం ప్రపంచంలో అతి చిన్నదట. ఇందులోని జనాభా పదే పదిమంది వున్నారట.

సెక్స్ పన్ను !

నార్వే ప్రభుత్వం పన్నులు విధించడంలో కొత్తమార్గం త్రొక్కిందట అనేక విధాలుగా, పన్నులు విధించి, యిహ ఏ మార్గమూ దొరక్క సెక్స్‌టాక్స్ విధించిందట. ఆ దేశం జూద, వ్యభిచార గృహాలలో ఒళ్లమ్ముకుని బ్రతికే అమ్మాయిల మీదటా టాక్సు. అయితే యీ పన్ను మొదటికివ్వాలట వేశ్యల అందచందాలు, అంగసౌష్ఠవములు, వయస్సు, చొరవవంటివి చూసి ప్రభుత్వాధికారులే ఎంత పన్ను కట్టాలో నిర్ణయిస్తారట ఆ అమ్మాయిలు ఆ పన్ను కట్టేయాలట.

సోడా కథ

మనం త్రాగే సోడా అసలు ఎప్పుడు ఎక్కడ నుంచి మన దేశానికి వచ్చింది అనే విషయం పరిశీలిస్తే 1811 లో బ్రిటనునుంచి యీ గ్యాసు సిలెండరు మన దేశం దిగుమతి చేసుకున్నట్లు తెలిందట 1946 లో యీ కంపెనీ (విదేశీ కంపెనీ) తన హక్కులను మనదేశం చేతుల్లో పెట్టేసిందట

బాల్‌పాయింట్ ఉపయోగం

ఆగస్టు ఒకటో తారీఖు నుంచి, మనీ ఆర్డరు ఫారమ్‌మీద గాని, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కాగితాలమీద గాని, చెక్కుల మీద గాని బాల్ పాయింట్ పెన్‌తో సంతకాలు పెట్టవచ్చునని దేశం మొత్తంమీద పోస్టాఫీసులకు అధికారయుతంగా ఉత్తర్వులు యివ్వబడ్డాయట.

విఫలమైన ఆత్మహత్యా ప్రయత్నం

ఇంగ్లండు బెడ్‌ఫోర్డ్‌కు చెందిన గ్రోసర్ అనే వో అప్పారావు అప్పులబాధపడలేక, ఆత్మహత్యద్వారా వాటికి దూరంగా పారిపోదామనుకుని ఇంట్లో గ్యాసువదిలి, అంతలో సరదా కోసిగరెట్టు వెలిగించాడు దాంతో అతనిల్లే గాక, పక్కిళ్లు కూడా అంటుకుని ధామ్మని ప్రేలి పోయిందట గ్రోసర్ మాత్రం క్షేమంగా వున్నాడట అప్పారావు కదా మరి !!

లంచం పుచ్చుకున్న అధికారి అరెస్టు

ఢిల్లీలో ఆదాయపు పన్ను శాఖ అధికారి వో వ్యాపారస్తునికి ఆదాయపు పన్ను తగ్గించుకోడానికి, (లేదా చాలాభాగం ఎగవెయ్యడానికి) మార్గాలు సూచించడానికో వెయ్యి రూపాయలు లంచంగా అడిగి, ముందే రెండొందలు బజానా తీసుకున్నాడట. అయితే యీ విషయాన్ని పసికట్టిన సెంట్రల్ ఇంటలిజెన్స్ వారాయన్ని పట్టుకుంటే ప్రభుత్వమాయన్నిపుద్యోగంలోంచి తొలగించిందట ఇహనైనా కొన్నాళ్లు పరాదీ లంచావతారపు వేషాలు!!

గోడలో ఇనపెట్టె !

ఢిల్లీలో ఇల్లు కట్టడానికి కావలసిన సరంజామా అమ్మే వో వర్తకునివద్ద నల్లడబ్బు వుందా మూలుగుతోందని ఆదాయపు పన్ను శాఖవారు అనుమానించి అతని ఇల్లు సోదావేస్తే వారికి ఏమీ దొరకలేదట ఇదేమి వింతయా అని గోడమీదమీట చూస్తే వో చోట గోడ వోటి శబ్దం చేసిందట అక్కడ త్రవ్వితే గోడలో వో ఇనప్పెట్టె, ఆ పెట్టెలో అయిదు లక్షల రూపాయలు దొరికాయట ఇదేగాక ఆ పెట్టెలో 12 బ్యాంకులాకర్ల పత్రాలూ వగైరాలు కూడా వున్నాయట ఇది చూసిన అధికారులకన్నా ముందా వర్తకుడు ఆశ్చర్యపోయి, తన ఇంటిగోడలోకి ఆ పెట్టెగాని, ఆ పెట్టెలోకి ఆ డబ్బుగాని ఎలా వచ్చిందో తనకు తెలియదని, దానికితనకీ ఏవిధమైన సంబంధమూ లేదని చెప్పేశాడట ఆయనింటి గోడ పెట్టెనుకన్నదా! వింత ప్రసవం ఇది!!

రైలుపై బందిపోట్ల దాడి

మద్రాసునుంచి బదరీనాథ్ యాత్రకు వెళ్తున్న భక్తులున్న రైలు పెట్టెమీద ఎనిమిదో తేదీ తెల్లవారుజామున వో డజనుమంది బందిపోట్లు పడి నగా నట్రా మొత్తామో యాభైవేలు కిమ్మత్తు చేసేవి పట్టుకు పుడాయించారట. ఇది హృషికేశం రైల్వేస్టేషనులో జరిగిందట

వృద్ధులలో పురుషులే ఎక్కువ


భారతదేశంలో వున్న వృద్ధులలో స్త్రీల కన్నా పురుషుల శాతమే ఎక్కువట 55 ఏళ్లు పైబడినవారు దేశంలో 74 శాతం వున్నారట. అందులో పురుషులలో 80 శాతం, స్త్రీలలో 76 శాతం అరవై ఏళ్లువచ్చేవరకూ బ్రతుకుతున్నారట ఈ విషయాలను ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ కృపాల్ సింగుగారన్నారట

దొంగతనం — హత్య

మద్రాసు షెనాయ్ నగర్‌లో అయిదోతేదీ అర్ధరాత్రి ఒంటిగంటకు ఎవరో ఇరవైయ్యేళ్ల రమేష్‌కుమార్ అనే అతన్ని నడిరోడ్డుమీద చంపి అతనిచేతికున్నవాచీ, ఉంగరాలూ వగైరా తస్కరించారట ఇంతవరకూ ఎట్టి అరెస్టులూ జరుగలేదట—కానున్నవి కాక మానవుగదా! కానున్న వేమిటంతకి! హత్యలా, అరెస్టులా !!!

కత్తి విసరి కూతుర్ని చంపిన తండ్రి

తను డబ్బులడిగితే అక్కయ్య ఇవ్వటంలేదని వో కుర్రాడు తన తండ్రి కోదండం అనే అతనికి ఫిర్యాదుచేస్తే ఆ కోదండం కోపంతో చేతిలో వున్న కత్తి ఎత్తి 11ఏళ్ల తన కూతురు మీదికి విసిరాడట దాంతో ఆమె తెగి, చనిపోయిందట. న్యాయ స్థానమాతండ్రికి ఎనిమిది నెలలు శిక్ష విధించిందటంతే!! ఇది మద్రాసు క్రోంపేటలో జరిగింది



నెల్లూరు జూబిలీ ప్రభుత్వ ఆసుపత్రిలో జూలై 1975లో జన్మించిన ఒక వింత శిశువు మూడు కండ్లు, రెండు నోళ్లు వున్న యీ బిడ్డ పుట్టినప్పుడే మరణించింది (ఫోటో : కె కృష్ణమూర్తి)

మద్రాసు మహానగరంలో సినీ పక్షుల కేంద్రమైన పాండీ బజారులో నిద్ర గన్నేరు చెట్టుక్రింద కూర్చుని ''రాజు'' బీడీని తెగ కాలుస్తున్నాడు. తన ఆలోచనకు ఒక రూపమీయాలనే తాపత్రయంలో రాజు బీడీ రూపాన్ని మార్చేస్తున్నాడు. నుసిఅయిన బీడీ జెంగగా రాలిపోతోంది. 'రాజు పొడుగ్గా నల్లగా వుంటాడు. బక్కచిక్కిన శరీరం, రక్తనాళాలు చర్మంపై కనబడతాయి. మాసిన తెల్లచొక్కా చాకిరేవుకే నోచుకో



లేదన్నట్లు దిగాలుపడి వ్రేలాడుతోంది. జనం విపరీధ్యాసలో వారు తిరుగుచున్నారు. తమ ధ్యేయాన్ని చేరాలనే తపనలోనే ప్రపంచమంతా యెంతో వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. ఆకాశంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రాజు సినిమాలకు ఎక్స్ట్రా నటీనటులను 'సప్లయి' చేస్తుంటాడు.

అతని భార్యకు ప్రసవసమయం. సరిగా డబ్బుల్లేవు. వేసవి కావడంవల్ల పెద్ద నటీనటులు, 'వేసవి విశ్రాంతులకు' పోవడంవల్ల 'కాల్ షీట్స్' యేమీ లేక డబ్బు కిట్టడంలేదు. ఆ నెలలో మొదటి కాల్ షీటిదే.

కొత్త 'ప్రొడ్యూసర్' వచ్చాడు పిక్చర్ను 'సెక్స్' మయంగా తీసి సినీరంగంలో స్థిరపడి పోవాలని వచ్చాడు. పిక్కబలం, అవయవాల పొందిక, అందం, పెద్ద పెద్ద కళ్ళూగల అమ్మాయిలకోసం గాలిస్తున్నాడు. అయినా ఆమె కథానాయికగాకాదు. కథానాయికను చేయాలనే అభిప్రాయమూ నిర్మాతకు లేదు. కాని చాల అందమైన చలాకీ అమ్మాయి కావాలి. రాజుమీద ఆ భారం పడింది. డబ్బు బాగా యిస్తానన్నాడు. పైగ కథానాయికవలె ఉండాలనే ఓ నిబంధన కూడా పెట్టాడు.

దర్శకుని కోరికలూ, ఆశలూ, అభిరుచులు తెలిసిన రాజు అమ్మాయికోసం గాలిస్తున్నాడు.

ఆఖరి బీడీని ఆఖరి దమ్ము లాగిపారేస్తూ జేబులో వున్న అడ్రసుల పుస్తకం తీసి ఓసారి చూసుకున్నాడు.

* * *

'సెట్టింగ్లో' 'వర్క్'లో చాలా భాగం పూర్తయింది. 'కెమేరామన్' ఎంతో చాకచక్యంగా ప్రతి ఫ్రేమ్ నిండుగా చిత్రీకరించాడు. కథానాయిక స్థానం ఆక్రమించగల అందమైన అమ్మాయి 'క్లోజప్స్' ఓ పాటలో చరణాలూ, తప్ప మిగతాపని పూర్తయింది.

''ఏం సార్! 'హీరోయిన్' వంటి పిల్ల ఇంకారాలేదా?''— దర్శకు డరిచాడు.

''మనరాజు వెళ్ళాడు''—నిర్మాత నెమ్మదిగా అన్నాడు.

''వాణ్ణి నమ్ముకుంటే పని అయినట్లే... సరే యేం చేస్తాం? నాబ్రేక్'' అని దర్శకుడు మరల కళ్ళు మూసుకున్నాడు.

* * *

కళ్ళు మూసుకొని ఆలోచించిన రాజు అడ్రసుల పుస్తకం జేబులో పెట్టుకుని, నాలుగుసందులు తిరిగి ఒక యింటిదగ్గర ఆగాడు. అది ఇల్లుకాదు కొబ్బరితడికలతో వేసిన పాక, 'పోలీస్ క్వార్టర్స్'లా వరసగా గదులూ, ముందువైపు కాళీగా ఉన్నాయి. రాజు ఒకవాటాముందు ఆగాడు అక్కడ నిలబడి — ''మాధురీ !''— అని నెమ్మదిగా పిలిచాడు.

లోపలినుండి జవాబురాలేదు కాని, దగ్గు వినపడింది. అది మగగొంతుక ''మాధురి ఇల్లు మారిపోలేదుకద. చెప్పలేం ఎప్పుడేం జరుగుతుందో సినిమా జాతకాలు సెకను సెకనుకూ మారిపోతూంటాయి,''—అనుకుంటుండగా ఓ పద్దెనిమిదేళ్ళ యువతివచ్చి తలుపు తెరిచింది.

ఆమె పూర్ణయౌవ్వనాన్ని — శరీర లావణ్యాన్ని, ధరించిన పాత పరికిణీ, వేసుకున్న చిరిగిన కండువా మరుగుపరచలేకపోతున్నాయి.

''రా! రాజూ!''— అందామె. ఆరడుగుల ఆ రాజు ఆచిన్న తడికలగుమ్మంలోంచి వంగి వచ్చాడు ఆమె చింకిచాపవేసింది. అతను కూర్చున్నాడు.

ఆ గదిలో యెడమ వయిపు మంచంమీదో రోగిష్టి ముసలివాడు పడుకొనియున్నాడు. కుడివైపు కర్రబల్లమీద ట్రంకుపెట్టెవుంది. అక్కడే పౌడరు, అద్దం, దువ్వెన్నావున్నాయి. ఒకమూలగా పాత్రలున్నాయి

అది మాధురి ఆస్తి. మాధురి రాజువైపే చూసి నవ్వి— ''ఇక్కడే ముంటాయనిమాస్తున్నావు. ఇంతకన్న మంచిమేడలు, భవనాలు చూసుంటావ్ కదూ'' అంది. రాజు నవ్వాడు. తను యెందరినో యిలాంటి తడికల యిళ్ల

లోంచి మేడల్లోనికి మార్చాడు. ఎవరి అదృష్టం వారిది. ఎందరో పైకి వెళ్లారు కాని తను. వెళ్ల లేదు.

"నీవూ అలాగే పైకి వెళ్తావు" రాజు మాధురికి ఆశ కల్పిస్తూ అన్నాడు.

"అలా అనే ఇల్లూ వాకిలీ, అమ్మనూ, చెల్లెళ్ళనూ వదలి యిక్కడికి వచ్చాను. ఎప్పుడో ఒకప్పుడు పైకి వస్తాననే ఆశ తప్ప త్వరలో పైకి రావటానికే ఆసరాలేదు.. " మాధురి బాధగా అంది.

రాజు నవ్వాడు.

"మంచినీళ్ళు కావాలా? — "అంది. రాజు తలూపాడు. కావాలో అక్కర్లేదో మాధురి కర్థం కాలేదు అయినా తెచ్చి యిచ్చింది. మంచినీళ్ళు చేతి కందిస్తున్న ఆమె ముఖంలో ముఖం పెట్టి తీక్షణంగా చూశాడు. అలాంటి చూపుల కలవాటు పడ్డ మాధురి క్రింద పెదవిని పై పళ్ళతో నొక్కింది. రాజు ఆ కవ్వింపు భరించలేక మంచినీళ్ళు త్రాగే వంకతో దృష్టి మరల్చుకున్నాడు.

మాధురి వంటి యెందరో అందమైన యువతులు మద్రాసు వచ్చి, సినిమాల మోజులో తిరుగుతున్నారు. ఎందరో రాజు చేతుల్లో తార్చబడ్డారు. కొందరు పడతులు పడుపు వృత్తిలో స్థిరపడ్డారు. కొందరు సినిమా వేషాల కోసం తార్చపడ్తూనే యున్నారు.

"ఏం ఇలా వచ్చావ్? కాల్‌షీట్స్" మాధురి వాక్యం పూర్తి చేయకుండానే రాజు అందుకున్నాడు—

"కొత్త ప్రొడ్యూసర్ వచ్చాడు. మన పాలిటి కామధేనువులా కాల్‌షీట్ వేశాడు" — మున్నగా యున్న కంఠం వైపు చూసి తన బక్క కంఠం నలుపుకున్నాడు రాజు.

"తాతకు జ్వరం విపరీతంగా వుంది. ఆయాసం పెరిగింది ఎలాగ?" — మాధురి ఆయాసంతో పడుకుని, చీకటి కళ్ళతో చూస్తున్న తాతవైపు చూచింది.

"ఏంటమ్మా! రాక రాక 'కాల్‌షీట్' వస్తేనాకు జ్వరంగుందని మానుకుంటావ? వెళ్ళు! సినిమా రంగంలో ముందు చూపేకాని వెనకంజ పనికిరాదు అవకాశం లేదని బాధ పడుతున్నదానివి వస్తే వదులుకుంటావా? నీవు మంచి నటివి కావాలి — వెళ్ళు"— తాత ఆయాసంగా అన్నాడు

మద్రాసులో ఏం చేయాలో తెలియక తిరుగుతున్న తనకు తాత సహాయమే గాక, ప్రోత్సాహమూ లభించింది. మాధురి యేమనలేకపోయింది.

"సందేహించకు మాధురీ, మంచి వేషం పాటమీద 'బిట్స్' కూడా ఉన్నాయి — రాజు నచ్చ చెప్పాడు. మాధురి కా వేషంలో మంచి గుర్తింపు వస్తుందనే ఆశ కూడా ఉంది అందమైన ఆడపిల్లలు చెడిపోకుండా సినీ రంగంలో పైకి రాలేరు కాని పైకి రాకుండా చెడిపోవడ మతను సహించలేడు

మాధురి యేమనుకుందో లేచి బట్టలు మార్చుకుంది

"ఇప్పుడదంతా యెందుకు వెళ్ళగానే 'మేకప్' వెంటనే 'షూటింగ్' - అన్నాడు రాజు తొందర చేస్తూ. మాధురి ఎంతో తృప్తితో కదిలింది. ఇద్దరూ కలిసి 'టాక్సీ' ఎక్కాక 'స్టూడియో' వైపు దూసుకుపోయింది.

'సెట్టింగ్'లో దర్శకుడు పులిలా ఆయాస పడుతున్నాడు. పరిశ్రమవల్లకన్న కోపంవల్ల ఆయనకు ఆయాస మెక్కువగా వుంటుంది.

'ఇలా ప్రతీ చిన్న విషయానికి ఆలస్య మవుతూ వస్తే, పని అసలే పూర్తి కాదు. మీకే నష్టం!"— దర్శకుడు నిర్మాత అదిరిపోయేటట్లు అన్నాడు.

కొత్త నిర్మాతల దగ్గర దర్శకుల ఆటలూ, ఆగడాలు సాగుతాయికాని పాతుకుపోయిన నిర్మాతల చేతుల్లో యీ దర్శకులు తొత్తులని తెలియని కొత్త నిర్మాతగారు పాపం సింహం ముందు లేడిలా అయారు. ఏదో చెప్పాలని యిబ్బందిగా 'పోజు' పెట్టారు. ఇంతలోనే 'టాక్సీ' లోంచి దిగిన రాజు గబ గబ 'సెట్' లోకి వచ్చాడు.

"సార్! అమ్మాయి బలే నీటయింది, రెండు వందలు కావాలిట" — అన్నాడు రాజు.

"అయిదు వందలన్నా యిస్తాను, ఎక్కడా అమ్మాయి?"

"టాక్సీలోఉంది, పదిరూపాయలు యివ్వండి— టాక్సీ ఖర్చులు." రాజు చేయి చాపాడు. నిర్మాత బిక్కముఖంపెట్టి పదికాగితం యిచ్చాడు.

'అనుభవంలేని నిర్మాత అనుభవమున్న ప్రొడక్షన్ మేనేజర్నైనా పెట్టుకోవాలి. లేకపోతే ఈ రంగంలో గుండుసూదికి పదిహేను రూపాయలు ఖర్చవుతుంటుంది.' అన్నట్లుచూచి రాజు వెళ్ళిపోయాడు.

ఈలోగానే దర్శకుని నయన చలనాన్ని అర్థం చేసుకున్న సహాయ దర్శకుడు టాక్సీదగ్గరకు వెళ్ళి మాధురిని 'మేకప్‌రూమ్‌కు' కు వెళ్ళమని హుకుం జారీచేసి వచ్చాడు.

"సార్! యాపిల్‌లాగుంది పిల్ల. బొత్తిగా 'క్లోజప్స్' కు నోచుకోని ముఖంలాగుంది. మనం బ్రహ్మాండంగా 'ఎక్స్ ప్లాయిట్' చేయవచ్చు" అన్నాడతను

ఎలా 'ఎక్స్‌ప్లాయిట్' చేయాలా అని దర్శకుడు ఆలోచనలో మునిగాడు.

'జిగేల్' మనిపించే నీలంరంగు దుస్తుల్లో ఆమె వయ్యారంగా నడిచివచ్చి దర్శకునకు వంగి నమస్కరించింది. ఎందరో యువతీ యువకులను దీవించిన ఆయన హస్తం ఆమెనూ దీవించింది.

ప్రప్రథమంగా ఆమెపై రెండు చెరణాలు చిత్రీకరించారు.

ప్రతీసారీ 'కెమెరామాన్' ఆమెదగ్గరకు వచ్చి పోజ్ కరెక్ట్ చేసేవాడు. దర్శకుడు విలాసంగా నవ్వేవాడు.

పల్లవిలో మాత్రం ఆమెకు రెండు 'క్లోజప్స్' వున్నాయి. ఇల్లువదలి మద్రాసు వచ్చాక ఆమెకు సినిమావారిచ్చిన క్లోజప్స్ ఆ రెండే. అయినా ఫర్వాలేదు. ఆ రెండు 'క్లోజప్స్' తన జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. తనకు నటజీవితంలో మంచి భవిష్యత్తుంటుంది అనే ఆనందపు టూహాలోచనలతో ఆమె ఉత్సాహంగా నటించింది నృత్య దర్శకుడు సైతం జబ్బచరిచి, అభినందించినట్లు ఆశీర్వదించాడు.

ఈసీన్ పూర్తయింది. రెండవసీన్‌లో మీరు పూర్తిగా నగ్నంగా నటించాలి సహాయ దర్శకుడు పిర్లిలా వచ్చి ఆమెచెవిలో వూదాడు.

ఆమె అదిరిపడింది. అర్ధనగ్న దృశ్యాలు కొందరే నటిస్తున్నారు. మరి తను పూర్తి నగ్నంగా నటించాలా? నటించనంటే.

సినీరంగానికి పనికిరానంటారు. కళాదృష్టిలో నగ్నానికీ అర్ధనగ్నానికి పెద్దతేడా యేమీ లేదంటారు.

'సెట్' లో అంతా నిశ్శబ్దమయింది. అటూ ఇటూ చూచింది మాధురి. 'ఎక్స్‌ట్రా' నటీ నటులు వెళ్ళిపోయారు. సాంకేతిక నిపుణులూ, లైటింగ్ వారూ వున్నారు. రాజు కనబడితే తానీ వేషం వేయనని చెప్పి, వెళ్ళిపోదా మనుకున్న ఆమె ఆశ నిరాశ అయింది.

ఆమె భారంగా కనులుమూసుకుంది. రోగంతో తీసుకుంటున్న తాత ఇంటి అద్దెగురించి తొందర చేసే యింటి యజమాని ... నిత్య జీవితవసరాలు. అదీగాక రాకరాక వచ్చిన ..

ఎలాంటి వేషాలకయినా సిద్ధపడగలిగితేనే భవిష్యత్తుంటుంది. ఆమె తనను తాను సమాధాన పరుచుకుంది.

'ఏమమ్మా! రెడీనా?' దర్శకుడు అన్నాడు.

'యస్సార్'!

రకరకాల భంగిమల్లో ఆమె శరీర లావణ్యాన్ని చిత్రీకరించారు. ఆమె శరీరంలో ప్రతీ అంగుళాన్ని కెమేరా తనలో ఇముడ్చుకుంది.

ఇంతవరకు యే నటీ చేయని సాహసం చేసి, కొత్త యుగం సృష్టిస్తున్నానన్న వింత ఆనందం.

స్త్రీగా యే భారతీయ యువతీ చేయకూడని పని చేసానన్న వేదన, సిగ్గు.

మాధురిని ఉక్కిరిబిక్కిరి చేసాయి.

ఇక తను గొప్ప 'సెక్స్' తారగా వెలుగొందగలదు. ఆమె రకరకాల ఆలోచనలలోనే 'వర్క్' పూర్తిచేసింది.

ఆమె అందాన్ని చూచి చూచి అలసిన కళ్ళను మూసుకున్నాయి లైట్లు.

ఆమె బట్టలు వేసుకొని వచ్చి కుర్చీలో కూర్చుంది ఏదో పానీయ మిచ్చారు. గడ గడ త్రాగింది.

'చాలా డేరింగ్'గా చేసావమ్మా! నా తదుపరి చిత్రంలో కొంచెం పెద్ద పాత్ర యిస్తాను?' అన్నాడు దర్శకుడు, మాధురి విశాల నయనాలు ఆనంద విస్ఫారితా లయ్యాయి. చిరునవ్వు నవ్వింది.

'ఇక వస్తానండీ' ఆమె లేచి నిర్మాతకూ, దర్శకునకూ నమస్కరించి 'సెట్' బయటకు వచ్చింది. రాజు అక్కడ నలుపు కారు దగ్గర నిలబడి ఆమెకు స్వాగతం పలికాడు ఆమె వచ్చి కారులో కూర్చుంది.

జె. ఎస్. టి. విజయవాడ

నాకు నవల రాయాలని ఉత్సాహంగా వుంది.

★ ఏ పనైనా ప్రారంభించడానికి వుత్సాహం చాలు — సోదరీ, పూర్తి చేయడానికిమటుకు — దగ్గర దారి లేదు. శ్రమపడక తప్పదు.

డి. ఆర్. ఎస్. తెనాలి

మీ ఆడవాళ్లంతా హక్కులు హక్కులు అంటారేగాని బాధ్యతలు తెలుసుకోలేని హక్కు లెందుకండి?

★ పోనీ, మీలాంటి పెద్దలు — ఆ బాధ్యత లేవో — కాస్త చెప్పకూడదా?!

వి. వి. సామర్లకోట

మీరు చాలా చురుకుగా సమాధానం యిస్తున్నారు. నా ఎం. బి. బి. ఎస్. పూర్తయిన తరువాత మీ మెదడు పరీక్షించా లనుకొంటున్నాను.

★ అప్పటికి బాగా ముసలిదాన్నయిపోయి — నీలాంటి కుర్ర డాక్టర్లని దొంగ డాక్టర్లేమోనని అనుమానించి — దగ్గరగా రానివ్వను!

యు. వి. ఆర్. ఆర్. జార్సుగూడా, ఒరిస్సా.

ఆడవాళ్ల ఎంత చదువుకున్నా పొయ్యి వూదడానికే కద.

★ కాదు. చదువుకున్న ఆడదైతే — యిష్టం లేకపోతే పొయ్యి వూదడం మానవచ్చు. చదువు లేకపోతే అదేగతి!

ఎస్. ఎన్. ఆర్. హింగీర్

మీకు మూడు మైనస్‌లు. సుతులు లేనివారికి గతులు వుండవు.

★ చచ్చాక — ఈ శరీరాన్ని ఎవరు కాల్చేస్తే ఏమిటి.

వై. కె. ఎమ్. — విజయవాడ

మీ ధోరణి నాకేం నచ్చలేదు. మగాడికి మర్యాద యివ్వడం — ఆడదాని ధర్మం...

★ ఏ కాలంవాడివి బాబూ, కాలం మారింది. ఇప్పుడు మర్యాద యిచ్చిపుచ్చుకోవడమే ధర్మం.

ప్రశ్నావళి — కె. రామలక్ష్మి

కె. టి. ఆర్. మాచర్ల

పరిస్థితుల ప్రాబల్యంవల్ల కొందరు నేరస్తులవుతారు. శిక్ష పూర్తయిన తరువాత వాడికి నేరస్తుడన్న భావంతో ఎక్కడా వుద్యోగా లివ్వరు. అటువంటప్పుడు వాళ్ళ తప్పనిసరై మళ్లీ నేరం చేయవలసి వస్తుంది. ఇలా జరక్కుండా వుండాలంటే... ప్రభుత్వమే

★ ఒక కమిటీ వేశారట: మ్యా ఆర్ఫ్‌పురం నేరస్త కేంద్రాన్ని మార్చడానికి. కాని ఇప్పటిదాకా క్రియాత్మకంగా ఏం జరిగినట్టు లేదు — కుటుంబానికి రెండేసి ఎకరా లివ్వడం మినహా. చిన్న తరహా పరిశ్రమలు, యీ ప్రాంతంలో స్థాపించి అక్కడున్న వారికి ఉపాధి కల్పించకపోతే — వాళ్ళ మారడం అనేది — కుదరదు. ఎందుకంటారా? పొయ్యిలో పిల్లి లేవకపోతే — ఏ కుటుంబ పెద్ద చేతులు ముడుచుక్కూర్చుంటాడు — దొంగ అయినా దొర అయినా?!

వి. జె. ఎస్. భువనేశ్వర్

చదువుకు తెలివితేటలకు కల సంబంధం?

★ నిల్!

ఎమ్. ఆర్. — నడిపూడి

స్త్రీకి పుట్టినప్పటినుంచే పసుపు కుంకుమ పూలు వుంటాయికదా...

★ ఎవరు చెప్పారు? ఇప్పటిదాకా కర్ణుడు సహజ కుండలాలతో పుట్టాడని విన్నామేకాని ఏ ఆడపిల్లా — పసుపు కుంకుమ పూలతో పుట్టడం చూడలేదు. నేను చెప్పుకోగా వినలేదు!

టి. ఎస్. ఎస్. నరసారావుపేట

ఆడదాని హృదయం అతి కోమలం అంటారు కాని నేను తెలుసుకున్నాను — ఆడదాని హృదయం రాతిబండ కన్న కఠినమైనదని.

★ తెలుసుకున్న మనిషికి చెప్పడం దండుగే — కాని — ఆడదాని హృదయం పాషాణంగా మార్చుకోకపోతే కొన్ని సందర్భాలలో... క్షణం క్షణం చావాలనిపిస్తుంది.

ఎం. జి. ఆర్. — రాయచోటి

జీవితం ఆనందంగా వుండాలంటే — ఎప్పుడూ నవ్వుతూ వుండాలి.

★ ఎప్పుడూ నవ్వుతూనేవుంటే — అదో పిచ్చి అంటారు! నిజానికి మనసు సంతోషంగా వుండడం సులభమే — కాని మనం ఎప్పుడూ పక్కవానికంటే ఎక్కువ సంతోషంగా వుండాలనుకుంటాం. ఇది ఎప్పుడూ సాధ్యంకానిది. ఎందుకంటారా? ఎప్పుడూ మనకంటే వాడే ఎక్కువ ఆనందంగా వున్నట్టు కనిపిస్తుంది మనకి!

వి. ఎస్. ఆర్. జి. — గుంటకల్

త్రేతాయుగంలో కైకేయి, ద్వాపరలో సత్యభామ...మీ అహంకారంముందు బలాదూర్ కదండీ?

★ కాని ఏం లాభం! కైకేయి సమయ స్ఫూర్తి, సత్యభామ అలుక కాస్తైనా రాలేదే—నాకు అని బాధపడుతూంటాను.

జి. వి. కె. ఆర్. — హైదరాబాదు

పని జరగలేదే — ఎలా అన్న బాధ ఎలా తగ్గుతుంది?

★ ఏ పూట పని ఆపూట చేసి రేపు బాధ పడితే పని జరుగుతుంది. బాధా తగ్గుతుంది!

కె. పి. ఎమ్. — ఎమ్మిగనూరు

ఆడవాళ్ళని నమ్మకూడదంటారు...

★ ఎవరు?!

రాజు ఆమె చేతిలో వంద రూపాయలు పెట్టాడు.

'ఏంటిది రాజా! నేను వేసిన వేషానికి మరొక నటి అయితే యెంత తీసుకుంటుంది?' — మాధురి గొంతు గద్గదమైంది, తను చేసిన పనికి తగిన ఫలితం రాలేదనే బాధ ఆమెది.

తన లోతు కళ్ళల్లోంచి రాజా మాధురి వైపు జాలిగా చూశాడు, కాని జాలి అనేది పైకి వ్యక్తమైతే ఆ రంగంలో అది యెంత పనైనా చేయిస్తుందని అనుభవం వల్ల నేర్చుకున్న రాజా తనను తాను సంబాళించుకొని పైకి పకపకా నవ్వాడు, మాధురి అసహ్యించుకుంది.

'మాధురీ! ఎవ్వరూలేక నీ దగ్గరకు రాలేదు. ఏదో పైకి వస్తావని పిలుచుకు వచ్చాను. ఎవరికైనా వళ్ళు అమ్ముకుంటే మాత్రం యింతకన్నా యెక్కువ వస్తుందా? ఇలా బిగిసిపోతే లాభం లేదమ్మాయ్!' రాజా అన్నాడు.

సహించలేని మాధురి కారులోపలకు తల తోసేసుకుంది. చవకబారు వాళ్ళతో వ్యవహారాలు

వెండితెర బొమ్మ

యిలాగే ఉంటాయి. ఇంకా మాట్లాడితే రాజింకా యెలాంటి మాటలయినా అనగలడు. అనుకొంటుండగా కారు కదిలింది.

ఆ చిత్రం విడుదలయితే తనకు మంచి పేరూ వస్తుంది. ఎక్కువ వేషాలు వస్తాయి. తన కష్టాలు తీర్తాయి. కొంచెం హుందాగా బ్రతకవచ్చు. ప్రతీ వాడిచేతా మాటలు పడక్కరలేదు, అదీగాక తనను హేళన చేసినవారే ఒకనాటికి తన కాళ్ళ దగ్గరకు వస్తారు. వారే అభినందన పత్రాలు చదువుతారు.

ఆ చిత్రం విడుదల రోజున పేపర్లలో ప్రకటనలు చూసింది. తన పేరు లేదు, బొమ్మ లేదు. మాధురి గుండెలో రాయి పడింది, మోసం చేసారనుకుంది.

క్రొత్త నటనికద అందుచేత వేయలేదని సమాధాన పరుచుకుంది. చిత్రం ఆమె చూచింది. తన పేరు లేదు, బొమ్మ లేదు. మాధురి గుండెలో రాయి పడింది. మోసం చేసారనుకుంది.

క్రొత్త నటనికద అంచేత వేయలేదని సమాధాన పరుచుకుంది. ఆమె పేరు 'టైటిల్స్'లో లేదు. ఆమె ముఖం కూడా ఒకసారే కనిపించింది.

కథానాయిక వేయనన్న దిగంబర దృశ్యాలకు తనను వాడుకున్నారని మాధురి గ్రహించింది. కాని ఆమె యేమీ బాధపడలేదు.

సామాన్య సంసారాలలో స్త్రీకి మూడు ముఖ్య రూపా లున్నాయి. ప్రేయసిగా, భార్యగా, తల్లిగా ఆమె రూపొందుతుంది. సినిమా రంగంలో కూడా ప్రతీ నటికీ మూడు ముఖ్య వేషా లుంటాయి. కథానాయిక, వాంప్, లేకపోతే ద్వితీయ ప్రాధాన్యత గల పాత్రలు. ఇప్పుడు నాలుగవ రూపం గల పాత్రలు సినీ రంగంలో ప్రవేశించాయి.

ఆ పాత్రకు 'క్లోజప్స్' వుంటాయి. కానీ గుర్తింపు ఉండదు.

ప్రఖ్యాతులైన కథానాయికల అభిమానధనాన్ని కాపాడడానికి సినీ రంగంలో వారి పేరున ప్రజలకు అసభ్యత చూపడానికి కొత్త వృత్తి ప్రవేశించింది. ఆ వృత్తి తనతోనే ప్రారంభమైంది. మాధురి శుష్కంగా నవ్వి తన శరీరం వైపు చూసుకుంది.

మాంసలమైన దేహంలో మనస్సు యెక్కడుందనే ప్రశ్నకు సమాధానం దొరకలేదామెకు.



పువ్వురేకుల-తాజా తనంలా జై
మిమ్మల్ని చాలా-ఆహ్లాదకరంగా ఉంచుతుంది.





సౌందర్యపు మెరుగులతో జై

సౌందర్య సబ్బు మల్లెపూల వాసనతో

టాటా ఉత్పత్తి

OBM 2067 TL

సీరియల్

గాజుమేడ

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

13

(గత సంచిక తరువాయి)

"అన్నయ్య దగ్గర్నుంచి వస్తూన్న ఉత్తరాల ధోరణినిబట్టి, వాడు లీలని పెళ్లి చేసేసుకున్నట్లే కనిపిస్తోంది. అయితే ఆ మాట వాడూ స్పష్టంగా రాయడంలేదు, జవాబులో తనూ సూటిగా అడగడంలేదు. ఆ రాసేది అయినా నెలకో రెండు నెలలకో ఒకటి రాస్తాడు. అందులో కూడా ఉండేవి మూడే మూడు ముక్కలు. 'నేనూ లీలా క్షేమం నువ్వు కులాసాగా ఉన్నట్లు తలుస్తాను. అన్నగారిగా నేనేం చెయ్యలేకపోయినా, ఆ ప్రభాకరం నీ భవిష్యత్తుని చక్కగా తీర్చిదిద్దుతున్నందుకు సంతోషం. ఎప్పుడో ఓ మాటు తీరిక చేసుకుని వచ్చి నిన్ను చూడాలని ఉంది కాని ఈలోగా ఈ ఉత్తరానికి జవాబు వెంటనే రాయి. ఆలశ్యం చేస్తే మేం ఇంకో ఊరు వెళ్లిపోవచ్చు, ఎడ్రస్ మారిపోతుంది... ఇవే వాక్యాలు ఏ ఉత్తరంలో చూద్దాం అన్నా... ఒకే ఉత్తరానికి తీసిన నకళ్ళు తక్కినవన్నీ... ఎమ్. బి. బి. యస్. లో చేరి తను రెండేళ్ళు కావస్తూన్నా వాడికి తీరిక దొరకలేదు ఒక్కమాటు తనని వచ్చి చూసి వెళ్లడానికి... అయినా వాడు వచ్చేదేమిటి తనే చూసి వస్తుంది వాళ్ళని... ఎడ్రస్ ఉందికదా... ఈ ఉత్తరానికి జవాబుగా తనే వెళితే సరి .."

మురళి కోణార్కం నుంచి రాసిన ఉత్తరం అందగానే ఉష ఇలా ఆలోచించి, వెంటనే కాలేజీకి నాలుగు రోజులు శలవు పెట్టి, ప్రత్యేకంగా ప్రొఫెసరు గురుమూర్తిగారి ఇంటికి వెళ్లి చెప్పి, మర్నాడు ఉదయమే కోణార్క్ బయలుదేరింది.

ఎడ్రసు ప్రకారం, మురళీ లీలా అద్దెకి తీసుకున్న బంగళాని వెతుక్కుంటూ వెళ్లి వెళ్లి, 'మురళి—ఆర్టిస్టు' అని రాసి ఉన్న బోర్డు దగ్గర ఆగింది అదో చిన్న కాంపౌండువాలూ గేటూ ఉన్న చిన్న బంగళా. లోపల గదులు రెండే ఉన్నాయో మూడే ఉన్నాయో కాని, బంగళా చుట్టూ కావలసినంత పెరడూ, అందమైన గార్డెనూ ముచ్చటగా ఉన్నాయి. గేటుని ఉన్న మురళి నైన్ బోర్డుని చూస్తేనే, మురళిని చూసినంత సంబరం అయిపోయింది ఉషకి. బోర్డుని ఆప్యాయంగా చేత్తో తడుముతూ 'అన్నయ్యా!' అని పిలిచింది.

ఆ పిలుపు మనస్సుకి చల్లగా, మలయమారుతంమీంచి తియ్యగా వినిపించిన పిల్లనగ్రోవి పాటలా, హాయిగా చెవిని సోకేసరికి, ప్రొద్దుట దేవాలయంలో చూసి స్కెచ్ రాసి తీసుకువచ్చిన మార్దంగికురాలి బొమ్మని వేస్తూ వేస్తూన్నవాడల్లా మధ్యలో ఆపేసి "ఉషా!" అంటూ ఇవతలికి వచ్చాడు మురళి. ఒకర్నొకరు చూసుకుని పట్టలేని సంతోషంతో కౌగలించుకున్నారు. చేతిలో ఉన్న జిప్ బేగ్ పక్కని పెట్టి, వరండా చిట్టిమీదే అన్నయ్య పక్కగా కూర్చుంది ఉష. ఆమె తలని తన గుండెలకి హత్తుకొని చెంపలు నిమురుతూ "ఎన్నాళ్లయిందమ్మా నిన్ను చూసి" అన్నాడు మురళి డగ్గుత్తికతో. "ఏమిటన్నయ్యా యీ చెల్లెలు ఎలావుందో ఏమైందో చూడడానికి ఒక్కమారైనా రాలేదు!" అంటూ భోరున ఏడ్చేసింది ఉష. "ఎందుకమ్మా ఏడుస్తావు, దూరంగా వున్నా యిద్దరం సుఖంగానే వున్నాంకదా? ... వద్దాం, వద్దాం అనుకుంటూంటేనే ఆలస్యం అయిపోయిందమ్మా! బాధపడకు." అన్నాడు మురళి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ.

చాలాసేపటిదాకా ఉష ఏడుస్తూనేవుంది. "ఊరుకో ... మా తల్లివికదూ?" అంటూ మురళి బుజ్జగిస్తూ కన్నీళ్ళు తుడుస్తూ ఊరుకోబెడుతూనే వున్నాడు. ఇంతలో రెండు చేతుల్లోనూ పళ్ళూ, కూరలూ వున్న రెండు సంచులు పట్టుకుని, మెయిన్ గేట్ తోసుకువచ్చిన లీల, షాక్ తిన్నట్లు అమట్టున అక్కడే ఆగిపోయింది.

మురళి గుండెలమీద తల పెట్టుకొని ఏడుస్తూన్న అందమైన అమ్మాయి! ... ఆమె కళ్ళనీళ్ళు తుడుస్తూ ఊరుకోబెడుతూన్న మురళి!

కాళ్ళకింద భూమి కదిలిపోయినట్లూ, ఆకాశం ఫెళఫెళా విరిగి మీదపడ్డట్లూ అయి, చేతిలో వున్న బేగ్‌లు అమట్టునే వదిలేసి, పట్టలేని ఆగ్రహంతో పిచ్చికేక పెట్టబోయింది. ఆమె గుండెలు అగ్నిపర్వతంలా మండి, ఎటువంటి నిప్పుల్ని కక్కి వుండేవో!

"మా ఉష లీలా!" అని మురళి పట్టలేని సంతోషంతో చెప్పేసరికి, అంత ఆగ్రహం ఆశ్చర్యంగా మారిపోయి, లీల వెంటనే ఆనందంతో గబగబా నడిచి వెళ్ళి, ఉష పక్కని కూర్చుంది. కొత్త కావడంవల్ల కొంతా, అనుకోని ఆశ్చర్యం కలగడంవల్ల కొంతా, ఉషా, లీలా ఒకళ్ళని చూస్తూ ఒకళ్ళు వుండిపోయారేకాని యెవరూ మాట్లాడలేదు. 'తను చదువూ అంటూ వెళ్ళిపోయినందుకు, ఈవిడ ఆదుకుంది కనక కానీ లేకపోతే అర్థం శుభ్రం తెలియని పసివాడిలాంటి అన్నయ్య ఏమైపోయి వుండేవాడో!' ఈ ఆలోచన రావడంతో ఒకరకమైన కృతజ్ఞతా, ఆప్యాయతా గుండెనిండా నిండిపోయి "వదినా!" అంటూ ఆమె రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుంది ఉష. లీల కూడా ఎంతో అనురాగంతో ఆమె చేతులు నిమిరి, ఏదో చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక వుండిపోయి, "ముగ్గురం యిక్కడ కూర్చుండిపోయాం ఏమిటి? లోపలికి వెళదాం రండి" అంటూ ఉష పట్టుకొచ్చిన జిప్ బేగ్‌ని అందుకొంది. ఓ చేత్తో లీల చేతిని వదలకుండా పట్టుకుని, రెండో చేత్తో, లీల తెచ్చిన కూరల సంచీ తీసుకొంది ఉష. పళ్ళున్న రెండో సంచీని మురళి పుచ్చుకున్నాడు.

ముగ్గురూ లోపలి గదిలోకి వెళ్లి నేలమీద పరిచి ఉన్న జంబుకానా మీద కూర్చుంటూంటే, బొమ్మ వేస్తూ వేస్తూ గది మధ్యలో వదిలేసిన ఈజిల్‌ని మడిచి గోడవారనిపెట్టి, ఈజిల్ మీదఉన్న ఫ్రేమ్ తీసి గోడని ఉన్న మేకుకి తగిలించాడుమురళి.

"మార్కెట్ నుంచి కూరలూ పళ్ళూ నువ్వు తెచ్చావేమిటి వదినా?" అంది ఉష.

"పట్నవాసం పిల్లలకి అలవాటేలే!" అన్నాడు మురళి ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"ఏం చెప్పమంటావమ్మా! ఇలా ఉంది మీ అన్నయ్య వరస. లోకువ కట్టి నాచేత ఆడ పనీ మగ పనీ కూడా చేయిస్తున్నాడు. ఎవరితో చెప్పకోను? ఆడబడచు అర్ధమొగుడు అన్నారు కనుక నా అవస్థ నీతోనైనా కొంత చెప్తాను... విని, నన్ను ఆదుకో" అంటూ వగలుపోయింది లీల.

ఉష నవ్వి, వెంటనే కోపం నటిస్తూ "అదేవిట్రా? ఎంత బొమ్మలు గీస్తూ కళా ప్రపంచంలో మునిగి తేలుతూ ఉంటే మాత్రం బజారుకి వెళ్లి సరుకులు తేలేవూ? మనింట్లో ఇలా ఆడవాళ్ళు మార్కెట్‌కి వెళ్లి కూరలు తెచ్చే అలవాటు ఎప్పుడేనా ఉందా?" అంది.

జరిగిన కథ 8: భద్రయ్యగారి పిల్లలు మురళి, ఉషలు. భద్రయ్యగారి ఆస్తంతా దాన ధర్మాలతో హరించిపోయింది. భద్రయ్యగారి కుటుంబాన్ని కనిపెట్టి వుండమని కొడుకు ప్రభాకరానికి చెప్తారు జోగమ్మగారు. ఉషని చెరచ ప్రయత్నిస్తాడు అంకరాజు. భద్రయ్యగారు మరణిస్తారు. ఢిల్లీ చిత్ర కళా ప్రదర్శనలో బహుమతి సంపాదిస్తాడు మురళి. ఉషని మద్రాసులోని ఆంధ్ర మహిళా సభలో చేర్పిస్తాడు ప్రభాకరం. దొడ్డమ్మ జోగమ్మగార్ని చూడాలని వస్తుంది లీల. మురళితో కలసి విహార యాత్రలకి బయల్దేరుతుంది లీల. పెళ్లనే తంతు లేకుండానే దంపతు లౌతారు లీల మురళిలు. మెడిసన్ పూర్తయ్యాకే పెళ్లి అన్న ప్రభాకరం అంటే యేవగింపు కలుగుతుంది ఉషకి.

"బాగుందే చెల్లాయ్ నువ్వనే మాట. మనింట్లో ఇలా అబ్బాయిల్ని ఎత్తుకుపోయే అలవాటుందేమిటి ఆడవాళ్ళకి ?" అంటూ మురళి కొంటెగా చూశాడు లీలకేసి.

లీల ఆక్షేపణగా మూతి తిప్పి "మరే! చేదు మేశారు మహరాజులు!" అంది. వాళ్ళ సరసాలు చూసి మనస్ఫూర్తిగా, హృదయం విందుగా, పక పకా నవ్వింది ఉష. "అన్యోన్యం అయిన దాంపత్యం అంటే ఇలా ఉండాలి. ఎలాగైనా అన్నయ్య అదృష్టవంతుడు... కావాలని కోరి ప్రేమించి వచ్చిన శ్రీమంతురాలు శ్రీమతి అయింది. అంతకంటే ఏ పురుషుడికైనా కావలసింది ఏముంది ?... తనని పెళ్లి చేసుకుంటే ప్రభాకరాన్ని కూడా ఇంతకంటే మురిపాలలో ముంచెత్తగలదు తను... కాని... కాని..." ఉష ముఖంమీద విషాద మేఘం ఒక్కమాటు వచ్చి మాయం అయింది. "అందరికీ ఇలాంటి అదృష్టం లభించవద్దూ?... కోరిన భర్తని కొంగున ముడేసుకుంది... తనకంటే వదిన అదృష్టవంతురాలు!" ఉష దీర్ఘంగా నిట్టూర్చి "వదినా – ఎలాగైనా నువ్వు చాలా అదృష్టవంతురాలివి" అంది.

"ఎందుకో!" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అడిగింది లీల.

"కోరుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడంకంటే ఆడదానికి కావలసింది ఏముంది ?"

"ఏవమ్మోయ్! ప్రియుడు మొగుడయితే చాలా యిబ్బందులున్నాయి. అసలు నన్నడిగితే తను కోరుకున్నవాడు భర్త కావడంకంటే, తనని కోరుకున్నవాడు వచ్చి మెళ్ళో తాళి కడితే, ఆడది ఎక్కువ సుఖపడుతుంది."

ఆ మాటకి ఉష అదిరిపడింది.

నిజంగానా ? వదిన తమాషాకి అంటోందా ?

"నేను స్వానుభవంవల్ల చెప్తున్నాను. నా మాట నమ్మ్మ. మీ అన్నయ్యే కావాలని కట్టుకోవడం వల్లే, నాకీ కూరలు పట్టుకురావడం, సంసారం దిద్దుకోవడం, తాపత్రయం, జంజాటమూను. నేను పుట్టింట్లో ఎంత గారంగా పెరిగానో! అక్కడ చెంబు యిక్కడ పెట్టి ఎరగను..."

"ఉండవమ్మా నేర్చుకుపోయావుగానీ...నువ్వు మా అన్నయ్యని ప్రేమించిన సంగతి మహ గొప్పగా చెబుతున్నావు ... మా అన్నయ్య నిన్ను ప్రేమించలేదా ?"

"రామ! రామ! ఆవగింజంతయినా లేదు. అతను నన్నెందుకు ప్రేమిస్తాడూ, అతని ప్రేమికురాలు వేరే వుండగా ?"

ఉష వులిక్కిపడింది. వెంటనే సర్దుకుని కొంచెం కోపంతో "ఏవిటి వదినా నువ్వు అంటున్నది ?" అంది.

"అవునమ్మా! నేను అబద్ధం చెప్పడంలేదు. కావలిస్తే అతన్నే అడుగు. నా ఎదురుగుండానే ఆ ముద్దరాలితో కులుకుతూ, ఒక్కొక్కప్పుడు నాతో ఊసూ పలుకూ కూడా ఆడడు."

"ఊరుకో వదినా! అభాండం వెయ్యడానికేనా అర్థం వుండాలి. మా అన్నయ్యకి వేరే ప్రియురాలు వుందా ? ఎవరా ప్రియురాలు ?" ఉష గద్దించి అడిగింది.


"ఎవరేమిటి ? ... అదిగో...ఆ గోడని జేర్లబడి వుంది. చూడు" అంటూ అతి సీరియస్‌గా, గోడకి జేర్లవేసి వున్న ఈజిల్‌ని చూపించింది...

"ఓః! అదా ?" అంటూ ఉష పకపకా నవ్వింది. లీల కూడా అప్పటిదాకా అతి ప్రయత్నం మీద ఆపుకొన్న నవ్వుని వెళ్ళగక్కేసింది. మురళి తప్పుచేసిన వాడిలా తల వంచేశాడు.

"కబుర్లలో మరిచిపోయామ. ఏ వేళ బయల్దేరేవో ఏమో! ముందు కొంచెం కాఫీ తాగు" అంటూ ఫ్లాస్కులో కాఫీ వంచి, మూడు కప్పుల్లో పోసి అందులో రెండు ఉషకీ, మురళికీ చెరో కప్పూ అందించింది. "మా చెల్లెలికి నామీద చాడీలు చెప్పి చెప్పి పాపం నువ్వూ అలిసిపోయావు. నువ్వు కూడా తీసుకో కాఫీ" అంటూ మూడో కప్పు మురళి లీలకి అందించాడు.

"నేను రోజూ అలిసిపోతూనే వున్నాను నీతో. నువ్వు నమ్మవుకాని ఉషా! మీ అన్నయ్య నన్ను ముప్పతిప్పలు పెడుతున్నాడనుకో! నేను మీ అన్నయ్యని మీరు అనడంలేదని ఏం అనుకోకుసుమా! ... అతను నాకంటే ఏమంత పెద్దవాడుకాదు...పైగా మీరు అంటే దూరం అయినట్లూ, హృదయానికి

(28వ పేజీ చూడండి)





★ సినిమా విశేషాలు ★

వెల్ కమ్ టు ఆల్ !

అన్నారు "ఎవర్‌గ్రీన్ హీరో" నాగేశ్వరరావు గారు ఇటీవల పాత్రికేయులు కొందరు అక్కినేనిని వారి యింట కలిశారు అప్పుడొక పాత్రికేయుడు మీరెన్ని చిత్రాలను అంగీకరించారు అని ప్రశ్నించారు. తన డైరీ ప్రకారం 1977 డిశంబరుదాకా ఖాళీ లేదన్నారాయన

మీ సంస్థలకు మాత్రమే కాల్‌షీట్లు యిస్తారా ? (జగపతి, సురేష్, అన్నపూర్ణ, చిత్ర కల్పన) అని మరొకరు అడిగిన ప్రశ్నకు "వెల్‌కమ్ టు ఆల్" అని సమాధానం యిచ్చారు

అన్నపూర్ణా స్టుడియోస్‌లో అయితేనే నటిస్తాను అని రూల్ ఏదైనా పెట్టారా అని ఇంకొక జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు అలాంటి ఆంక్షలేమీ వుండవు అన్నారు అక్కినేని

అన్నపూర్ణా స్టుడియోస్‌లో జగపతి పిక్చర్స్ వారి "బంగారు బొమ్మలు" ప్రారంభం అవుతుందని చెప్పి, ముమ్మందు తను బిజీగా నటించడానికి నిర్ణయించిన నిజాన్ని వెల్లడించారు

అన్నపూర్ణా స్టుడియోస్‌లో ప్రస్తుతానికి రెండు ఫ్లోర్లు నిర్మింపబడుతున్నట్టు, తర్వాత కొన్నాళ్ళకు రికార్డింగ్ థియేటర్, లాబ్ వచ్చే అవకాశం వున్నట్టు అక్కినేనిగారి మాటల్లో స్ఫురించాయి

ప్రభుత్వం యిచ్చిన ఇరవై రెండు ఎకరాల స్థలంలో స్టుడియో నిర్మాణానికి ఏడు ఎకరాలు మాత్రమే పనికొచ్చినట్టు, మిగులు స్థలంలో సుందరోద్యానం (అవుట్‌డోర్‌కు పనికొచ్చే తోట) వెయ్యదలచినట్లు నాగేశ్వరరావుగారు చెప్పారు

"క్షేత్రయ్య" పాత్రను గూర్చి ప్రేక్షకుల్లో అపోహ వున్న మాట వాస్తవమే అయినా, అన్ని తరాల వారికి నచ్చే కథ గాబట్టే, తను అంగీకరించడం జరిగిందని స్పష్టపరిచారు

"క్షేత్రయ్య" చిత్రాన్ని నిర్మించాలన్న వుద్దేశ్యం అంజలీ పిక్చర్స్‌కు 1959 లో ఏర్పడిందని, యిప్పుడు మంజుల ధరిస్తున్న పాత్రను అంజలీదేవి వెయ్యదల్చిందని, నాగేశ్వరరావుగారు వివరించారు

ఛాయాగ్రహణ నిర్మాణం

ఆంధ్ర చలనచిత్ర రంగం గర్వించదగ్గ ఉత్తమ ఛాయాగ్రహణ దర్శకుల్లో రామకృష్ణారావు ఒకరు




ఆగష్టు 10 వ తేదీన హైదరాబాద్ ఫిలిం సర్కిల్ వారు తార వాణిశ్రీని ఘనంగా సన్మానించారు. ఆసభలో శివాజీ ఆమెకు 'ఫలకం' అందజేస్తున్న దృశ్యం

సత్యచిత్రలో టాప్ త్రీ

"తాసిల్దారు గారి అమ్మాయి" చిత్రాన్ని అందించిన సత్య చిత్ర అధినేతలు సెప్టెంబరు యిరవై అయిదున తమ వర్ణ చిత్రాన్ని ప్రారంభిస్తున్నారని, లక్ష్మి నాయికగా నటిస్తున్నారని రాశాను

సత్య చిత్ర అధినేతగారయిన సత్యనారాయణ గారిని యిటీవల హైదరాబాద్‌లో కలిసినప్పుడు, హీరోయిన్ పాత్రను వాణిశ్రీ పోషిస్తున్న నిజాన్ని వెల్లడించారు.

"జీవనజ్యోతి" చిత్ర విజయానికి దర్శకుడు విశ్వనాథ్, నాయకుడు శోభన్, నాయిక వాణిశ్రీ దోహదకారులన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరు ఆ ముగ్గురూ సత్య చిత్రలో కలిసి పని చెయ్యడం ముదావహం "టాప్ త్రీ" పాల్గొంటున్న సత్య చిత్రవారి వర్ణ చిత్రానికి జి కె రాము, మహదేవన్, గొల్లపూడి పెద్ద సపోర్ట్ నివ్వగలరు



''అమ్మా—నాన్న''లో జయసుధ

దేవుడు యిచ్చిన చెల్లెలు

శ్రీ విజయలక్ష్మి నరసింహా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ''దేవుడు యిచ్చిన చెల్లెలు'' చిత్రం, రాజశ్రీ ప్రతిభను బుజావుచేసే విధంగా వుందన్న నిజం రషస్ చూచిన విమర్శకులు వెల్లడించారు

కథలో బిగువు, కథనంలో సొగసు, దర్శకత్వంలో విసురు వున్నట్టు చిత్ర రంగానికి సంబంధంలేని వ్యక్తులు అన్నారు

హీరోగా రామకృష్ణ నటనలో సహజత్వం, సౌలభ్యం కనిపించినట్టు, మమత లోని బింకం ప్రేక్షకులను మత్తెక్కించగలదన్నట్టు సినిమా చూచినవారు అభిప్రాయపడ్డారు

దొంగగా వున్న ఒక వ్యక్తి, దొరికిన చెల్లెలు అంశ విధించడంతో దొరగా మారిన విచిత్ర సంఘటనసారమే రాజశ్రీ రాసి,రచనచేసి, దర్శకత్వం నెరపుతున్న ''దేవుడు యిచ్చిన చెల్లెలు'' చిత్రం

ఈ చిత్రానికి సత్యం సంగీతాన్ని, మధు ఛాయాగ్రహణాన్ని, బాలు కూర్పును, సోమనాథ్ కళను నిర్వహిస్తున్నారు

చిత్రంలోని ముఖ్య పాత్రలను మురళీమోహన్, సుమిత్ర, త్యాగరాజు, ధూళిపాళ, పొట్టిప్రసాద్, అశోక్‌కుమార్ పోషిస్తున్నారు

తిగెల బాపారావు సన్స్ సమర్పించు ''దేవుడు యిచ్చిన చెల్లెలు'' చిత్రాన్ని టి గోవిందరాజు నిర్మించ, పూర్ణా పిక్చర్స్ విడుదల చేస్తారు

ఈ కాలం దంపతులు

ఇది శ్రీ గౌతమ్ పిక్చర్స్ బ్యానరుపై రామబ్రహ్మంగారు నిర్మిస్తున్న చిత్రానికి పెట్టిన పేరు ఈ చిత్రానికి కావిలిపాటి విజయలక్ష్మిగారి ''అపశ్రుతులు'' నవల ఆధారం

సతీపతుల మధ్య ఎలాంటి అనురాగ, అనుబంధాలు ఏర్పడాలి ? సాంసారిక జీవితంలో వారి, వారి పాత్రలు ఎలాంటివి ? అనే అంశాలపై చక్కగా చిత్రీకరింపబడుతున్న చిత్రమే ''ఈ కాలం దంపతులు''

నవలలను తెర కెక్కించడంలేదనే అసంతృప్తి మనవాళ్లలో అపుడపుడు ఏర్పడుతునే వుంది కానీ నిజానికి మన నిర్మాతల్లో కొందరు అడపదడప నవలలను సినిమాలుగా తెర కెక్కిస్తూనే వున్నారు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా పై చిత్రాన్ని పేర్కొనవచ్చు

జమున, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, ఎస్వరలక్ష్మి, రావి కొండలరావు, రమాప్రభ, సి హెచ్ కృష్ణమూర్తి, మిక్కిలినేని, ఎం పి ప్రసాద్, టి జి కమల ముఖ్య పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రంలో మురళీమోహన్, హేమాచౌదరిల యంగ్ పేర్ ఒక ప్రత్యేక ఆకర్షణ

రచనా విభాగానికి డి వి నరసరాజు, సంగీత శాఖకు సత్యం, కళా విభాగానికి కృష్ణారావు, ఛాయాగ్రహణకు భాస్కరరావు, వెంకటరత్నం ప్రొడక్షన్ విభాగానికి పని చేస్తున్న ఈ చిత్రానికి డి యోగానంద్ దర్శకుడు

ఇంతకాలం ఛాయాగ్రహణం మాత్రమే తన వృత్తిగా పెట్టుకొన్న రామకృష్ణారావుకు కొత్త ఆశ చిగురించింది అలాంటి ఆశకు అక్కినేని ఆశీర్వాదం లభించింది

రామకృష్ణారావుగారి చిత్రానికి ఆదుర్తి దర్శకత్వం, ఎన్యానంద్ సంభాషణం తథ్యము అని చిత్ర నిర్మాతగా మారిన, ప్రముఖ ఛాయాగ్రహకుడు చెప్పారు

అక్కినేనిగారి ఆశీర్వాద బలంతో, కొత్త రంగానికి పరిచయమవుతున్న రామకృష్ణారావుకు, హీరో ఎవరన్న సమస్య తలెత్తగలదా ?

''మంచిమనిషికి మంచిరోజులొస్తాయి'' అనేది నానుడికి రామకృష్ణారావు ప్రత్యక్ష నిదర్శనం

ప్రతాప్‌కు మహారథి !

సంచలనాత్మక చిత్రాలను, ప్రబోధాత్మక చిత్రాలను నిర్మించే సంస్థగా ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్‌కు పేరు వున్నది నేటి దాసరిని దర్శకుడుగా పరిచయం చేసినది, రచయిత రాజశ్రీకి దర్శకత్వ భాగ్యం కలిగించినది రాఘవగారే ఆయన నిర్మించబోయే చిత్రానికి త్రిపురనేని మహారథి రచయితగా కార్య రంగంలోకి ప్రవేశించారు

''హి—మాన్'' కొత్త తరహా పాత్రను పోషించ 'షావుకారు' జానకి, సత్యనారాయణ ముఖ్య భూమికలను ధరిస్తున్నారు

సత్యనారాయణ లేని చిత్రం వుందా ?

ఎవరు కొత్త చిత్రం ప్రారంభించినా, ఆ చిత్రంలో సత్యనారాయణగారు వుండాలి అనేది అభిప్రాయం నిర్మాతలకు ఏర్పడడానికి కారణం, ఆయనలోని నటనా ప్రాభవం అనడం అక్షరాలా నిజం

అందరినీ తృప్తి పరచాలన్న సత్సంకల్పం సత్యనారాయణగారికి వున్నా, ఎందరికని కాల్‌షీట్లు నివ్వగలరు ?

వైవిధ్యం వున్న పాత్రలను పోషించగల ప్రతిభ యిప్పట్లో సత్యనారాయణగారికి మాత్రమే వున్నదని చెప్పగల ధైర్యం నాకుంది

గీతా ఆర్ట్సువారి ''దేవుడే దిగివస్తే'' చిత్రంలో సత్యనారాయణ నవరస నాయకుడుగా అద్వితీయంగా నటించారు

శ్రీ గౌతమ్ పిక్చర్స్‌వారి ''ఈ కాలం దంపతులు'' చిత్రంలో సత్యనారాయణ నటన 'ఏ' వన్‌గా వున్నది

సురేష్ ప్రొడక్షన్స్‌వారి ''సోగ్గాడు'' చిత్రంలో ''అందాల విలన్''గా సత్యనారాయణ భలేగా వున్నారు

శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్‌వారి ''రక్తపాశం'' చిత్రంలో మంచిని పెంచే ప్రజాబంధుగా సత్యనారాయణ ప్రశంసనీయంగా నటించారు

పద్మశ్రీ పిక్చర్స్‌వారి ''అందరూ బాగుండాలి'' చిత్రంలో సత్యనారాయణ నటనకు వస్తు మార్కులివ్వాలి

ఇంతెందుకు ? సుయోధనుడి పాత్ర పోషణకు సత్యనారాయణ మాత్రమే న్యాయం చెయ్యగలరన్న అభిప్రాయం ''ద్రౌపది''ని తెర కెక్కించదలచిన యిద్దరికీ వున్నది

''పౌరాణికం, జానపదం, సాంఘికం, చారిత్రాత్మకం'' — ఏ పాత్ర పోషించినా, అందులో జీవించినట్టు నటించగల ప్రజ్ఞావంతుడు గాబట్టే, ఎవరు చిత్రం తలపెట్టినా, అక్కడ సత్యనారాయణ కావలసి వస్తున్నారు

చిత్ర చిత్రానికి నటనపట్ల కృషి, శ్రమ, శ్రద్ధ చూపిస్తున్నారు కాబట్టే, ప్రేక్షకులు సత్యనారాయణగారంటే ప్రత్యేక గౌరవంతో ఆదరిస్తున్నారు



''ఈకాలపు పిల్లలు''లో ప్రభ, శ్రీదేవి

ప్రజాబలుడు

బజుల్లా రోడ్డు దగ్గర ఏ రోజు చూచినా, అయిదారు బస్సులు నిలబడి వుంటాయి ఉదయం ఆరుగంటలకల్లా వందలాది యాత్రికులు తమ ప్రియతమ కథానాయకుని చూడాలన్న ఆపేక్షతో బారులుతీరి వుంటారు

తనకోసం వచ్చిన అభిమాన జనులకు కని పించి, అయిదారు నిమిషాలు వారితో ఇష్టాగోష్ఠి చెయ్యడం "నటరత్న" దినచర్యగా పెట్టుకొన్నారు

చిత్ర పరిశ్రమ కొచ్చి యిరవై ఏడేండ్లు పూర్తయినా, యిప్పటికీ ప్రజలచేత ఆకర్షింపబడు తున్న నందమూరిని "ప్రజాబలుడు" అనడం అపరాధమా ?

ప్రేక్షకుల దీవెనలే తన ప్రగతికి, ఉన్నతికి

సినిమా

కారణాలు అని నమ్మే రామారావుగారిని "ఎదురు లేని మనిషి" అని పేర్కొనవచ్చు

ఎదురులేని మనిషి

వైజయంతీ మూవీస్ రంగుల్లో నిర్మిస్తున్న నవరస చిత్రానికి "ఎదురులేని మనిషి" అని పేరు పెట్టినట్టు, నిర్మాత అశ్వినీదత్ చెప్పారు

రష్ చెప్పిన నిజం

"ఎదురులేని మనిషి" చిత్రం తాలూకు కొంత రష్ చూశాను చిత్రం ఆద్యంతం రామారావుగారి ఆధిక్యత కనిపించింది ముఖ్యంగా "నటరత్న" గెటప్ ఆకర్షణీయంగా వుంది



"కసిగా వుంది" పాటకు నందమూరి అభినయం అద్భుతం అని చెప్పక తప్పదు

ఇక అగ్రనటి అంటారా స్వీట్ సిక్స్‌టీన్‌గా సాక్షాత్కరించింది సహాయ పాత్రలను జగ్గయ్య, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, కాంతారావు, రాజ బాబు, పద్మప్రియ ప్రతిభావంతంగా పోషించారు

అన్నితరగతుల వారిని ఆకట్టుకునే కథను యీ చిత్రం గొనియుండడంవల్ల, నిర్మాత దత్‌కు ధన వర్షం తథ్యము దర్శకుడు బాపయ్య, ఛాయా గ్రహణ దర్శకుడు వెంకటరత్నం, సంగీత దర్శకుడు మహదేవన్ పోటీపడ్డారు

ప్రమీల పెండ్లి ?

సెక్సీ తారగా ప్రమీలకు పేరున్నది ప్రస్తుతం "బాలనాగమ్మ" చిత్రంలో సంగు పాత్రను ప్రమీల పోషిస్తున్నది సంగు అంటె చెంగు చెంగున ఎగిరే అందగత్తె ఆ పాత్రకు ప్రమీల పూర్తి న్యాయం చేస్తున్నది

"ఆస్తికోసం" చిత్రంలో ప్రమీల శృంగార రసాధి దేవతగా నటిస్తున్నది కాకతీయ పిక్చర్స్‌వారి చిత్రంలో సంఘర్షణకు గురి అయిన పాత్రను పోషిస్తున్నది

ఇటీవల పత్రికలవాళ్లను తన యింటికి పిలిచి, నవంబరులో తనకు వివాహం జరగగలదని, తదనం తరం చిత్రాల్లో పని చెయ్యబోదని వివరించిన విష యాన్ని పాఠకులకు తెలిపాను

పెళ్లికి స్వస్తిచెప్పిన ప్రమీల

గత వారం ప్రమీలను ఆమె యింట కలిసి నప్పుడు, పెండ్లి భోజనం గూర్చి అడిగాను "అయామ్ సారీ పెండ్లికి స్వస్తి చెప్పాను మున్ముందు పెండ్లిని గూర్చి ఆలోచించను ఎప్పటి వలె సినిమాల్లో నటిస్తాను" అని వెల్లడించింది

"అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజస్"!

"శారద" చిత్రాన్ని మర్చిపోవడం సాధ్యమా ? "ఊర్వశి" యొక్క సాంకేతిక విలువల్ని మరువ గలమా ? ఈ రెండు చిత్రాలను నిర్మించిన వుత్తమ చిత్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజస్

ఈ సంస్థ డిశంబరులో ప్రారంభించబోయే చిత్రం యీనాటి ప్రేక్షకులు యిష్టపడేదిగా వుండ గలదని, కథకుడు క్రాంతికుమార్ వివరించిన అంశా లను బట్టి చెప్పగలుగుతున్నాను

ఈ చిత్రంలో జయసుధ, మురళీమోహన్, గిరిబాబు, అల్లు రామలింగయ్య ప్రధాన పాత్రలను పోషిస్తారు "క్యారెక్టర్ ఆర్టిస్ట్" సత్యనారాయణ గారి పాత్ర చుట్టూ కథ నడుస్తుంది

ఆంధ్రప్రదేశ్‌లో 10 x 3 (నెల రోజుల్లో) చిత్రం పూర్తయ్యే విధంగా నిర్మాత ప్లాన్ వేశారు ఈ చిత్రానికి చక్రవర్తి సంగీతాన్ని, సత్యానంద్ రచన్ను, అంకిరెడ్డి కూర్పును నిర్వహిస్తున్నారు

← "మల్లెల మనసులు"లో విజయనిర్మల

జమున తరువాత పేర్కొనవలసినది సంగీత దర్శకుడు చలపతిరావును మధుర మధురంగా వున్నాయి ఆయన కూర్చిన బాణీలు

తారాగణంలో సత్యనారాయణ, రావుగోపాల రావు ఫస్టు మార్కులు సంపాయిస్తారు పద్మనాభం — రమాప్రభల హాస్యంలో థ్రిల్ వుంది

ఈ చిత్రాన్ని నిర్మించిన శ్రీ కుప్పుస్వామికి ధనంతోబాటు పేరు, ప్రఖ్యాతులు వస్తాయి

'ప్రేక్షకుల మాట'

ఆగస్టు మొదటి వారం నుంచి వరుసగా ఆరు రోజులు భాగ్య నగరం నుంచి, గుంటూరు వరకు ప్రయాణం చేశాను చిత్రాల పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించడమే నా ప్రయాణోద్దేశము

గత రెండు మాసాల్లో విడుదలయిన చిత్రాల్లో శ్రీరామ చిత్రవారి "ముత్యాల ముగ్గు" చిత్రాన్ని గొప్పదిగా ప్రేక్షకులు నిర్ణయించారు బాపుగారి దర్శకత్వాన్ని, ఇషాన్ ఆర్య ఛాయాగ్రహణాన్ని, ముళ్లపూడి రచనా రమణీయతను, రావు గోపాలరావు నటన్ను, అల్లు రామలింగయ్య హాస్యాన్ని పదేపదే ప్రశంసించారు.

"జీవనజ్యోతి" చిత్రం తరువాత, అందరినీ ఆకర్షించిన చిత్రం "ముత్యాల ముగ్గు" అని ప్రజలు నిర్మొహమాటంగా చెప్పారు

"ధర్మేంద్ర - అమిత"

"నాకూ స్వతంత్రం వచ్చింది" చిత్రం హీరో కృష్ణంరాజు అంతస్తును పెంచిన నిజాన్ని ప్రేక్షకుల ద్వారా తెలుసుకొన్నాను.

ప్రజల్లో కృష్ణంరాజుకు "స్పెషల్ ఫాలోయింగ్" వున్నదని తెలుసుకొన్నాను "ధర్మేంద్ర, అమిత" వేషాలకు కృష్ణంరాజు మాత్రమే సరిపోతాడు అనేడి భావం ప్రజలకు వుంది

— శ్రీనివాస్



జయసుధ జయిస్తుంది

ఏ వి కె ప్రొడక్షన్స్‌వారి "లక్ష్మణ రేఖ" చిత్రాన్ని చూచిన ప్రతి వ్యక్తి జయసుధ నటన "సుపర్బ్" అన్నారు అగ్రనటి మాత్రమే ఆ పాత్రకు న్యాయం చెయ్యగలదని, నిర్మాతలతో (కథ విన్నప్పుడు) నేను చెప్పాను

నిర్మాతలు ఏ వి కృష్ణారావు, షణ్ముగంగార్లు మూడు మాసాల్లో చిత్రం పూర్తి చెయ్యాలను కొన్న కారణంగా, చిన్న తారలతో నిర్మించడానికి నిర్ణయించారు అప్పుడు హీరోయిన్ పాత్ర ఎవరికి యివ్వాలి అన్న సంశయం బయల్దేరింది

జయసుధ అయితే, కొంత న్యాయం చేకూర గలదు అని నేను సలహా యిచ్చాను నిర్మాతలు, నిర్వాహకుడు వెంకటరత్నం ఆమెకు నా మాట ప్రకారం హీరోయిన్ వేషం యిచ్చారు

"లక్ష్మణ రేఖ" చిత్రం పూర్తయింది చూచిన ప్రతి వొక్కరూ "సెహభాష్ జయసుధ" అని ప్రశంసించారు

ఈ చిత్రంలో గుమ్మడి, చంద్రమోహన్, మురళీమోహన్, సుమ, అల్లు రామలింగయ్య, ఛాయాదేవి, కె వి చలం ప్రధాన తారాగణం కొత్త దర్శకుడు ఎస్ గోపాలకృష్ణకు ఖ్యాతి తెచ్చిపెట్టగలదీ చిత్రం స్త్రీలు పదే పదే చూడ దగిన చిత్రం "లక్ష్మణ రేఖ"

న్యూవేవ్ చిత్రం వనజ — గిరిజ

పత్రికా రచయిత గౌతమ్ దర్శకత్వంలో సర్వజనరంజకంగా తయారైన "వనజ — గిరిజ" చిత్రం, తెలుగు చిత్ర రంగంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించగలదు

"న్యూవేవ్" చిత్రంగా "వనజ — గిరిజ"ను పేర్కొనవచ్చు మరు జన్మ వుందో లేదో అని సందేహించేవారికి "వుంది" అని నిరూపించే చిత్రం "వనజ — గిరిజ"

వనజగా, గిరిజగా జమున అద్వితీయంగా నటించింది రెండు జన్మల కథానాయికగా వలసిన వ్యత్యాసాన్ని జమున అసాధారణంగా చూపెట్టింది



"సొగ్గాడు"లో శోభన్‌బాబు, నాగేష్

యువతరం



'పాత నాణాలు' సేకరించడం నిరంజన్‌రెడ్డి ముఖ్యమైన హాబీ. బి.ఏ. రెండోఏడాదిలో వున్న యూనివర్సిటీ జాంకళాశాల హైదరాబాద్ విద్యార్థి దగ్గర "వెయ్యన్నర" దాకా దేశ విదేశాలకు చెంది చరిత్రాత్మకమైన క్రీ.శ. 4వ శతాబ్దపు కాలంలోని, 15, 17 శతాబ్దాల నాటివి ఎన్నో 'నాణెములు'న్నాయి. అసలితనికి మిస్మాటిజం మీద మోజు కలగటానికి ఓసారి వాళ్ల అమ్మగారు వాళ్లింట్లో పాత సామానంత సర్దుతూ దొరికిన కొన్ని నాణేలను కొడుక్కియివ్వటమే కారణమట!

బొంబాయి వెళ్లినప్పుడు గేట్‌వే ఆఫ్ యిండియా దగ్గర కలసిన ఒక యిండోనీసియా పైలట్ రెడ్డికి కొన్ని వాళ్ల దేశం నాణాలు బహూకరించాడు. ఇతను నిరంతరన్వేషి. ఫలితంగా క్రికెట్ వీరుడు జైసింహ దగ్గిర, మాజీ ముఖ్యమంత్రి పి. వి. నరసింహారావుగారి వద్ద యిలా చాలామంది ప్రముఖుల నుంచి యీ అమూల్య 'పాత నాణాలను' రెడ్డి సంపాదించి తన 'భండారాన్ని' నింపుకున్నాడు. ఈ "న్యూ మిస్మాటిక్స్" "ఓల్డ్ కాయన్స్" అంటేనే మోజు అని చెప్పాడు.

ముగ్గురు అన్నదమ్ములు ముగ్గురు అక్కచెల్లెళ్లూ వాళ్లు. వాళ్ల తాతగారి వూరు కరీంనగర్ జిల్లాలోని నెమలికొండ. నిరంజన్‌కి శత్రుఘన్‌సిన్హాతో పరిచయం వుంది. హిందీ బయస్కోపుల్లో వేషాలు కూడా వేశాడుట. తెనుగులో కూడా వేయాలనే వుంది కాని ఏది ఏమైనా అతనికి యీ నాణేల సేకరణ ముఖ్యం. సిద్దార్థ న్యూ మిస్మాటికా అసోసియేషన్ ద్వారా యీ హాబీకి ప్రచారం యివ్వాలని సర్దా. బి. ఏ. ఐనాక ఏం చేయాలీ అన్న ప్రశ్నకు నిరంజన్‌కి ఆర్కియాలజీ (పురావస్తు శాస్త్రం) అధ్యయనానికి వెళ్తానన్నాడు... (ఒ. ఏ.)

దగ్గరగా లేనట్లా అనిపిస్తుంది."

"నీ ఇష్టం వచ్చినట్లు పిలుగానీ, మా అన్నయ్య నిన్ను బాధ పెడుతున్నాడా? నేను నమ్మను మా అన్నయ్య వట్టి మగాడు!"

"అంటే అమాయకుడనా నీ ఉద్దేశం? హమ్మో! ఆయనా అమాయకుడు! నాచేత ఎంత బతిమాలించుకున్నాడో. ఎన్ని వగలు పోయాడో — తననీ తన కళనీ ఎంత పొగిడించుకున్నాడో! చివరకి ఎన్ని షరతులు పెట్టి పెళ్లికి ఒప్పుకున్నాడో నీకేం తెలుసు? నువ్వు డబ్బున్నదాని వన్నాడు... చదువుకున్నదాని వన్నాడు... పెళ్లికి మా చెల్లెలు రాకుండానా అన్నాడు... అబ్బబ్బ! తెగ విసిగించేశాడనుకో!... మీ అమ్మ నాకోసమే కన్నారు ఈ మహానుభావుణ్ణి... ఆవిణ్ణి తలుచుకోని క్షణం ఉండదనుకో."

"పోన్లే... ఈ వంకనేనా అత్తగారిని తలుచుకుంటున్నావు." అన్నాడు మురళి.

"అమ్మ కనక బ్రతికి ఉంటే, ఇలాంటి బంగారు తల్లిలాంటి కోడలు వచ్చినందుకు, ఎంత సంబర పడిపోయి ఉండునో, ఎన్నిసార్లు బుగ్గలు పుణికి ముద్దులు పెట్టుకొని ఉండునో" అంది ఉష, మురిపెంగా లీల కేసి చూస్తూ.

"నువ్వు ఇంకా అలాంటివి అన్నీ చెప్పి పొగుడు. రేపు నువ్వు వెళ్లిన తర్వాత నన్ను పొగడమంటూ కూర్చుంటుంది... పొద్దస్తమానూ కీర్తి గీతాలు పాడితేనేకాని గుక్కెడు కాఫీ, గొంతుకలో పడదు" అన్నాడు మురళి ఓరగా లీలని చూస్తూ.

"మరే!...నువ్వొపొగడ్డం?...నీకుఇరవై నాలుగు గంటలూ పొగిడించుకోవడమే కాని పొగడ్డం కూడా వచ్చా? ఉషా మీ అన్నయ్యతోటి నాకు ఎంత యాతనగా ఉందో! ప్రతి నిముషం పొగిడితేనే కాని బొమ్మలు వెయ్యడు... ఆ పొగడ్డం కూడా ఎలా అని? ఆ చిత్రం బాగుంది అని చెప్తే సరిపోదు ఎందుకు బాగుందో చెప్పాలి. ఎలా బాగుందో వివరించాలి... ఇంకో బొమ్మ వెయ్యండని ప్రోత్సహించాలి... ఇలా ఇరవై నాలుగు గంటలూ స్తుతి పాఠాలు చేస్తూంటేనేసరి! లేకపోతే నిరుత్సాహంతో నీళ్ళు కారిపోయి ఇంక బొమ్మలు వెయ్యలేనని దిగాలు పడి డీలా పడిపోతారు."

గాజు మేడ

(23 వ పేజీ తరువాయి)

"నేనూ అలాగే వెనక ఉండి ప్రోత్సహించేదాన్ని వదినా... ఆ సంధ్యా దేవి కళ్యాణ వేదిక ఎంత పొగిడితే వేశాడని?"

"అయితే ఈ కళాకారుల కందరికీ వెనక ఓ చెల్లెలో అక్కయ్యో, ఓ భార్యో ప్రియురాలో ఎవరో ఒకరు ఉండాలి. ఉంటేనే గొప్పవాళ్ళు అవుతారు. ప్రతి మహానుభావుడి విజయం వెనకాలా ఓ మహిళ హస్తం అదృశ్యంగా ఉంటుంది అనేది అక్షరాలా నిజం అన్నమాట!... ఇంత సహాయాన్ని పొందుతూ కూడా ఈ మగాళ్ళకి ఆడవాళ్ళపట్ల కృతజ్ఞత ఉండదేమిటమ్మా?" అంటూ ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది లీల.

భోజనాల దగ్గర వదినా మరదళ్ళిద్దరూ ఛలోక్తులు పొగిస్తూ, మాటల్ని పూలచెండుల్లా విసురుతూ, మధ్య మధ్య ఇద్దరూ కలిసి తనని జోక్ చేస్తూంటే, వింటూ మురళి మురిసిపోసాగాడు. వాళ్ళిద్దరూ అలా ఉండడంకంటే తనకి కావలసింది ఏముంది? తన చిరకాల వాంఛ తీరింది అనుకున్నాడు.

సాయంత్రం పెద్ద బుట్టతో బుట్టెడు పువ్వులూ ఉష కొంటూంటే "ఇద్దరికి యిన్ని పువ్వులెందుకు ఉషా?" అనడిగింది లీల. ఉష అప్పటికేం సమాధానం చెప్పకుండా నవ్వి వూరుకుంది. ఇంకో గంట అయేటప్పటికి లీలకి అర్థం అయింది. వెంటనే చిరుకోపంతో "ఛా...ఊరుకో... ఎవరేనా నవ్విపోతారు." అంది. ఉష వినిపించుకోలేదు. "నువ్వు నాకంటే చిన్నపిల్లవి" అని లీల ఉషని కసురుకుంది. "పువ్వుల జడ నే కుట్టుకోను; కావలిస్తే నువ్వు కుట్టుకో" అంటూ భీష్మించింది.

ఉష నవ్వుతూ "నేనే కుడతానులే. అయినా పువ్వుల జడ నీకు నువ్వే ఎలా కుట్టుకుంటావు?" అంది.

లీల "నాకిలాంటి సరదాలు లేవు" అంది. "ఎప్పుడూ పువ్వుల జడ వేసుకోలేదు" అంది. "సిగ్గేస్తోంది బాబూ" అంది. ఏం చెప్పినా ఉష వినిపించుకోలేదు. జడ వేస్తున్నంతసేపూ లీల గునుస్తూనే వుంది. మధ్య మధ్య "నాకు వద్దు" అంటూ లేవబోయి, యిటూ అటూ కదులుతూనే వుంది.

"కదిలావంటే మొట్టుతాను జాగ్రత్త! చిన్నప్పుడు మీ అమ్మా నాన్న చేత, మొట్టికాయలు తిన్నావో లేదో కాని యిప్పుడు నాచేత తప్పవు" అంటూ బెదిరించింది ఉష. పువ్వుల జడ సాగిన కొద్దీ లీల సిగ్గుతో కుంచించుకుపోయి, తన పెద్దరికాన్ని మరిచిపోయి, ఉష ముందు చిన్నపిల్లలా మారిపోసాగింది. లీల కంటే చిన్నదే అయినా, లీలని అలంకరించి, పెద్ద ఆరిందాలా ప్రవర్తించ సాగింది ఉష.

జడ కుట్టడం పూర్తిచేసి లీలని తనవేపు తిప్పుకుని "అబ్బ! ఎంత అందంగా ఉన్నావో! మొదటి ముద్దు నాకు" అంటూ చటుక్కున లీల చెక్కిలి మీద ముద్దు పెట్టుకుంది ఉష. ముద్దు పెట్టుకుంటూనే బోసిగా ఉన్న లీల మెడ చూసి గతుక్కుమని "ఇదేమిటి వదినా! మెడలో మంగళ సూత్రాలు ఏవీ?" అంది. లీల తేలిగ్గా నవ్వేసి ఊరుకుంది. "పెళ్లి అయినందుకు చిహ్నంగా మెళ్ళో మంగళ సూత్రాలూ నల్లపూసలూ ఉండొద్దూ? మా అన్నయ్య పెళ్లి హడావిడిలో మంగళసూత్రాలు నీ మెళ్ళో కట్టడం మరిచిపోయాడా ఏమిటి కర్మ?" అంది కంగారుగా ఉష.

"అసలు మాకు పెళ్లి అంటూ ఓ తంతు జరిగితేగా?"

"పెళ్లి జరగలేదూ?... మరి?"

"పెళ్లి అంటే — అదే — ఓ రోజు 'మేం ఇద్దరం కూడబలుక్కుని భార్యా భర్తలం అయిపోయాం — అంతే!"

"ఏమిటి? పెళ్లి అసలు జరగనేలేదా? మంత్రాల వివాహం కాకపోతే మానె — దండలు మార్చుకోవడమో — గుళ్ళో అనుకోవడమో — రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్లి సంతకాలు చెయ్యడమో — ఏదో ఒకటి... ఏం జరిగినా ఫరవాలేదు."

"ఏమీ జరగలేదు."

"అదేమిటి?... అన్నయ్య వద్దన్నాడా? లేక —"

"నేనే అవసరం లేదన్నాను."

"చాలా పొరబాటు చేశావు వదినా! పెళ్లి అనేది మగాడి కంటే ఆడదానికే చాలా అవసరం —

వివాహం అనేది జరక్కపోతే పురుషుడికి బాధ్యత ఏం ఉంటుంది ? ఓ రకంగా ప్రకృతి, స్త్రీకి బరువు బాధ్యతలు ఎక్కువ ఇచ్చి అన్యాయం చేసింది. దానికి తోడు పురుషుడు కూడా స్త్రీకి ఎక్కడ అన్యాయం చేస్తాడో అని, బాధ్యతల నుంచి అతను తప్పుకోడానికి వీలు లేకుండానూ, స్త్రీ భవిష్యత్ జీవితం భారమై అంధకారం కాకుండానూ, బాగా ఆలోచించి మానవ సంఘం ఈ వివాహ వ్యవస్థని స్త్రీ పాలిట వరంలా ఏర్పాటు చేసింది. మన కోసం అని తయారైన ఈ పెళ్ళిని మనమే వద్దంటే, అంతకంటే అవివేకం ఏమైనా ఉందా ?"

"ఏవిటి ఉషా!... పిచ్చి ఆలోచన కాకపోతే, పెళ్ళి అనేది పురుషుడి కంటే స్త్రీకి ఎక్కువ అవసరమా ? ఎందుకు ?... మగాడు ఆడదాన్ని మోసం చేస్తాడేమో అనేకదా ?... మోసం చెయ్యని మొగాడుంటే... ఇంకప్పుడు పెళ్ళి అవసరం లేదుగా? ఒకవేళ మోసమే చేశాడనుకో! అంతటి ప్రేమనే కాదని అతను వెళ్ళిపోతే ఇంకా దాంపత్యం ఉండేం, లేకేం ? నీ పిచ్చిగాని, దుర్మార్గుడైన పురుషుణ్ణి వివాహబంధం ఆపి ఉంచుతోందా?... ఉంచగలదా?"

లీలతో వాదించి లాభం లేదని ఊరుకొంది ఉష.

కాని ఆ సంగతే ఆలోచిస్తూ ఉండిపోయింది, రాత్రి చాలా పొద్దుపోయి, పక్కమీదకి చేరేదాకా. కొద్ది ఫర్నీచర్‌తో వచ్చిన అద్దె ఇల్లేమో ఓ పెద్ద మంచం, రెండు చిన్న కేంప్‌కాట్‌ల లాంటి మడత మంచాలూ ఉన్నాయి. గదిలో తెల్లని దుప్పటీ పరచిన పెద్ద మంచం మీద నడుం వాలుస్తూ, పక్క గదిలో కేంప్‌కాట్ మీద పడుకున్న చెల్లెల్నీ, తన గదిలోకి సిగ్గుపడుతూ నెమ్మదిగా వచ్చిన భార్యనీ, భార్య కుట్టుకున్న పువ్వుల జడనీ చూసి మురళి, "ఇదేవిటి ? పక్కలు యిలా ఏర్పాటు చేశావు ? ముగ్గురి మంచాలూ ఒక గదిలోనే వెయ్యకపోయావు ?" అన్నాడు నెమ్మదిగా లీలతో.

లీల కొంచెం కోపంతో "ఎవరు వేశారని నన్ను అంటావు ? ... ఈ ఏర్పాట్లన్నీ మీ చెల్లెలివే !" అంది. "అహ" అని నవ్వుకుని మురళి దీర్ఘాలోచనలో పడ్డాడు. పెళ్ళికాని చెల్లెలు ఇంట్లో వుండగా, తను లీలతో కాపురం చెయ్యడం, అంత వివేకం కాదేమో! దూరం ఆలోచించకుండా ప్రవర్తించాడా తను ? లీలా తనూ ఇప్పుడిలా వేరే గదిలో పడుకుంటే దానికి యిబ్బందిగా వుండదూ ? ఉష చేస్తే మాత్రం ఈ ఏర్పాట్లు, మార్చేస్తే ఏం ? కాని యిప్పుడు మారిస్తే ఎలా ? మళ్ళీ యీ విషయంమీద కొంత చర్చా ? .. మురళి ఇబ్బందిగా ఫీలయ్యాడు. ఒక అరగంట వరకూ ఆ వస్తూవూ ఈ వస్తూవూ సర్దుతున్నట్లు నటించి, ఉషకి మాగన్నుగా నిద్ర పట్టింది అని అనుకున్నాక లీల నిశ్శబ్దంగా తలుపు దగ్గరవేసి, చప్పుడు కాకుండా గడియ పెట్టింది. దగ్గరగా జేరిన లీలని యధాలాపంగా అక్కున చేర్చుకున్నాడు కాని, మురళి స్పర్శలో రోజూ వుండే తపనా ఆవేశం కనిపించలేదు. లీల తన పువ్వుల జడని మురళి నడ్డిచుట్టూ తిప్పి మధురంగా బంధించి ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఆమెకి ఆరోజు ప్రత్యేకంగా కనిపించింది. అతను మాత్రం రోజులాగ కాకుండా అనాసక్తితో నిరుత్సాహంగా వున్నాడు. లీల యింకా మురళిని తనవాడిని చేసుకోలేదు. మురళీ, లీలా యింకా పూర్తిగా నడుం వాల్చనూ లేదు.

ఎవరో వీధి తలుపు తట్టిన శబ్దం.

లీల వులిక్కిపడి, మురళినుంచి విడివడి, దూరంగా కూర్చుంది. మళ్ళీ తలుపు కొట్టారు... యీమారు ఎవరోకాని పిలుస్తూ తలుపు తట్టారు. ఈ అర్ధరాత్రివేళ ఎవరు చెప్మా ?

"మురళీ ! ... మురళీ !"

"మా అన్నయ్య ప్రభాకరం కాబోలు !" కంగారుగా చెవిలో అంది లీల. ఈలోగా అవతల గదిలో పడుకున్న ఉషకి మెలుకువ వచ్చింది కాబోలు, వెళ్ళి తలుపు తీసింది. లోపల గదిలో వున్న లీలకీ, మురళికీ అవతలనుంచి మాటలు వినిపించసాగాయి.

"మీ...రా ?"

"అవును...ఉషా...నువ్వెప్పుడొచ్చావు ?"

"పొద్దుటే వచ్చాను అన్నయ్యనీ, లీలనీ చూసి పోదాం అని."

"చిత్రంగా కలిశాం! నేనూ నిన్న భువనేశ్వర్‌లో ఓ స్నేహితుడి పెళ్ళికొచ్చి దగ్గర్లోనే వున్నారుకదా అని వీళ్ళని చూడ్డానికి వచ్చాను. ఎడ్రస్ ప్రకారం వాకబుచేసి వచ్చేటప్పటికి రెండు గంటలు పట్టింది..."

"లేవండి భోజనం చేద్దురుగాని."

"ఇంక భోజనం చెయ్యడంలేదు. ఏం లేదు. కాసిన్ని మంచినీళ్ళు తాగడం, పడుకోవడం."

వచ్చింది ప్రభాకరం అని నిర్ధారణ అయ్యాక "లేచి వెళ్ళి తలుపు తీసి పలకరిద్దాం" అన్నాడు మురళి. "ఇప్పుడా ? ఈ పరిస్థితిలోనా ?... ఈ పువ్వుల జడతో అన్నయ్యకి కనిపించడం నాకు సిగ్గు బాబూ !" అంది లీల. "పోనీ నువ్వు నిద్దరపోయినట్లు పడుకో – నేను వెళ్ళి పలకరించి వస్తాను" అన్నాడు మురళి.

"నువ్వూ వద్దులెద్దూ. మనకి మెలుకువ రానట్టే ఉందాం ? అంతగా ఉష తలుపు తడితే అప్పుడు చూసుకుందాం – పడుకో పొద్దుట మాట్లాడవచ్చు."

"అది సరే... అతనికి పక్కా అదీ చూడొద్దూ"

"ఉష చూసుకుంటుందిలెద్దూ."

"అతను ఎక్కడ పడుకోవడం ?"

"అక్కడ ఇంకో మంచం ఉంది."


"అదికాదు లీలా – వాళ్ళిద్దరూ ఆ గదిలో ఎలా పడుకోడం."

"ఎలాగేవిటి ? ఇక్కడ మనం ఎలాగో అలాగే!"

"వాళ్ళకి పెళ్ళి కాలేదు."

"మనకి అయిందేవిటి మహా !... పైగా ఇవాళ కాకపోతే రేపైనా పెళ్ళి చేసుకోబోయే వాళ్ళే ఇద్దరూ... కాబోయే దంపతులు... అంత తెలివి తక్కువవాళ్ళు కాదులే... అర్థంలేని ఆలోచనలు ఏం పెట్టుకోకుండా హాయిగా నిద్దరో" లీల ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసిపారేసింది కాని, మురళి మాత్రం ఓ పట్టాన సర్దుకుని సరిపెట్టుకోలేకపోయాడు. ఆవతల గదిలో పడుకున్న తన చెల్లెలు, ఎంత సమర్థురాలు, తెలివైంది, నిప్పులాంటి పిల్ల అయితే మాత్రం ? పెళ్ళికానిది. ఆనక ఆ ప్రభాకరం తన చెల్లెల్ని పెళ్ళాడవచ్చు, పెళ్ళాడకపోవచ్చు. నీతి నియమాలపట్లా, గౌరవ మర్యాదలపట్లా అచంచల విశ్వాసం వున్నవాడే కావచ్చు. ఇద్దరూ జాగ్రత్తగానే వుండొచ్చు. అయినా..." మురళి గదిలో వుండలేకపోయాడు. ఇవతలకి రాలేకపోయాడు. "నీకు తెలియదు లీలా! నువ్వు ఊరుకో" అని లీలని ముదలించడం అతని వల్లకాదు. ఆమె మాటని కాదని పోనీ తలుపు తీద్దాం అంటే, అవతల ప్రభాకరం, ఉషా ఏం అనుకుంటారు ? మామీద అంత నమ్మకంలేదా, అంతటి బలహీనులం అనుకున్నావా మేం అని వాళ్ళు నొచ్చుకుంటే ?...

మురళికి ఆలోచనల్లో ఆ రాత్రి ఎంతసేపటికీ నిద్దరపట్టలేదు. ఒక్క మురళికే గాదు ... ఇవతల గదిలో ఉషకి కూడా ఆ రాత్రి కంటిమీద కునుకు లేదు. ప్రభాకరానికి తను పడుకున్న గదిలోనే యింకో మంచంమీద పక్క వేస్తున్నప్పుడు ఒక్క క్షణం లీలనీ, మురళినీ లేపి, తనూ లీలా, ఓ గదిలోనూ, మురళీ, ప్రభాకరం యింకో గదిలోనూ పడుకొనేలా పక్కలు ఏర్పాటుచేద్దాం అనుకొంది. కాని ఎందుకో లీలనీ, మురళినీ లేపాలి అనిపించ



లేదు ఉషకి వాళ్ళని లేపమని ప్రభాకరమూ అనలేదు తనతోపాటు ఆ గదిలో నిద్రపోవడానికి ప్రభాకరానికి అభ్యంతరం వున్నట్లు కనిపించలేదు అతను అభ్యంతరం చెప్పనప్పుడు తనెందుకు కాదనడం ? పైగా ఇదేదో చిత్రమైన సంఘటనలా అపూర్వమైన అవకాశంలా కనిపించసాగింది ఉషకి ప్రభాకరం, తనూ ఏకాంతంగా వుంటే ఈ రాత్రి అయినా అతనిలో కొంత సంచలనం కలుగుతుందేమో! తనపట్ల అనురాగం పెరిగి ఆ విధంగానైనా వెంటనే తమ వివాహానికి అంగీకరిస్తాడేమో!

ఈ రకమైన ఆశ హృదయంలో మెరిసేసరికి, ఉష శరీరం అంతా వేడెక్కి, నరాలన్నీ వణికి, ప్రతి కీలు కీలు దగ్గిరా పీకుతున్నట్లూ, యిష్టమైన యిబ్బంది ఏదో జివ్వుమని ఆవిరిలా ఒళ్ళంతా పాకినట్లూ, మత్తుగా నీరసంగా అనిపించింది అరగంటా నలభై నిముషాల దాకా కాలేజీ విశేషాలు అడుగుతూనేవున్నాడు ప్రభాకరం అన్యమనస్కంగా ఉ ష జవాబులు చెబుతూనేవుంది అనురాగపూరితమైన పలకరింపుకాని, ఆత్మీయతతో కూడిన మాటకాని, మనస్సులో ప్రేమని వ్యక్తం

గాజు మేడ

చేసే ఒక కవ్వింపు వాక్యంకాని ప్రభాకరం దగ్గర్నుంచి వస్తుందేమో అని ఎదురుచూసింది ఉష అతనిలో ఆ ధోరణి ఏం కనిపించకపోగా, నెమ్మదిగా నిద్రలోకి జారుకుని, ఇంకో అరగంట అయ్యేటప్పటికి హాయిగా గుండెలమీద రెండు చేతులూ వేసుకుని, ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు ప్రభాకరం

తనతో ఏకాంతంగా ఈ గదిలో వున్నందుకు అతనిలో అస్థిమితంకాని, ఉద్వేగంకాని, ఉత్సాహంకాని లేకపోగా, మరీ జడత్వంతో అలా నిద్దరపోవడం ఏమిటి ? తనమీద కోరిక వుంటే అతనికి అలా నిద్దరపట్టి వుండేదా ?

ఒకటి రెండు మార్లు లైటు వేసి నిద్రపోతూన్న ప్రభాకరం ముఖంలోకి చూసింది కావాలని అతని తలకింద దిండు సర్దింది మెళుకువ వచ్చి లేస్తాడనీ, లేస్తే తను పడుతూన్న తాపాన్ని బాధని చూసి అర్థం చేసుకుంటాడనీ, రెండు మూడు సార్లు, గుండెలదాకా ఉన్న దుప్పటిని మెడదాకా, కప్పింది అవసరం లేకపోయినా చప్పుడు చేస్తూ చెంబులో నీళ్ళు గ్లాసులో పోసుకు తాగింది వంట్లోంచి సెగలు పొగలుగా వస్తూన్న వేడిని తట్టుకోలేక, "ఉస్సు రుస్సు" రంటూ మంచం వదుం ఎక్కి కూర్చుంది గదిలోనే ఇటూ అటూ అలంగం తిరిగింది ఎంత అపుకుందాం అన్నా పట్టలేని ఆవేదన — అదుపు తప్పుతూన్న ఆవేశం — వయస్సు చేస్తూన్న అల్లరి ప్రభాకరం ఒకటి రెండుసార్లు లేచి, "పడుకో ఉషా " అని అనునయించి తిరిగి నిద్దరపోయాడు

శరీరం తన వశం తప్పి హింసిస్తుంటే ఆ బాధకి తట్టుకోలేక కొంచెంసేపు ఎక్కెక్కి ఏడ్చింది తనకేం పట్టనట్లు నిద్దరపోతూన్న ప్రభాకరాన్ని లేపి తనకి ఉన్న అక్కసు అంతా చివాట్లు పెట్టి తీర్చుకోవాలనుకుంది ఛీ ఏం మనిషి అని అసహ్యించుకొంది

మగాడు కాదు వత్తి అవతారం!

హృదయం కాదు లోపల ఉన్నదంతా గండశిల!

తనంటే మోజు లేదు — ప్రేమ లేదు — కోరిక లేదు – ఏమీ లేని, ఏమీ తెలియని ఈ శిలా విగ్రహం మీద తనకి మాత్రం మోజు ఎందుకు?

ఏడ్చి, ఏడ్చి, ఏడ్చి, చివరకి విరక్తి తెచ్చుకుంది మొండితనం తెచ్చుకుంది గుండెని బండగా, ప్రభాకరం అంటే అసహ్యించుకొనే మొండి వస్తువుగా మార్చుకుంది దృఢమైన నిశ్చయానికీ, ధైర్యమైన నిర్ణయానికీ వచ్చింది

ఆఖరిసారిగా నిద్రపోతూన్న ప్రభాకరంకేసి చూసి నిట్టూర్చింది తర్వాత కన్నీళ్ళు తుడుచుకుని, మనస్సుని చిక్కబట్టుకుని పడుకుంది ఉష దారం తెగిన గాలిపటంలా మెదడు తన యిష్టం వచ్చినట్లు ఆలోచించసాగింది అలా ఎంతసేపో - ఎన్ని రకాలుగానో!

ఆలోచనలతోనే ఉషకి తెల్లారిపోయింది

నాలుగైదు రోజులు వుంటానని జిప్ బేగ్ పుచ్చుకుని వచ్చిన ఉష, మర్నాడే హఠాత్తుగా వైజాగ్ ఎందుకు బయలుదేరిందో ఎవరికీ అర్థం కాలేదు

"అప్పుడే వెళ్ళడం ఏమిటమ్మా" అన్నాడు మురళి

"నాలుగురోజు లుండవోయ్" అని బతిమాలింది లీల "కాదూకూడదు వెళ్ళాలి" అంది ఉష

"ఇవాళ ఆగితే వైజాగ్‌దాకా నేను సాయం వస్తాను రేపు" అన్న ప్రభాకరం మాటకి, "ఎవరి సాయాలూ నాకు అక్కర్లేదు" అంటూ చకచకా వెళ్ళిపోయింది ఉష మురళీ, లీలా, ప్రభాకరం ఆమె వింత ప్రవర్తనకి విస్తుపోతూ అమట్టునే నిలబడిపోయి వుండిపోయారు ఏం అర్థంకాక

(ఇంకా వుంది)





ఇంగ్లండ్‌లో జరిగిన వింబుల్‌డన్ పోటీలలో విజయాన్ని సాధించిన అమెరికా టెన్నిస్ తారలు 98 ఏళ్ళ వింబుల్‌డన్ చరిత్రలో ఈ గౌరవాన్నందుకున్న నల్లజాతికి చెందిన తొలి క్రీడాకారుడు ఆర్థర్‌యాషే ఆరు సింగిల్స్‌లో అపూర్వ విజయాన్ని సాధించి, సింగిల్స్, మహిళల డబుల్స్, మిక్సడ్ డబుల్స్ పోటీలలో మొత్తం 19 విజయాలను సాధించిన వనిత శ్రీమతి బిల్లీజీన్ కింగ్ హర్షాతిరేకంతో తాము గెల్చుకున్న ట్రోఫీలను ప్రదర్శిస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చు.

— సీరియల్ —

రాగవీచికలు

— ఆదూరి వేంకటసీతారామమూర్తి —

15

(గత సంచిక తరువాయి)

ఈ మధ్య ఎందుకో ఆనందరావు – అతని కళ్లలో మునుపుండే చలాకీతనం లేదు. ఎప్పుడూ యేదో ఆలోచిస్తూనే వుంటాడు— మునపటిలా సాయంత్రాలు తిరగడం మానేసి యింటిపట్టునే కూర్చుంటున్నాడు...ఈ విషయాన్ని వూరినుంచి వచ్చింది మొదలు గమనిస్తూనే వుంది వర్ధని...బలీయమైన కారణమేదో వుండి వుండొచ్చని మాత్రం నిర్ధారణ చేసుకుంది...కానీ తనతో మాట్లాడేటప్పుడు మాత్రం చలాకీగానే పూర్వంలాగే మాట్లాడతాడు. కానీ ఎక్కడో యేదో దెబ్బ తగిలి వుండొచ్చు అనుకున్నా ధైర్యంచేసి అడగలేకపోయింది ... ఒకటిరెండు సార్లు పాఠం చెప్పించుకుంటున్నప్పుడు నోరుతెరిచి అడుగుదామన్నంత ప్రయత్నం చేసి కూడ ధైర్యం చాలక వూరుకుంది. ఆరిందాలా అడగటం తప్పితే తను చేసేదేముంది కనుక ?

ఓరోజు 'చకోర సందేశం' చెబుతున్నాడు ఆనందరావు ... శ్రద్ధగా వింటున్నదల్లా అకస్మాత్తుగా గుర్తుకొచ్చి 'అన్నట్టు సుందరి గారు బాగున్నారా' అనడిగింది ...

ఎదురుచూడని ప్రశ్నకి ఒక్కసారి తలెత్తి వర్ధని కళ్లలోకి చూశాడు ఆనందరావు ... క్షణాల్లోనే అతని కళ్లు ఎరుపెక్కాయి... 'ఆ దరిద్రురాలి గురించి నన్నడగకు వర్ధనీ' అంటూ లేచి నిలబడ్డాడు... అతనిలో కోపం బుసలు కొడుతున్న సంగతి వర్ధని గమనించి భయపడింది ... 'అనవసరంగా మీకు కోపం తెప్పించాను' అంటూ తలొంచుకుంది.

'కోపం కాదు వర్ధనీ...అటువంటి వాళ్లని తల్చుకుంటే అసహ్యమేస్తుంది.'

అతని మాటల కాశ్చర్యంగా చూసింది ... ఆరోజు ఆమె చేతిలో చెయ్యి కలిపి సరదాగా యేకాంతంలోకి యితరుల ప్రమేయం లేకుండా వెళ్లిన ఆనందరావేనా యితను అన్పించింది...

మనస్పర్ధలు ఒక్కోప్పుడు మనుషుల్ని దూరం చేసుకునేట్లు కూడా చేస్తాయి...కానీ ఆనందరావు తొందరపడే మనస్తత్వం కలవాడు కాదు ... ఒకరిపై అంత త్వరలో ఒక అభిప్రాయాన్ని యేర్పరచుకొని ఆ వ్యక్తిని ద్వేషించే స్వభావం కలవాడూ కాదు ... ఇక పోతే సుందరి విషయంలో తనకంత మంచి అభిప్రాయ మేర్పడలేదు ...

ఏది యేమైనా తను అడగకూడని ప్రశ్న అడిగింది అనుకుంది.

మనసులోని విషయం ఎదుటి వ్యక్తికి చెబితే కాస్త వూరట కలుగుతుందంటారు... కాస్తోకూస్తో తమ విషయం తెల్సినదే కాబట్టి సమయమొచ్చింది కనుక ఆనందరావే ఆ విషయాన్ని చెప్పదలచాడు.

'వర్ధనీ నేను జీవితంలో మొదటిసారిగా మోసపోయాను'. తన ముందు తలొంచుకున్న ఆనందరావు ముఖంలోకి చూడలేకపోయింది వర్ధని... 'సుందరిని ఒక ఆరాధ్య దైవంగా ఆరాధించాను... ఆమె చుట్టూ నా ప్రేమ నల్లుకున్నాను ... ఆమెనే జీవిత భాగస్వామిగా చేసుకోవాలని కలలు కన్నాను... కానీ ఆ రాక్షసి నా కలలన్నీ కల్లలు చేసేసి ఎవరితోనో లేచిపోయింది.' ఆఖరి మాటలు కత్తిలా దూసుకువస్తే ఆశ్చర్యంగా తలెత్తి చూసింది వర్ధని...

'అవును ! డబ్బున్నవాడిని చూసి వాడిని వలలో వేసుకుని మరీ పారిపోయింది ... డబ్బు కోసం మనుషుల్ని మార్చేయగల సమర్ధురాలు సుందరి ... సినిమాలకూ షికార్లకూ వాటికి పనికొచ్చే డబ్బుకూ యిచ్చేంత విలువ ఆ మనిషి కివ్వదు ... సుందరి నారాధిస్తూ నా కళ్లు నేను పొడుచుకున్నానని యిప్పుడిప్పుడు తెల్సుకుంటున్నాను.'

తన మనసులోని అక్కసంతా వెళ్లగక్కి కళ్లు తుడుచుకుంటున్న ఆనందరావుని చూస్తే జాలేసింది వర్ధనికి.

ఇంతగా మనసు నర్పించుకున్న వ్యక్తిని పోగొట్టుకున్న సుందరి ఎంతటి దౌర్భాగ్యురాలో అన్పించింది.

ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. తర్వాత ఆ ప్రస్తావనే మరి తేలేదు వర్ధని.

అన్నిటినీ మరచి చదువుపైనే దృష్టి లగ్నంచేస్తే రోజులు గడవటం పెద్దసమస్యగా అన్పించలేదామెకు...చదివినకొద్దీ ఎన్నో కొత్త కొత్త సందేహాలు ఆ సందేహాలు నివృత్తి చేసుకుంటే యింకా తెల్సుకోవాలనే జిజ్ఞాస...అసలీ విజ్ఞానానికి పరీక్షలెందుకో అనుకుంటుంది అప్పుడప్పుడు...వాటిమూలంగానే విద్యార్ధి బాహ్యప్రపంచాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేని పరిస్థితిలో వుండిపోతున్నాడేమోనని కూడ అనుకుంది.

ఒకరోజు సాయంత్రం వర్ధని సన్నజాజి మొగ్గలు కోస్తూంది. విమల మేడపైన వుంది. రాజశేఖరంగారు ఆరోజు ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళారు...ఆనందరావుమాత్రం తనగదిలో కూర్చుని చదువుకుంటున్నాడు.

వీధిగేటు చప్పుడైతే ఎవరా అని తలెత్తి చూసి అలానే వుండిపోయింది వర్ధని ... 'యేంటి వర్ధనీ అలా చూస్తూండిపోయావ్, కొంపదీసి నన్ను మర్చిపోయావేమిటి ?'

'ఛా అప్పుడే మర్చిపోడమేమిటి రాణీ... అందులో నిన్ను ... రారా లోపల కూర్చుందాం...' అంటూ లోనికి దారితీసి హాల్లో కూర్చోపెట్టి తనూ ఎదురుగా కూర్చుంది.

'యేమిటి రాణీ యేమిటి విశేషాలు ... రిజల్ట్సువచ్చాక మళ్ళీ చూడనేలేదు...'అంటూ స్నేహ పూర్వకంగా ఆమెవంక చూసింది ... చిన్నపువ్వులున్న తెల్లఫుల్ వాయిల్ చీరలో రాణి ఎందుకో పెద్దదానిలా కన్పించింది చక్కగా తీర్చిదిద్దుకున్న కాటుక కళ్ళు... వయసుతో పాటు నిండుదనాన్ని తెచ్చుకున్న శరీరాంగాలూ.. తెల్లగా పొడుగ్గా తేరిన చేతివేళ్ళను బుగ్గలమీద ఆన్చికూర్చున్న రాణినిచూస్తే ఎంతో ఆనందమనిపించింది...ట్యుటోరియల్ కాలేజీ మొత్తంమీద వర్ధనిని ఆకర్షించిన అమ్మాయి ఒక్కరాణే...ఆమెతోనే స్నేహాన్ని విస్తృతపరచుకుంది.

'ఇంతకి నువ్వేం చేస్తున్నావో చెప్పావు గాదు'

'యేముందీ చదువుకు స్వస్తిచెప్పి చిన్న పిల్లల్ని నలుగురిని పోగేసి ట్యూషను చెబుతున్నాను అడపా తడపా రేడియోవాళ్ళు పిలిస్తే వెళ్ళిరావటం. అంతే'

'అంటే రేడియోలో పాడుతున్నావా ?'

'అప్పుడప్పుడు...మనలాంటివారికి ఛాన్సు అంతవెంటనే రావద్దూ'

'ఎందుకు రాదూ...నీలో టాలెంటే లేక పోతే యేమో...'

'టాలెంట్స్‌తో పనేముందిగానీ యింతకీ మనకు లక్ అంటూ వుండాలిగా'...

'అది సరేననుకో...యింతకీ ట్యూషన్లు రెండుపూట్లా చెబుతావా ?'

'చెప్పక యేంచేస్తాను చెప్పు...అంలా తీరికేగా... తాతయ్య పెద్దవాడైపోయాడు ... పదింటికల్లా భోజనం పెట్టేసి కూర్చుంటే యేమిటో జీవితమంతా శూన్యంగా కన్పిస్తుంది...రేప్రొద్దున్న అదృష్టం కలిసొచ్చి యేదైనా వుద్యోగమొచ్చినా తాతయ్యను విడిచి రోజంతా వుండడం కష్టం ఇప్పుడు మరీ లేవలేని స్థితిలో వున్నాడు ... నెలకోసారి పెన్షనుకి వెళ్ళిరావడమే కష్టమైపోలోందత నికి...' అంటూ మధ్యలో ఆగి... 'అన్నట్టు మీఅమ్మ పోయిందటగా' అని వర్ధని ముఖం లోకి చూసింది...

'అవును...యిప్పట్లో పోతుందని మేమనుకోలేదు...' అంటూ జరిగినదంతా చెప్పి 'ఇంతకీ నీకీ సంగతెలా తెల్సిందో చెప్పావు కావు' అంది.

'అదా ! నువ్వు వూరెళ్ళినప్పుడు నేనోసారి వచ్చాన్లే ... మీ అత్తయ్యగారు చెప్పారు ... అప్పుడు రావడం మళ్ళీ యిదే'

ఇంతలోకే విమల హాల్లోకి రావడంతో పలకరింపుగా లేచి నిల్చుంది రాణి... 'నువ్వా రాణీ కూర్చో-మాటలు వినిపించి ఎవరోననుకొని వచ్చా...ఎలావున్నారు మీ తాతయ్య' ...

'బాగానే వున్నారండీ' అని కూర్చుంది...

'అత్తయ్యా...రాణి రేడియోలో పాడతోందట' అంది వర్ధని.

'ఏమ్మా ... ఎప్పుడో చెప్పావే గాదు ... కనీసం అలాగైనా వినేవాళ్ళం'

'లేదండీ నేను పాడినవే చాల తక్కువ'

'వర్ధని చెప్పడమే గాని వినలేదుగా నీ పాట'

ఆ మాటతో వర్ధని రాణిని బలవంతం చేసింది ఆపాట పాడమని. చుట్టూ చూసి 'యిప్పుడెందుకులే' అంది రాణి''

'సిగ్గెందుకూ ? రేడియోలో పాడేదానివి. అయినా ఎవరూ లేరులే...' మరింత మొహమాటం పెట్టేసరికి రాణి జయదేవుని అష్టపది ఆలపించింది.

పాట వింటున్నంతసేపూ వర్ధని వళ్ళు మరచిపోయింది. వయసులోపాటు కరం కూడ ఎరోమలపు తిరిగి కొత్తరాగాన్ని సంతరించుకున్నట్లుంది.

లోపల చదువుకుంటున్న ఆనందరావు కూడ ఆ పాటకు ముగ్ధుడై తెరచాటునుండి చూసి 'ఎవరూ—రాణా' అంటూ బయటికొచ్చి 'రాణి యింత బాగా పాడుతుందని



రాగవీచికలు

ఎప్పుడూ చెప్పలేదేం వర్ధనీ' అంటూ వర్ధని వంక చూశాడు.

సిగ్గుతో బుగ్గ లెర్రబడగా తలొంచుకుంది రాణి...

'బాగా పాడక యేమిటి? రేడియోలో కూడ పాడుతోందిట' అంది వర్ధని.

'యిూజిట్' అంటూ తలొంచుకునే బయటికి వెళ్ళిపోయాడు.

ఆనందరావు వెళ్ళిపోయాక 'యేమిటోయ్...అందరితోనూ అలా చెప్పేస్తున్నావ్' అంది రాణి వర్ధనిని.

''యేమన్నాను...వున్నదేగా...నా ఫ్రెండు రేడియో ఆర్టిస్టంటే నాకెంత గొప్ప'

'నిజంగా అయితే గొప్పేలే...కానీకాదుగా'

'నువ్వే అవులావోయ్...' అంటూ భుజం తట్టింది. కాస్సేపు పిచ్చాపాటీ వేశాక వెళ్ళిపోయింది రాణి.

16

సాయంకాలం నాలుగుగంటలై వుంటుంది.

ఆకాశం నిండా మబ్బులు ఆవరించి వాతావరణం ఒక్కసారి మారినట్లయింది...రివ్వున వీచే గాలికీ రోడ్డుపైనున్న ధూళి వలయాకారంగా తిరిగి చెప్పలేని వేగంతో దూసుకుపోతోంది ... చీకటి తెరల మాటున సూర్యుడు తన ప్రతాపాన్ని చూపలేక పశ్చిమాద్రివైపున సిగ్గుగా జారుకుంటున్నాడు.. వేళ కని పెట్టి అకస్మాత్తుగా వాలిన చుట్టంలా వాన చినుకులు నాలుగు టపటపా భూమ్మీద పడ్డాయి.

అప్పటికే పావుగంటనుండీ బస్సు కోసం ఎదురుచూస్తున్న వర్ధనికి ఒకవైపు చిరాకు కూడ పుట్టుకొచ్చింది. అక్కరకు రాని చుట్టంలా యీవేళప్పుడీ వర్షమేమిటో అని విసుక్కుంది. తను ఎక్కవలసిన బస్సుతప్ప మిగతావన్నీ వచ్చి వెళ్లాయి.

కదలక కదలక యిల్లు కదలడం రాణి యింట్లో లేకపోవడం, యీ చినుకులూ, బస్సు రాకపోవడం ఆ అమ్మాయి మనసును చికాకుపరుస్తున్నాయి... ఒక్కొకప్పుడింతే ... యే పనీ జరగదు.

'హలో వర్ధనీ...యేమిటి మీరిక్కడ నిల్చున్నారు.' ఆలోచిస్తున్నదల్లా చటుక్కున తిరిగి చూసింది.

స్కూటర్‌ను దగ్గరగా ఆపుతూ రజనీకాంత్!

'యేమిటలా చూస్తున్నారు ... కొంపదీసి మర్చిపోలేదుగద!'

నవ్వి 'అదేం లేదు' అంది.

'ఇంటికా ?'

'అవునండీ. అనవసరంగా యిక్కడ చిక్కుకుపోయాను' అంది.

'ఇక్కడివరకూ ఎలానూ వచ్చారు కాబట్టి మా యిల్లు చూద్దురుగాని రండి.'

'ఇప్పుడా ? ఎందుకులెండి' అనబోయి 'ఎక్కడుంటున్నారూ' అంది.

'మీరు రండి...నిమిషంలో తీసుకువెళ్తా' అన్నాడు వెనుక సీటువైపు చూస్తూ.

కొంచెం సిగ్గనిపించినా మరోమాట మాట్లాడకుండా వెనుక సీటుపై కూర్చుని అతనికి తగలకుండా జాగ్రత్తగా కూర్చుంది.

దారిపొడవునా భయపడుతూనే వుంది ... యెవరన్నా చూస్తే యేమనుకుంటారు ...? ఛ! రాననంటే బాగుండిపోయేది...

నాలుగు మలుపులు తిరిగాక ఓ చిన్న యింటి ముందు ఆపాడతను. ముందు నాలుగు పెద్ద గోలేలలో నాలుగు క్రోటన్ మొక్కలున్నాయి

తలుపు తీసి 'రండి' అన్నాడు నవ్వుతూ.

చిన్న గది ... అక్కడే ఒక సోఫాసెట్టు వుంది ... దాని కామకాని రెండు గదులున్నాయి...

సోఫాలో కూర్చుని పైట చెంగుతో ముఖాన్ని అద్దుకుని అక్కడున్న డైలీపేపర్‌ను చేతిలోకి తీసుకుంది ... అతను వెళ్లి మరో క్షణంలో తిరిగి వచ్చి 'మా యిల్లు చూడరూ' అన్నాడు.

'ఎందుకులెండి అయినా చూశానుగా' అంది.

'బ్రహ్మచారి కొంపనేనా మీ భయం ?'

'అదికాదు...అలా అనుకుంటే వచ్చేదాన్నే కాదుగా' అంటూ లేచింది.

'రండి...ఇది నా రూం...బెడ్‌రూం అనుకున్నా స్టడీస్‌రూం అనుకున్నా అంతాయిదే...

'ఒకపక్క ఫోంబెడ్‌తో మంచమూ, మరో పక్క పుస్తకాల బీరువా, అక్కడే ఓటేబుల్, రెండు కుర్చీలూ...టేబిల్ పైన ఫ్లవర్‌వాజూ, టెలీఫంకెన్‌వారి ట్రాన్సిస్టరూ... బీరువాకూ మంచానికీ మధ్య ఎత్తుగా హేంగర్స్ తగుల్చుకునే ప్లాస్టిక్‌తాడూ.'

'కూర్చోరూ' అన్నాడు కుర్చీ చూపుతూ.

'మీరూ కూర్చోండి'అంది కూర్చుంటూ.

'యేకాంత వాతావరణంలోని కొచ్చారుగా యేమన్నా కొత్తవి రాశారా' అంది పుస్తకాల బీరువావంక చూస్తూ.

నవ్వి 'మునపటిలా కాదుగా ... యిప్పుడు తలమ్మకున్న వాళ్లం ... బొత్తిగా ఖాళీ వుండటంలేదు. బాగా వర్కుంటోంది ఆఫీసులో. అందుకే మీరొచ్చారని తెల్సినా యిన్నాళ్ళా కల్సుకోలేకపోయాను...' అని 'మీ అమ్మగారు పోవడం నిజంగా మీకు షాకే' అన్నాడు తక్కువస్వాయిలో.

ఒక్కక్షణం ఆగి 'యీ క్వార్టర్స్‌తోపాటు ఫర్నిచరూ వాళ్ళిచ్చిందేనా' అడిగింది.

'నా సామాను గురించి మీకు తెలిందే ముంది ... కొంత వారిది ... పొజిషన్‌కు తగట్టూ వుండాలని కొన్ని నేను కొనకతప్ప లేదు' అన్నాడు నవ్వుతూ.

ఎవరో వస్తున్నట్టు అలికిడై తలెత్తి బెరుగ్గా చూసిందామె... పనివాడు కాబోలు బిస్కెట్లూ, కాఫీ తెచ్చి టేబిల్ మీద పెట్టాడు...

అతను వెళ్లాక 'పనివాడా' అండి...

జరిగిన కథ : 6 వర్ధని తండ్రి రంగారావు బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తుంటాడు. చదువుకుని ఉద్యోగంచేసి కుటుంబాన్ని ఆదుకోవా లనే వుద్దేశ్యంతో తల్లి మాణిక్యమ్మని, స్నేహితుల్ని అందర్ని వదిలి విశాఖపట్నం వచ్చిన వర్ధనికి, రాజశేఖరం మామయ్య ప్రోత్సాహం లభిస్తుంది. వర్ధని అన్న ప్రసాద్ చిరుద్యోగి. వర్ధనితో మెట్రిక్ కట్టించాలని నిశ్చయిస్తారు రాజశేఖరంగారు. స్నేహితుడు రజనీకాంత్‌ని వర్ధనికి పరిచయం చేస్తాడు ప్రసాద్. వర్ధని మెట్రిక్ పాసవుతుంది. మాణిక్యమ్మగారు మరణిస్తారు. ప్రయివేట్‌గా ఇంటర్ చదువుతూంటుంది వర్ధని.

'అవును... యే అర్ధరాత్రో యిల్లు చేరే వాడిని నేను... అవసరానికుంటాడని పెట్టుకున్నాను... రామయ్యకూడ వంటరివాడు ... వెనక పెరట్లోనే ఓ గది యిచ్చాను... వుండమని... చాల మంచివాడులెండి' అని. 'కాఫీ తీసుకోమని బ్రతిమాలాలా ?' అన్నాడు.

నవ్వి కప్పును చేతిలోకి తీసుకుని 'ఇప్పుడెందుకండీ యీ యేర్పాట్లన్నీ!' అంది.

'ఈమాత్రం కూడ శ్రమ పడకూడదా మీ గురించి... నేను మంచాన పడినపుడు మీ చేత అన్ని సేవలూ చేయించుకోలేదా మరి !' అతనంటూ వుంటే సిగ్గుపడి తలొంచుకుని 'అప్పుడు వేరు' అంది.

'అంటే యిప్పుడు మీకు నేను పరాయి వాణ్ణా...'

తలెత్తి చూసి 'నేనలా అనలేదు' అంది... ఆ చూపులో ఆప్యాయత, కరుణ, జాలి, ఆభిమానం అన్నీ సమపాళ్ళలో వున్నాయా అన్పించిందతనికి ... అమాయకంగా ముగ్ధగా అతనికంటికామె పూర్వం కంటె నిండుగా ఆకర్షణీయంగా కన్పించింది. ఏప్పుడో మనసులో జొరబడిన వింతకోరిక నరనరాలనూ స్పందింపజేస్తూంది.

'వర్ధనీ...నన్ను చూస్తుంటే మీకేమని పిస్తూంది ?'

అతనిమాటలు, అతనికళ్ళలో నింపుకున్న కోర్కెలూ, ఆమెకు సంపూర్ణ అర్థాన్ని తెలియజేశాయి. అందమైనముఖం...పొడుగా

కొనదేలిన ముక్కు ... పెదాలమీద సన్నగా పరుచుకున్న మీసకట్టు, లేతాకుపచ్చగా మెరిసే గెడ్డం...నుదుటిమీద రెండంగుళాలు లోనికి జొరబడి అక్కడనుండి దిక్కుతోచక చిత్తరగా వుంగరాల జుట్టువైపు చూస్తూ నిలిచి పోయిన పాపిడీ ఒక్కక్షణంచూసి 'మీకేం ... అదృష్టవంతులు' అంది.

'అంతేనా నా గురించి మీకనిపించేది ?' జాలీగా చూశాడతను...అందులోని భావాన్ని అర్ధం చేసుకుని మౌనంగా వూరుకుంది ...

'ఇన్ని వున్నా నా జీవితంలో యేర్పడిన లోటు లోటుగానే వుండిపోతుందేమోనని భయంగా వుంది...' అతని మాటలకి తలెత్తి ఆశ్చర్యంగా అతనివంక చూసింది.

'అవును వర్ధనీ...ఎటువంటి ఆత్మీయతలకూ, ప్రేమాదరణలకూ నోచుకోకుండానే యింతవరకూ పెరిగాను...నన్ను నన్నుగా చూసేవ్యక్తి, నన్ను ప్రేమాభిమానాలతో ముంచెత్తేవ్యక్తి నేను కావాలని కోరుకోడం తప్పులేదనుకుంటాను'

'వర్ధనీ మీరు నాకు కావాలి'...పుద్వేగంగా వచ్చిన అతనిమాటకు తలెత్తి ఆశ్చర్యంగా సూటిగా అతని కళ్ళలోకి చూసింది...ఏదో తెలియని భయం మనసుచుట్టూ ఆవరించుకున్నట్లయ్యింది...ఇన్నాళ్ళూ అతను యిష్టం చూపుతున్నది యిందుకేనా ? పరిస్థితుల పాలెగూళ్ళో చిక్కుకుపోయిన తనెక్కడ ? అతనెక్కడ ?

'చూడండి వర్ధనీ ... నా గతం చాల భయంకరంగా గడచిపోయింది. అందుకే నేను ఎవ్వరిగతాన్నీ తిప్పి చూడదల్చుకోలేదు ... మీ పరిచయం నా జీవితాన్ని నందనవనంగా మారుస్తుందని విశ్వసించాను... నా నిర్ణయం సరియైందవునో కాదో మీరే చెప్పాలి' అన్నాడతను.

'మీరు కొంచెం ఆలోచించాలేమో...' అందామె... 'ఇంతకంటె నే నాలోచించేదేం లేదు వర్ధనీ.. ఆలోచించవలసిందంతా మీరే.. నావల్ల మీరు సుఖపడగలరా అన్నది మీరే ఆలోచించుకోవాలి'

'నేనొక్కతెనే అనుకుంటే సరిపోతుందా?' తనమాటలకు తనే ఆశ్చర్యపోయింది..అంటే? తను యిష్టపడుతున్నట్లేగా ? లేక అందం, ఐశ్వర్యంచూసి భ్రమసిపోతూందా ? కాదు— అతనిలో మంచితనాన్ని చూసింది... కళాత్మక

రాగవీచికలు

హృదయాన్ని మెచ్చుకుంది .. అభిరుచులకు ఆనందించింది... ఇక జీవితాంతం అతనితో ముడిపడిపోతే మట్టుకు యేం..

సిగ్గుతో బుగ్గలు కెంపులవగా తలొంచుకుంది.

ఆనాటినుండి వర్ధని మనసులో ఓ కొత్త ఆనందం చోటు సంపాదించుకుంది ... ఇన్నాళ్ళ తనకు కాబోయే జీవితభాగస్వామి కొరకు కలలుకనలేదా అమ్మాయి ... కానీ ఆ రోజునుంచే ఆమెలో కలలు మొదలయ్యాయి.. కానీ ఆ విషయాన్ని ఎవరిముందూ సాహసించి వ్యక్తం చేయలేకపోయింది ... యేమో

పుచ్చకాయ గింజల పోటీ

పుచ్చకాయ గింజల్ని నోటితో ఎవరు ఎక్కువదూరం విసిరేయగలరు అన్న పోటీలు తరచుగా ప్రపంచంలో ఏదో మూల జరుగుతూనే వుంటాయి. జోసెఫ్ మెక్ కెల్లర్ (అమెరికా) పాత ప్రపంచ రికార్డును అధిగమించడానికి ప్రయత్నించాడట ఈమధ్య ఈయన నోటితో విసిరిన గింజ 11.06 మీటర్ల దూరం వెళ్ళి పడింది. కాని పాపం యిది ప్రపంచ రికార్డు కాదట.

మరి ఎవరి అభిప్రాయ మెలా వుంటుందో ? అందరినీ ఒప్పించి ఈ పెళ్లి చేసుకునే చొరవ, ధైర్యం తన కున్నాయా ? లేనప్పుడు తొందరపడి మాటెందుకిచ్చినట్టు. పూర్వాచారాలను పట్టుకువేలాడే తాతయ్య ముఖ్యంగా అంగీకరించవద్దూ ? ఒకటి రెండు సార్లు అన్నయ్యతో యీ విషయం చెబుదామని ప్రయత్నించి కూడ చెప్పలేకపోయింది.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆనందరావు ముఖంలో మళ్లీ సంతోష రేఖలు చోటు చేసుకున్నాయి. అతనిలో మార్పుకు చాల వరకూ కారణం రాణే అని వర్ధని గ్రహించక పోలేదు. రాణి వచ్చినప్పుడల్లా వర్ధని కంటే ఎక్కువగా అతనే మాట్లాడేవాడు. రాణి కూడ వీలు చిక్కినప్పుడల్లా వచ్చేది... ఒక రోజు ఆమె వచ్చి చాలాసేపైనా ఆనందరావు కన్పించకపోయేసరికి సిగ్గుపడకుండానే 'ఆనందరావుగారు ఇంట్లో లేరా' అంది.

విషయం అప్పటికే గ్రహించిన వర్ధని 'యేం, నేను పనికిరానా మాట్లాడ్డానికి' అంది.

'ఛీ...పో...పిచ్చిపిల్లా! నీకేం తెలీదు' అంటూ సిగ్గుపడ్డ రాణిని చూసి నవ్వుతూ 'నువ్వేందు కడుగుతున్నావో నాకు తెల్సులే... నువ్వు చెప్పక పోతే నా కెవరూ చెప్పరనుకున్నావేమిటి' అంది

వర్ధని మాటలకు కళ్లింతలు చేసుకుని 'నిజంగా ఆయన చెప్పారా ఆ మాట' అంది.

'యే మాట?'

'చూశావా ? నాదగ్గర్నుండి రాబట్టాలనా ?'

'యేం కూడదా ?'

'కూడదనికాదు ..ఆయన చెప్పేరేమోనని' అంది కుతూహలంగా.

'ఐసీ... ఆయన చెప్పాలన్నమాటింకా ఐతే యిదంతా ఒక్క అమ్మాయిగారి అభిప్రాయమే అన్నమాట' అంది చిలిపిగా


'యేమో వర్ధనీ నీకు నిజం చెప్పేస్తున్నా' ఆయన మాటలకు ఆ అమాయకత్వానికి ఆకర్షింపబడ్డాను; యింతకీ నా అదృష్ట మెలా వుందో ?' అని రాణి అమాయకంగా అంటూంటే

'నీకేం భయం లేదోయ్ ... ఆ విషయం నా కొదిలేయ్ ... మా గురువుగారి మనసులోని విషయం నాకు చెప్పకుండా వుండరు' అంటూ ఆమెకు ధైర్యం చెప్పింది వర్ధని.

* * *

రాణికి మాటంటే యిచ్చేసిందిగాని ఆనందరావుని ఎలా అడగాలో తెలియక తికమకపడుతోంది వర్ధని. పోనీ తనతో సరదాగా వుంటాడన్నా అదీలేదు... పూర్వం కంటె కొద్దిగా నయం తప్పితే మనిషి పూర్తిగా కోలుకోలేదు. సుందరి గూర్చిన జ్ఞాపకాలు అతనిలోంచి పూర్తిగా తొలిగి పోయాయనడానికి కూడ సందేహమే... ఆ పరిస్థితుల్లో మళ్లీ మరో సమస్యలో అతన్ని యిరికిస్తున్నానా అనిపించింది వర్ధనికి.. ఎందుకేనా మంచిదని రాణిని తరచు యింటికి రప్పించేది... ఇలా రోజులు గడుస్తున్నకొద్దీ పరిస్థితి మరింత విషమ









రాగ వీచికలు

సమస్యలా తయారయ్యేలా వుందేగాని కొరుకుడు పడటం లేదు సుందరి విషయం రాణికి చెబితే యేమౌతుందనో ఒకవంక భయం... చెప్పకపోతే అసలుపరిస్థితి ఆమెకు తెలియదు. ఇలా యిరకాటంలో పడిపోయింది వర్ధని.

అప్పుడప్పుడూ తనూ రాణి దగ్గరకు వెళ్లేది... అక్కడదాకా వెళ్లినపుడు ఆమె కాళ్లు తప్పనిసరిగా మరోదగ్గరకు తీసుకు పోయేవి... యే ఒకటిరెండు సార్లో తప్ప ఎప్పుడూ యింట్లో వుండేవాడు కాదు రజనీకాంత్... అతను లేకపోయినా ఆదరించి కూర్చోమని కాఫీకలిపి యిచ్చేవాడు రామయ్య. ఒక్కొక్కప్పుడు రామయ్యే అనేవాడు...'యేమిటో అమ్మగారూ... బాబుగారికి మంచి వుద్యోగ ముందే తప్పితే ఎనకాముందూ ఎవరూ లేక పోడాన్ని యిల్లంతా ఎప్పుడూ బోసిగా వుంటాది ఆడదిలేని యింటికి కళేటుంటాది చెప్పండి' అతనలా అంటుంటే 'మీ అయ్య గార్ని త్వరగా పెళ్లిచేసుకోమనలేక పోయావా' అనేది

'యేటోనమ్మా నేననడమేగాని ఆయనేం మాటాడరు' అనేవాడు.

ఒకరోజు ఆ సంగతే రజనీకాంత్‌తో అంటే 'అయితే యింటి విషయాలన్నీ మీకు చెప్తే స్తున్నాడన్నమాట... మీరేమన్నారు' అన్నాడు.

'యేమంటాను మీ అయ్యగార్ని పెళ్లి చేసేసుకోమను అన్నాను' అంది.

'దానికేమన్నాడుట.'

'యేమంటాడూ... వూఁ అంటే క్యూలో కోటిమందిని నిలబెట్టేస్తానంటాడు.'

'అయినా... ఆ క్యూలో మొదట్లో మిమ్మల్ని నిలబెడతానని వుండాలే' నవ్వాడతను.

'అయితే నన్నింకా క్యూలోనే వుండమనా అర్థం?' బుంగమూతి పెట్టింది వర్ధని.

'సారీ బాస్... మీతో యేమన్నా యిబ్బందే యిప్పుడు వూఁ అనండి... గుళ్లో మూడు ముళ్లూ వేసేస్తాను'

'యింకా ఆ గౌరవసంబోధన పోలేదన్న మాట—అది పోనంతవరకూ దూరంగా వుండాలనేగా అర్థం—యింతకీ అబ్బాయిగారికీ దైవ భక్తి ఎప్పట్నించి?'

'యేదీ' అంటూ చుట్టూ చూశాడు రజనీకాంత్.

'గుళ్ళో పెళ్ళంటున్నారు... అదీ...'

'ఓ అదా ... మీలాంటివాళ్లు ... సారీ నీలాంటివాళ్లు రిజిష్టరు మేరేజికి ఒప్పు కోరుగా అందుకని...'

యిద్దరూ నవ్వుకున్నారు.

వచ్చేటప్పుడు 'టేబిల్ మీదనున్న కొత్త నవల చేతిలోకి తీసికొని చూసి 'చదివి... తేవచ్చా' అంటూ అతనివంక చూసింది.

'ఓ నిరభ్యంతరంగా ... కాని చదివి పూర్తయ్యాకే లాభంలేదు...అభిప్రాయం చెప్పాలి' అన్నాడు.

'అలాగే' అంటూ వచ్చేసింది.

*　　*　　*

ఆరోజు ఆదివారం.

ముందురోజు రాత్రి డ్యూటీచేసి తెల్లా రాకవచ్చి కాఫీ టిఫిన్ కానిచ్చి మేడమీద పడు కున్నారు రాజశేఖరంగారు ... వంటపనంతా తొందరగానే ముగించుకుని మేడమీదకు వెళ్ళి పోయింది విమల. ఆనందరావు మాత్రం ఎక్కడికీ వెళ్ళకుండా గదిలోనే చదువుకుంటు న్నాడు...ఆ యేటితోనే పరీక్షలై పోతాయత నికి. టెక్నాలజీలో డిగ్రీ సంపాదించి తర్వాత యేం చెయ్యాలో అలోచించలేకపోతున్నా డతను ... యంటెక్ అవ్వాలంటే మరో రెండేళ్ళు...డిస్టింక్షన్‌లో పాసైతే యేమైనా వుంది...అదృష్టం బాగుంటే ఆంధ్రాలో కాకపోయినా ఎక్కడేనా వుద్యోగం రావచ్చు వస్తేనే కొంతనయం అనుకుంటున్నాడు...

తలుపు చప్పుడైతే తలెత్తి చూశాడు ఆనందరావు...నెమ్మదిగా లోపలికి వచ్చింది వర్ధని...ఇటువంటి అవకాశం కోసమే ఆమె ఎదురు చూస్తోంది... రాణికిచ్చిన మాటను నిలిబెట్టుకోవాలి...కేవలం అడగటమేకాదు.: వారిద్దరినీ కలపాలి... ఇటు సుందరివల్ల ఘోరంగా మోసగింపబడ్డ ఆనందరావు జీవితంలోకి వెలుగురేఖలు రావాలంటే అత నంటే యిష్టపడే రాణి అతని దవ్వాలి...

'ఆదివారంగదా ఎక్కడికీ వెళ్ళలేదా' అంది ఏం మాట్లాడాలో తెలియక.

'ఎక్కడికి వెళ్ళాలి' ఎదురు ప్రశ్న వేశా డతను.

'మళ్ళీ మీ వాళ్ళు పిక్నిక్ ప్రోగ్రాం వెయ్యలేదేం'

'ఏం నీకు మళ్ళీ వెళ్ళాలనుందా'

'నాకు కాదు రాణి సరదా పడుతోంది... పిక్నిక్‌లన్నా, పార్టీలన్నా ఆమెకు తగని యిష్టం...పాపం వంటరిది ... ఎవరు పిలు స్తారు...'

'ఒకరిమీదొకరు అలా జాలి పడకపోతే వెళ్ళలేకపోయారూ...'

'మేమిద్దరమూనా...అయినా మీతో రావా లని కదా అడిగిందీ.'

'నేను మానేశాను వర్ధనీ...ఆ సరదాలన్నీ ఎప్పుడోమానేసుకున్నాను' అన్నాడు తలొంచు కుని.

ఆ మాటల్లోని బాధనామె గ్రహించక పోలేదు...'ఒకరి గురించి మనం ఎన్నాళ్ళు మానుకుంటాం' వర్ధని మాటలకతను ఆశ్చ ర్యంగా చూశాడు.

'మానుకోక ? ... నా జీవితంలో చిగు రించే ప్రతీ కోర్కెనీ ఆదిలోనే త్రుంచేసిందా రాక్షసి''

అతనిమాట పూర్తి కాకుండానే అందు కుంది వర్ధని... 'అవన్నీ గుర్తుచేసి మిమ్మల్ని బాధపెట్టాలని నా వుద్దేశం కాదు ... కానీ ఒక్కమాట సూటిగా అడుగుతా మరోలా అనుకోకపోతే' అని తలొంచు కుంది.

ఆమెవంక ఆశ్చర్యంగా యేమిటన్నట్టు చూశాడతను.

'మీ జీవితానికి తిరిగి చిగురించే అవకాశ మెందుకివ్వకూడదు ?'

'వర్ధనీ! యేమిటి నువ్వంటున్నది... ?' ఆవేశంగానే అన్నాడతను.

'అవును...రాణి మిమ్మల్ని యిష్టపడు తోంది..మీరంటే ఆమెకు అంతులేని ప్రేమ.. అభిమానమూనూ ... తను మీ చుట్టూ అల్లుకున్న కలలను కల్లలు చేయరనే అమా యకతతో ఎదురు చూసింది'

అతను తలొంచుకున్నాడు.

ఒక్కక్షణం ఎవ్వరూ మాట్లాడలేదు.

'ఇంతకీ రాణి గురించి నీ అభిప్రాయ మేమిటో తెల్సుకోవచ్చా'

'ఆమెకేం...తెలివైనదీ...చురుకైనదీనూ ...బాగా పాడగలదు.'

'అంతేనా ఆమె పరిచయంలో మీరు తెల్సు కున్నది' ఆమె కళ్లలోకి సూటిగా చూడలేక తలొంచుకుని 'ఆమెలో అటువంటి అభిప్రాయం కలగడానికి నేను కారణమా' అడిగాడు.

వర్ధని నవ్వింది...నవ్వి 'రాణి అమాయ కపు పిల్ల...ఒక రకంగా దురదృష్టవంతు రాలు కూడ ... చిన్నప్పుడే తల్లినీ తండ్రినీ పోగొట్టుకుంది ... తాతగారి సంరక్షణలో పెరిగి కొంతవరకూ చదువుకుంది ... పై చదువులు చదివే తెలివీ, ఆసక్తీ వున్నా



పరిస్థితులకెదురీదలేకపోయింది...మీ మాటలకు మీరు చూపిన ప్రోత్సాహానికీ ఆమె మీపై ప్రేమాభిమానాలను పెంచుకుంది'

'నిజమే ... ఆమెపై నాకూ సానుభూతి వుంది...కానీ ...' అతనివంక ఆశ్చర్యంగా

రా గ వీ చి క లు

చూసిందామె...అతను తగ్గి 'ఎన్నాలోచించు కోనీ వర్ధనీ' అన్నాడు.

అదే చాలనుకుని వచ్చేసింది వర్ధని. తను చేపట్టిన కార్యం సఫలమైతే రెండు జీవితాల్ని కలిపిన ఖ్యాతి దక్కుతుంది. కాని యేమాత్రం జారినా రెండు నిండు జీవితాలలో విషబిందువులు చిలికినట్లే అవుతుంది.

(ఇంకా వుంది)

డాక్టర్ సలహాలు

— డా॥ కె. వెంకటేశ్వరరావు

యస్. యస్. యస్. రాజమండ్రి

నా వయస్సు 19 సం. లు. నాకు చిన్నప్పటి నుండి బస్సులు ఎక్కితే వాంతులవుతాయి. పెద్దయితే పోతాయని అశ్రద్ధ చేశాను. కాని తగ్గలేదు. అది తగ్గాలంటే ఏమి చేయాలి?

బస్సు ప్రయాణాలలో వికారం, వాంతులు అవటం, చెవులలోపలి భాగంలోని ఎండోలింవ్" ద్రవం బస్సు కుదుపుకి, (ప్రదక్షిణానికి తిరగటం) అనుగుణంగా కదలటం, తద్వారా, చెవుల అంతర్భాగంలోని చిన్న ఎముకలు కూడా కదలి, మెదడుకి వెళ్ళే నరములకు— అందవేయటం, ఈ నరాలు, తమ శాఖల ద్వారా మెదడులోని, వాంతులు కలిగించే విభాగానికి 'వార్త' అందివ్వటం వెనువెంటనే అక్కడి నుంచి, వాంతి అవ్వాలనే అధికార సూచన 'కడుపు' (జీర్ణకోశానికి) లోనివిభాగాలకు వెళ్లటం— చివరికి వాంతులవటం జరుగుతుంది. క్రమేపీ అలవాటుపడవలసిందే గాని ప్రత్యేకించి, వైద్యం, ఈ లక్షణం కలవారికి అనవసరం.

కె. యస్. — తెనాలి

నా కాలికి ఫైలేరియా వచ్చి మూడు సం. లు అయినది. ఒక సంవత్సరము వరకూ మాకు తెలియలేదు. అప్పుడు నొప్పిగాని, జ్వరము గాని లేవు. వాపు మాత్రము ఉండేది. నొప్పి, జ్వరము మొదలు పెట్టాకనే మందులు వాడాము. తగ్గలేదు.

ఫైలేరియా వల్ల కాలు వాచి ఉంటే, మీకు 3 సం. ల క్రితమే ప్రస్తుతం వచ్చిన లక్షణాలు కనబడి ఉండాలి.

అంతక్రితమో, లేక ఆ సమయంలో తీవ్రంగ నిర్ణీత వ్యవధి వరకు మందులు వాడితే అసలు వాపే రాకపోవును.

ఒకసారి వచ్చిన తరువాత తిరిగి మామూలు పరిస్థితికి కాలు వస్తుందనుకోవటం పొరపాటు. ఇంతకుమించి పెరగకుండా ఉండడాన్ని మాత్రమే అరికట్టగలరు— ఎంత నిపుణులైన వైద్యులైనా. కాబట్టి, కాలు వాపుకి బాధపడటం మాని, మిగతా చర్యలు మీ వైద్యుల సహాయంతో తీసుకోవటం మంచిది.

ఎ. పి. ఆర్ — కడిచర్ల

నా వయస్సు 23 సం.లు నాకు తెలిసినప్పటి నుండి ఎడమ వృషణము పై భాగములో బాగావుబ్బిన కొవ్వువంటి పదార్థము బీజముపై భాగమున అనగా పొత్తి కడుపు నుండి జారిన కండమాదిరిగాయుండి, బరువు ఎత్తినపుడుగాని, దగ్గినపుడుగాని బాధ కల్గుతోంది. ఈ మధ్య కుడి వృషణము క్రిందికి జారినది.

పై లక్షణాలు 'హెర్నియా' అనే రోగాన్ని తెలియజేస్తాయి. ప్రతి మగవారికీ పుట్టుక నుంచే ఒక కాలువలాగా పొత్తికడుపు అడుగుభాగంలో అంటే గజ్జలపైన ఏర్పడి ఉంటుంది. ఈ కాలువ ద్వారం గాని, మార్గంగాని, కండరాల పటుత్వం తగ్గటం వల్ల, పెద్దవయితే, వీటిద్వారా ప్రేవులు క్రిందికి జారటం జరుగుతుంది. కడుపులోని పీడనశక్తి ఉదాహరణకు దగ్గు, మలబద్ధంవల్ల ఎక్కువయితే ఇలా ప్రేగులు జారటానికి వీలవుతుంది. ఈ కాలువ ఉండటంవల్ల వృషణాలు వాచాయనుకోవడం సహజమే! ప్రారంభదశలో బెల్టు మొదలయిన చాలా కాలంగా ఎక్కువగా, రెండు వైపుల ఉంటే శస్త్ర చికిత్స చేయించుకోవాలి..

పి. యస్ — బళ్ళారి

నా వయస్సు 21సం.లు 2సం ల నుండి ఆకలలు సపుడు కొంచెముగూడాతినలేకపోతున్నాను. 'ఒత్తిడి'గా (బలవంతంగా) తింటే వెంటనే వాంతి చేసుకోవలసి వస్తోంది.

'కడుపు' అనే జీర్ణకోశంలో కురుపులు లేక పుండ్లు (అల్సర్) ఏర్పడిన తర్వాత, ఆ చోట్లలో ఏర్పడే మార్పులవల్ల, అహారం పయనించే త్రోవలో మార్గావరోధంఏర్పడటంవల్ల, అహారంసరిగా, క్రిందికి బాగాపోదు. కడుపు ఉబ్బరంగా ఉంటుంది. వాంతులు వస్తాయి.

అదే సమయంలో "కడుపులో" ఉదజని హామ్లం యొక్క పరిమాణం ఎక్కువయి, మంట లేక చాతీ క్రింది భాగంలోనొప్పి రావటం సహజం.

ఇలా ఉన్నవారికి, ఈ 'మంట'వల్ల ఆకలి వేసినా, కడుపుపైన చెప్పిన కారణంగా ఖాళీ అవక పోవటం వల్ల, ఆహారం తీసుకోవటం కష్టమవుతుంది. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి మందులు, మాత్రలు ఎక్కువగా పని చేయవు. శస్త్రచికిత్స శ్రేయస్కరం.

సి. ఆర్ బి. — పెద్దపాడు

నాకు ఎడమచెవి విన్పించుటలేదు. మాకుటుంబములో చెవుడు ఉన్నది. దీనిని నివారించుటకు అవకాశము కలదా? కృత్రిమమైన మిషనుఅమర్చే ఉపాయము ఎక్కడ కందో తెలియజేయప్రార్థన.

చెవులు వంశపారం పర్యంగా వినిపించకపోవటం, సర్వసాధారణంగా కనబడుతున్నదే! అయినా, ఈ కుటుంబాలలోని వారందరూ తమకి చెవుడు వస్తుందని బాధపడటం, ఒకవేళ అలా వచ్చినా, బాగుపడదేమో అని నిరాశ పడటం అనవసరం. నివా

> రచనలు, వ్యాసాలు, బొమ్మలు, ప్రశ్నలు మొదలైనవన్నీ పంపవలసిన చిరునామా:
>
> సంపాదకుడు,
> **ఆంధ్ర సచిత్ర వారపత్రిక,**
> గాంధీనగరం, విజయవాడ-520003

రణ అనేది రోగాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది గాని, కుటుంబాన్ని అనుసరించికాదు. కృత్రిమ సాధనం అమర్చటానికి 'ఇ. ఎన్. టి.' వైద్యులు మీ వూరికి దగ్గరగా ఉన్న పెద్ద పట్టణం, లేక వూర్లలో ఉంటే వారు, మీకు తగిన విధంగా, చేరువలో దొరికే లేక అమర్చే విధానం తెలియజేస్తారు.

జె. ఆర్. కె. — హుజూర్‌నగర్

నాకు 21 సం.లు, కంటి రెప్పలకు పొక్కులు లేచి కనురెప్పలు కొట్టుకున్నపుడు గుచ్చుకుంటున్నాయి. ఏ మందు వాడవలెను

మీరు వ్రాసిన విధంగా ఇలా తరచూ వస్తూ ఉండటం మీ వ్యక్తిగత పరిశుభ్రత ఏ స్థాయిలో ఉందో తెలియ చేస్తున్నది.

ఇది చాలా ముఖ్య కారణమయినా మన శరీరానికి ప్రతినిత్యం అత్యవసరంగా కావలసిన విటమిన్లలోపం వలన, శరీరంలో ఇతర భాగాలలో చీము వంటివి చేరటంవలన, యిలా కనురెప్పలలో ఒకటిగా కాని,

డాక్టర్ సలహాలు

అంటకు మించిన సంఖ్యలో కాని కురుపులు రావటం జరుగుతుంది.

ఈ కురుపులకి, టెట్రామైసిన్, ఇది తరచుగా వాడబడి సరిగా పనిచేయనప్పుడు—టెట్రాకార్టిన్ ఆయింట్‌మెంట్లు కనులలో పైపూతగా వాడాలి. దీనితో బాటుగా మల్టీవిటమిన్ మాత్రలు, సిట్రవైట్ మాత్రలు రోజుకి రెండు వంతున కొంత కాలంపాటు వాడుతూ రావటం, క్రమేపీ— ఈ విటమినుల దృష్ట్యా ఆహారంలోనే అవి లభ్యమయ్యేటట్లు చూసుకోవటం చాలా అవసరం.

యస్. కె. — వరంగల్

నా వయస్సు 20 సం.లు. నాకు మూడు సంవత్సరముల నుండి తల నెరియుచున్నది. తెల్లవి పీకేసినా మళ్లీ నల్లని వెంట్రుకలు తెల్లబడుచున్నవి. దీనికి కారణమేమిటి ? నివారణోపాయము తెల్పండి.

వెంట్రుకలు నెరసిపోవటం అనే విషయానికి, ఎంతో ఆందోళన వ్యక్త పరుస్తూ ఇంతవరకు కొన్ని వందల ఉత్తరాలు వచ్చాయి. ఇలాగని ఎందుకు వ్రాశానంటే— ఈ బాధ మీ కొక్కరికే పరిమితంకాదని మీ వయస్సుకన్నా తక్కువ వయస్సు వారిలోనే ఈ లక్షణాలు తరచుగా కనబడుతున్నదని చెప్పటానికే. అంత మాత్రాన మీ బాధను తోసిపుచ్చటం లేదు.

వంశ పారంపర్యంగాను, కొందరికి కొన్నిరకాల తల నూనెలు వాడటంవల్ల కొందరికి ఆహార పదార్థాలలో నుంచి తగినన్ని, తగినంత అమైనోయాసిడ్‌లు వెంట్రుకల కుదుళ్లకు చేరక పోవటం, వీటిద్వారా 'మెలనోసైట్స్'' అనే రంగు పదార్థం (పిగ్‌మెంట్) తయారుచేసే జీవాణువులు (సెల్స్) ఉత్పత్తి సరిగా చేయక పోవటం ఇలా తలనెరసి పోవటానికి కొన్ని ముఖ్య కారణాలు, ఇంగాకుండా చర్మంలో ఏర్పడగల తెల్లని మచ్చలు ఉన్న వారికి ఈ లక్షణం కూడా వెంటనే ఉంటుంది.

అన్ని ఆఫీసుల లాంటిదే ఆ ఆఫీసుకూడా. అందరు గుమాస్తాల లాంటివాడే గుర్నాథం కూడా. అతడో గంతలుకట్టిన గానుగెద్దు.



రాళ్ళు వాప్పుకోవ

బావి.

ముళపే సరోజినీదేవి

అసలు ఆ మాటకొస్తే గుమాస్తా జీవితమే గానుగెద్దు జీవితం. ప్రొద్దున లేచింది మొదలు యింట్లో కావలసిన సరుకులు తేవటం. యంత్రంలా గోడమీద దిమ్మరించినట్లు నాలుగు చెంబులు నీళ్ళు నెత్తిమీద గుమ్మరించుకోవటం, నాలుగు మెతుకులు–ఉడికినవో, వుడకనివో–కలిగినదానితో కడుపు నింపుకోవటం.

ఆదరా బాదరాగా మాసిపోయిన బట్టల్నే. చినుగులు పట్టిన వాటినే మాగినకంపు కొడుతున్నవాటినే ఒంటికి గంగిరెద్దుకు తగిలించినట్లు తగిలించటం,డొక్కు సైకిలు తీసుకొని ఊపిరాడని ట్రాఫిక్‌లోనుంచి ప్రాణాలుగ్గబట్టుకొని వీలయినంతస్పీడుతో. శక్తికిమించి త్రొక్కి ఆయాసపడిపోయి, ఆఫీసు ఆవరణలో కాలుమోపటం.

అప్పటినుంచి కుర్చీకి అతుక్కుపోయి కదలక మెదలక ఫైళ్ళలో తలదూర్చి. అర్జెంటు, వెరీ అర్జెంటు ఫైళ్ళతో కుస్తీ పట్టటం!

లంచిటైము కాగానే బ్రతుకు జీవుడా అంటూ కట్టెల్లా బిగుసుకుపోయిన కాళ్ళని సాగదీసి బుజ్జగించి కాంటీనుకుపోయి కప్పు కాఫీ నీళ్ళతో కడుపుని మోసపుచ్చి, నిద్రపుచ్చి జిహ్వా చాపల్యాన్ని తీర్చటానికో సిగరెట్టు ముట్టించి నయాపైసా వక్కపలుకు నోట్లో వేసుకొని లంచిటైము ముగించి మళ్ళీ ఫైళ్ళతో కుస్తీకి తలపడటం ? ఐదు కొట్టేదాకా చచ్చీ చెడీ సున్నమైవ్రాసిన డ్రాఫ్ట్సుల్నే సరిదిద్దుకుంటూ, హెడ్ గుమాస్తాగారి దీవన్లు అందిపుచ్చుకొని నవ్వుని ముఖాన అతికించుకొని బ్రతుకును సుడిగుండంలోంచి తప్పిస్తూ దినగండంగా గడిపే గుర్నాథానికి నెత్తిన పిడుగుపడింది.

నిజంగా నెత్తిన పిడుగు పడితే అంతగా విచారించేవాడు కాదేమో! ఎందుకంటే ఆ పిడుగు అతని పిచ్చుకలాంటి ప్రాణాన్నిపిడికిట బిగించి పారిపోయేది. ఇది చిత్రహింసలపాలు చేసే పిడుగు. నరనరాన్నీ చీల్చి, కండకండనూ పెకలించి, రక్తం చిమ్మించేది.

గుర్నాథం భార్యకు ముద్దుల చెల్లెలుంది. ఆవిడగారి పెళ్ళిట. అర్జంటుగా వెళ్ళాలిట. వెళ్ళటానికి కొంతడబ్బు. పెళ్ళిలో చదివించటానికి మరికొంతడబ్బు. పెళ్ళిలో కట్టుకుందుకు తగినబట్టలు కొనటానికి కొంత డబ్బు.

ఇలా అనేక పద్దుల క్రింద పెద్ద మొత్తమే కావలసి వచ్చింది. సన్యాసీ, సన్యాసీరాచుకుంటే బూడిదేకదా రాలేది!

చేసేదిలేక లోనుకు అప్లైచేశాడు. అప్లైఅయితే చేశాడు. అది అతగాడి చేతిలో పనికదా! గ్రాంటు కావాలి కదా! అదో పెద్ద యజ్ఞం. ఈ కాలంలో యజ్ఞాలెవ్వరూ చెయ్యటం లేదు కానీ బ్రతుకే ఓ పెద్ద యజ్ఞం అయిపోయింది. అందులో దైనందిన అవసరాలకి సరిపడినడబ్బును కూర్చుకోవటం పెద్ద యజ్ఞం. ప్రతి దానికీ ఒక యజ్ఞం యాగం చెయ్యందే అది సమకూరదు కదా చెక్కర పుట్టించటం, బియ్యం కొనగలగటం, బట్టలు కట్టుకోవటం–ఇవన్నీ నిత్యావసరాలే మరి! అయితేనేం! వాటిని సమకూర్చటం–ఓ పెద్ద యజ్ఞం.

* * *

"అయ్యా గుర్నాథంగారూ, తమని లోను క్లర్కుగారు రమ్మంటున్నారు" అంటూ ప్యూను వచ్చేడు.

"ఎందుకూ ? –" అంటూ గుర్నాథం లేచేడు. గుర్నాంథం గుండెలు గుబ గుబలాడుతూనే వున్నాయి. ఎడమకన్ను అదురుతోంది. కాళ్లు వణుకుతున్నాయి. ఎవరో క్లర్కు తుమ్మేడు.

" 'ఛీ' అపశకునం " అనుకున్నాడు మనస్సులో. కాసేపాగి వెడదాం అనుకున్నాడు.

కానీ ఎదురుగా యమభటుడులా ప్యూను నిలబడే వున్నాడు.

తప్పక లేచేడు. కాళ్ళీడుస్తూ వెళ్లాడు.

"ఏమిటిసార్" అంటూ వినయం వొలకబోసేడు. చేతులు నలుపుకున్నాడు. బుర్ర గోక్కున్నాడు. కాలరు సరిచేసుకున్నాడు. ప్యాంటు పైకి లాక్కున్నాడు. అతగాడు ఏ పిడుగు లాంటి వార్త చెవిని వేస్తాడోనని ఎదురుచూస్తూ ప్యాంటు జేబుల్లో చేతులు దూర్చేడు.

"ఈ అప్లికేషను చెల్లదు సార్" క్లర్కు కిసుక్కున నవ్వేడు. నవ్వటానికి కారణమేమిటో గుర్నాథం బుర్రకి ఎంత ఆలోచించినా తట్టలేదు. సమయమూ సందర్భమూ లేకుండా నవ్వెలా వస్తుంది ? ఏమోమరి !

"ఎందుకుసార్ ?" గుర్నాథం గుటకలు మింగేడు.



"ఎందుకా? ఇదివరకే రెండు లోన్లు పుచ్చుకున్నారు కదా" అంటూ వివరించేడు క్లర్కు.

"చిత్తం ఇది మూడవదని నేను మనవి చేసుకున్నానే" అన్నాడు గుర్నాథం తన అపరాధమేమిటో అర్థంకాక!

రతనాల గులాబి పువ్వు

మాస్కో, (ఎ. పి. ఎన్.) క్రెమ్లిన్ భవనంలోని రత్న సంపద మరో కొత్త ప్రదర్శన వస్తువుతో... రత్నాలతో చేయబడిన గులాబి పువ్వుతో – మరింత సంపన్నం అయింది. దానిని యిద్దరు అగసాలులు విక్టర్ నికొలియేవ్, గెన్నడి అలెగ్జాఖిన్ తయారుచేశారు. ఏ మాత్రం గాలి వీచినా గులాబి పువ్వు యొక్క కాడ వూగిసలాడుతుంది. పువ్వులోని ప్రతి రేకు తళ తళ మెరుస్తుంది. దానిని చూస్తే అది నిజమైన గులాబీ పువ్వే అనే భావం కలుగుతుంది. దాని పక్కనే వున్న మొగ్గ అప్పుడే వికసించనున్నదా అనిపిస్తుంది.

ఈ పువ్వు యొక్క కాడ, దానికుండే ముళ్లు ప్లాటినమ్‌తో తయారు చేయబడ్డాయి. ఆకులూ, పూరేకులూ, 1,466 రత్నాలతో తయారు చేయబడ్డాయి. వాటన్నిటి మొత్తం బరువు 47 కేరట్‌లు.

ఈ పువ్వును తయారు చేయడమన్నది ఎంతో క్లిష్టమైన, శ్రమతో కూడిన పని అని వేరే చెప్పనక్కరలేదు. దానిని తయారు చేయడానికి ఆ అగసాలులు ప్లాటినమ్ రేకులమీద వందలాది అతి సూక్ష్మమైన బెజ్జాలు వేసి వాటిలో రత్నాలను పొదగవలసి వచ్చింది.

"రెండు లోన్ల వరకే పరిమితం. రెండూ తీరేదాకా మూడవది యివ్వరు" అన్నాడు క్లర్కు. తన నవ్వుకి కారణం చెబుతూ.

"ఎలా ?"అంటూ సర్నాథం తెల్లముఖం వేసేడు.

"అంతే" ముఖం చిట్లించి చూచేడు క్లర్కు.

"పెళ్లికి వెళ్ళాలే–మాదగ్గరిబంధువులది" అంటూ గుటకలు మింగేడు గుర్నాథం !

"అది నాకు తెలియదు. మీ ప్రయత్నం మీరు చేసుకోండి. రూల్సు ఒప్పవు. మూడో లోను రాదు"అన్నాడు క్లర్కు మరో ఫైలు ముందేసుకుంటూ యింక వెళ్లమన్నట్లుగా చూస్తూ.

గుర్నాథం లోను క్లర్కువంక గుర్రుగా చూచేడు. గాటిదగ్గర గడ్డిని కాపలా కాచే కుక్కని చూచినట్లు. గడ్డి దానికి పనికిరాదు ! అయినా ఆ గడ్డి తినే జంతువుని అది దగ్గరికి రానివ్వదు.

గుర్నాథం సాయంత్రం లేటుగా యింటికి వెళ్ళేడు. "ఇంతాలస్యమయిందేం"అన్నది భార్య కాళ్ళకి నీళ్ళిస్తూ.

"పనివుండి" అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పి ముఖం ప్రక్కకి త్రిప్పేడు భార్య కళ్ళల్లోకి చూచేధైర్యం లేక.

'లోను వచ్చిందా' అన్నది భార్య భర్త నిర్లక్ష్యానికి మండిపడుతూ.

"రూల్సు ఒప్పవు" గుర్నాథం తలవంచుకొని సమాధానం చెప్పేడు.

రూల్సు ఒప్పుకోవు

"దేనికి ?"

"లోను యివ్వటానికి" భర్త సమాధానం.

"మరెలా ?" భార్య ప్రశ్న.

"అంటే–?"గుర్నాథం అవరోధం.

"పెళ్లికి వెళ్ళకపోతే బాగుండదు. ఎలా

తెల్లారిన బ్రతుకు

— పంతుల లక్ష్మణమూర్తి.

"పరిచారికలతో
పట్టుబట్టలతో
పట్టపురాణిలా
భార్య ;
యౌవ్వన పొంగుతో
ఇష్ట సఖులతో
యువరాణిలా
కూతురు ;
మంత్ర్యాదులతో
సేవకులతో
చక్రవర్తిలా
తాను ;"
కల కరిగింది
తెల్లారింది
రొటీన్ గుమాస్తా
జీవితంలో తానూ!
తెల్లారిన తన బ్రతుకూ !!

గైనా డబ్బు పట్టండి."

"ఎక్కడినుంచి తేను" అసమర్ధుడైన గుర్నాథం అభ్యర్థన.

"ఎలాగైనా సరే"భార్య మంకుపట్టు.

"రూల్సు ఒప్పవు"గుర్నాథం సమాధానం.

"ఎందుకు ?"

"తీవు మంజూరు చెయ్యటానికి" గుర్నాథం బ్రహ్మాస్త్రం వదిలేడు.

"పోనీ మీరు వుండండి. నేను పిల్లలూ వెడతాం" అన్నది గుర్నాథం భార్య సీతారత్నం.

"ఎలా వెడతారు ?" ఆశ్చర్యంగా చూచాడు గుర్నాథం.

"గొలుసు తాకట్టుపెట్టి డబ్బు తెండి" అన్నది సీతారత్నం స్థిర నిశ్చయంతో.

"తాకట్టు విడిపించేదెలా?"

"అప్పటి సంగతి అప్పుడు చూద్దాం"

"తీర్చవద్దూ. మోసేవాడికి తెలుస్తుంది కావడి బరువు"

"ఉహూ, బాగుండదు. అందరూ వెళ్లి మనం వెళ్లకపోతే చిన్నతనంగా వుంటుంది. అమ్మా, నాన్నా బాధపడతారు"

"అయితే"

"గొలుసు తీసుకెళ్లండి" అంటూ మెడలోని మూడు పేటల చంద్రహారం తీసి యిచ్చింది.

గుర్నాథం చేతులు వణికాయి.

కాళ్లు తడబడేయి!

పెళ్లికి వెళ్లితీరాలి !

వెళ్లకపోలేనం ?

"కొంపలారిపోతాయా ?

"పెళ్లి ఆగిపోతుందా?"

"ప్రపంచం మునిగిపోతుందా ?"

బ్రతుకుకంటే, సాంప్రదాయం, ఆచారం, అలవాట్లు కట్టుబాట్లు గొప్పవా?

మింగమెతుకు లేకపోయినా మీసాలకి సంపెగనూనె రాయకతప్పదా ?

"అవును. సాంఘిక రూల్సు ఒప్పవు మరి. బంధువుల్లో నగుబాట్లు తప్పవు!

అయిన వారి నిష్ఠూరాలు తప్పవు
అందరిలో చిన్నతనం !
కొందరిలో తలవంపులు !

అప్పైనా చేసి పప్పుకూడు తినవలసిందే! పెళ్ళికి వెళ్ళాల్సిందే! బట్టలు కొనవలసిందే! ప్రజెంట్లు యివ్వవలసిందే !


అంతా మామూలే ! ప్రపంచం మునగనీ,

ప్రపంచము యొక్క ప్రప్రథమ డెటర్జెంట్ ఉతికే బార్

సూపర్ 777



హెచ్చు తెల్లదనము, తక్కువ ఖర్చులో



సూపర్ 777 ఉతుకు ప్రపంచములో సరిక్రొత్తది!
ఇది క్రొత్త ఫార్ములా. దీనికి ఎక్కువ బట్టలను ఎక్కువ
తెల్లగా, ఎక్కువ శుభ్రముగా ఉతికే సామర్థ్యము
ఉన్నది—ఉప్పు నీళ్లలో కూడ! దీని ధర మామూలు
బార్ సబ్బుల కంటె తక్కువ కూడ!

ఒక క్రొత్త రకపు ఉతికే బార్‌ను వాడడము ప్రారంభించండి—సూపర్ 777 డెటర్జెంట్ ఉతికే బార్!

shilpi hpma 6A/73 TEL

రూల్సు ఒప్పుకోవు

ప్రళయం ముంచుకురానీ, దేశం దుస్థితిపాలు కానీ, కుటుంబం క్రుంగి పోనీ, జరగవలసింది జరిగి తీరవలసిందే!

అందుకు భిన్నంగా జరగటానికి రూల్సు ఒప్పవు!

ఆఫీసు రూల్సుకి వ్యతిరేకం సంఘంలోని రూల్సు!

ఆ రూల్సు అప్పులు చెయ్యవద్దంటుంది! ఈ రూల్సు అప్పులు చేసైనా పదుగురిలో పరువు నిలబెట్టుకొమ్మంటుంది! సాంఘిక న్యాయాన్ని పాటించమంటుంది! ఒంట్లో సత్తువ లేకున్నా, యింట నూకలు లేకున్నా ఈ పరుగు పందెంలో అందరూ పాల్గొనవలసిందే! మానుకోవటానికి వీలులేదు! అందుకు రూల్సు ఒప్పవు! గుర్నాథం శలవు మంజూరు కాక యింటనే వుండిపోయాడు! అతన్ని కట్టిపడేసే రూల్సు వేరు! గుర్నాథం భార్యని లాక్కు వెళ్ళిన రూల్సు వేరు! అవి ఆవిడ్ని ఆపలేవు! వాటిననుసరించి ఆవిడ నడుచుకోవలసిందే!

రూలు రూలేమరి! అది అతిక్రమించరానిది!

హైదరాబాద్ నోట్‌బుక్

(6వ పేజీ తరువాయి)

మన్నారు. ఈ ప్రదర్శనంలో రామాయణ, మహాభారత, భాగవత కథలను వర్ణించే చిత్రాలు, శివ లీలలు, దేవీలీలలు వర్ణించే చిత్రాలు, 72 ఉన్నాయి. ప్రాచీన సంప్రదాయంలో ఆధునికులు రచించిన చిత్రాలలో పార్వతీ పుత్రుడు— వై. సుబ్రహ్మణ్యరాజు, యశోదాకృష్ణ — కె.రామచంద్రన్, వైకుంఠ నారాయణ— సుబ్రహ్మణ్యరాజు కుమారుడు వై. కృష్ణంరాజు ప్రశంసనీయమైనవి. ప్రాచీన చిత్రాలలో విరాట్ విశ్వస్వరూప,మన్మథ—పంచనారి మొదలయినవాటి సౌందర్య సౌకుమార్యాలు వర్ణనాతీతమయినవి. శ్రీ సుబ్రహ్మణ్యరాజు తమ పూర్వులు శ్రీ తత్వనిధి అనే శ్రీ విద్యాగ్రంథం ఆధారంగా గీసిన అపూర్వ చిత్రావళిని ప్రత్యేకంగా చూపారు. దీనిలో నవగ్రహాలు, నక్షత్రాలు, తదధి దేవతా పురస్సరంగా చిత్రింపబడినవి. 32 విధాల గణపతులు, శివలీలలు, లలితా లీలలు, చిత్రితాలు. కామధేనువు, శ్రీ తత్వనిధి ఆధారంగా, మూడు కన్నులు, ఐదు చన్నుల పొదుగు, మూడు కొమ్ములు— ఉన్న విచిత్ర రూపంతో చిత్రితం. శ్రీ సుబ్రహ్మణ్యరాజు మాతృ భాష తెలుగు. "మా పూర్వులు తెలుగు దేశం నుంచి కన్నడ దేశానికి వలసపోయారు. మేము తెలుగును కాపాడుకుంటున్నాము' అన్నారు ఆయన. శ్రీ రాజు పెన్నిధిగా కాపాడుకుంటున్న ఈ చిత్రావళి నశించకుండా ముద్రించడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయం చేయడం అవసరం.

బ్రాహ్మణ మహాసభ

కుల విద్వేషాలకు అతీతంగా కేవలం బ్రాహ్మణ ధర్మకర్మ ప్రచారం కోసమే ఏర్పడిన బ్రాహ్మణ మహాసభ కార్యకర్తల శిబిరం ఆగస్టు 9, 10 తేదీలలో గౌళిపుర- రామాలయంలో జరిగింది. శ్రీయుతులు పద్మభూషణ శ్రీ సుందేరావ్‌హార్కారే, తొయ్యేటి బాలకృష్ణమూర్తి, లక్ష్మినారాయణశర్మాజీ ముదిగొండ శివప్రసాద్, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డాక్టర్ వఝ్ఝారి కృష్ణమోహనరావు, తూండ్ల వెంకటకృష్ణశర్మ, ఎ. వెంకటరావు, చావలి సూర్యనారాయణ మొదలైనవారు ధర్మం, వేద ప్రాముఖ్యం, శ్రీ విద్య—ఆధునిక విజ్ఞానం మొదలైన విషయాలపై ప్రసంగించారు.

ఉపశ్రుతి

"'ఇంగ్లీషు తండ్రి భాష. తెలుగు తల్లిభాష. సంస్కృతం అమ్మమ్మ భాష' అని, శ్రీ విశ్వనాథ వారు అంటున్నారే, తాత భాష ఏదండి?" అని అడిగారు ఆగస్టు 4న శ్రీ మండలి కృష్ణారావు, సన్మాన సభలో నా ముందు కూర్చున్న ఒక శ్రోత. నేను ఆలోచనలోపడ్డాను. ఇంతలో "తాత భాష ప్రాకృతమండీ!" అన్నది నా పక్కన కూర్చున్న ఒక విద్యార్థిని. పేరు కె. శారద. 9వ తరగతి నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాల

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna

ఆంధ్రసచిత్రవారపత్రిక

1975 'దీపావళి'కి ప్రత్యేకం!

"చిన్న సీరియల్ కథ" ల పోటీ!

మొత్తం రు. 5000 ల బహుమతులు

ఏటా నిర్వహిస్తున్న కథల పోటీ బదులు యీ ఏడు, రచయితల, పాఠకుల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని "చిన్న సీరియల్ కథల" పోటీని నిర్వహిస్తున్నాము. సంపాదకుని ఎన్నికలో అత్యుత్తమంగా తేలిన **నాలుగు** సీరియల్ కథలను, ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఒకదాని తర్వాత ఒకటి వంతున వరుసగా వెలువరించి, వాటిపై పాఠకుల బ్యాలట్ తీసుకొని యెప్పటివలె అదనపు బహుమతులను కూడా విజేతలైన రచయితలకు అందించుతాము.

ముగింపు తేదీ మంగళవారం 16-9-1975

పోటీలో నెగ్గిన నాలుగు రచనలలో ఒక్కొక్క "చిన్నసీరియల్ కథ"కు రు. 800 లు చొప్పున పారితోషికం అందజేస్తాము.

ఇదిగాక పాఠకుల 'బ్యాలట్'**లో** ప్రథమస్థానాన్ని పొందిన రచనకి రు 600లు, ద్వితీయ స్థానం, తృతీయ స్థానం పొందిన రచనలకు రు 500లు, రు 400లు చివరి కథకు రు. 300 లు చొప్పున అదనపు బహుమతులు యిస్తాము.

నిబంధనలను గమనించి యీ పోటీలో లోగడకన్నా ఎక్కువమంది రచయితలు పాల్గొని ఈ కొత్త తరహా పోటీని జయప్రదం చేయగలరని అనుకుంటున్నాము.

- ★ చిన్న సీరియల్ కథ అంటే ఆంధ్ర సచిత్ర వార పత్రికలో నాలుగు వారాలు వేయటానికి సరిపోయే 'పెద్ద కథ' అనుకోవచ్చును.
- ★ కథ నిడివి **50** అరఠావులకి (పేజీకి 600 అక్షరాలు మించకుండా) దాటకూడదు. ఇతివృత్తం తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించినదై వుండాలి. తేట తెలుగు వ్యావహారిక భాషలోనే వ్రాయటం అవసరం.
- ★ కథ అనువాదం, అనుసరణ కారాదు. ప్రసారమైనా ప్రచురణ అయినా, లేదా యితర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న, కథలను పంపరాదు. ఇతరులు వ్రాసిన కథలను వారిపేరులోనే అయినామరొకరు పంపకూడదు. హామీ పత్రం కథతోపాటు విధిగా వుండాలి. దానిమీద రచన పేరు రచయిత చిరునామా కూడా విడి విడి అక్షరాలలో వుండాలి.
- ★ రచనలపై వచ్చే పేచీలకు రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది.
- ★ "1975 దీపావళి చిన్న సీరియల్ కథల పోటీ: సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ - 520003 అన్న చిరునామాకి రచనలను పంపాలి. పోటీలో పాల్గొన్న రచయితలు తమ 'కథ'తో పాటు స్వంత 'చిరునామా గల' తగినన్ని తపాలా బిళ్ళలు అంటించిన పెద్ద కవరును జతపరచాలి. పోటీలో ఎన్నిక కాని రచనలను వీలువెంబడి వారికి త్రిప్పి పంపడం జరుగుతుంది.
- ★ రచనలన్నీ మా కార్యాలయానికి 16-9-75 మంగళవారం సాయంకాలానికి అందాలి. ఆటు తరువాత అందిన రచనలను పోటీకి పరిశీలించలేము. టపా ఆలశ్యం కావటం, మార్గంలో పోవటం లాంటి యిబ్బందులకు సంపాదకుని బాధ్యత లేదు.
- ★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫొటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి, వాటి ప్రచురణకు అంగీకరించాలి. అలా యిష్టం లేనివారు కథల పోటీకి తమ రచనలు పంపకపోవటమే మంచిది.
- ★ ఎన్నికైన నాలుగు కథలలో మొదటిదాని ప్రచురణ 1975 దీపావళి సంచికలో ప్రారంభం కావచ్చు. నాలుగు కథల ప్రచురణ పూర్తి కాగానే అనగా 16 వారాల తర్వాత 'బ్యాలట్' పత్రం ద్వారా పాఠకుల తీర్పును తీసుకుంటాము.

— సం.


కొత్తదనంలో సింగారాలు!
కోనసీమలో శృంగారాలు!
కోటి కాంతులు వెదజల్లే
కమనీయ చిత్రం!
యస్.వి.యస్ ప్రొడక్షన్సు వారి
చిట్టెమ్మ - చిలకమ్మ
స్క్రీన్‌ప్లే: పి. చంద్రశేఖరరెడ్డి B.A.
దర్శకత్వం: పోలవరపు బ్రహ్మానందరావు
NAVRANG
కథ: యస్.వి. సుబ్బరాజు
నిర్మాత: అల్లూరి వెంకట్రాజు
మాటలు: అప్పలాచార్య ; సంగీతం: సత్యం
ఆంధ్ర: సువర్ణా ఫిలింస్. సీడెడ్: నటేష్ ఫిలిం ఎక్స్‌చేంజ్